PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 42 సంచిక : 344 | విజయవాడ, శుక్రవారం 14 జులై 2023 | 8+8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Friday 14 July 2023 | Rs

అదానీపై సా...గుతున్న సెబీ విచారణ

- గడువు పొడిగించినా వెలుగు చూడని వాస్తవాలు
- ప్రభుత్వ పెద్దల ప్రమేయముందన్న అనుమానాలు

లోపలి పేజీలో..

100మీ. హర్డిల్స్‌లో జ్యోతి యర్రాజికి స్వర్ణం



బ్యాంకాక్: ఆసియా అథ్లెటిక్స్ పోటీల్లో ఆంధ్రప్రదేశ్ క్రీడాకారిణి జ్యోతి యర్రాజి మహిళల 100 మీటర్ల హార్డిల్స్‌లో ఛాంపియన్‌గా నిలిచింది. గురువారం జరిగిన 100మీ. హర్డిల్స్ ఫైనల్స్‌లో విశాఖకు చెందిన 23ఏళ్ల జ్యోతి 13.09సెకన్లలో గమ్యానికి చేరి అగ్రస్థానంలో నిలిచింది. అంతర్జాతీయ పోటీల్లో జ్యోతికి ఇదే తొలి స్వర్ణం. దీంతో ఆసియా అథ్లెటిక్స్ పోటీల్లో జ్యోతి దేశానికి తొలి స్వర్ణం అందించింది.

బిజెపిని గద్దె దింపాల్సిందే

- రాష్ట్రంలోని మూడు పార్టీలూ కేంద్రానికి సాగిలపడ్డాయి
- వ్యతిరేకంగా ప్రజాసమీకరణ చేపడతాం
- 'అనంత' బహిరంగ సభలో వక్తలు


బహిరంగ సభావేదిక నుంచి ప్రజలకు అభివాదం చేస్తున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

దేశానికి అత్యంత ప్రమాదకరంగా మారిన మతతత్వ, ప్రజా వ్యతిరేక బిజెపిని గద్దె దించాలని లక్ష్యమని సిపిఎం పొలిట్ బ్యూరో సభ్యులు ఎంఎ.బేబి పిలుపునిచ్చారు. సిపిఎం అనంతపురం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం బహిరంగ సభ నిర్వహించారు. అంతకుముందు టవర్‌క్లాక్ నుంచి సప్తగిరి సర్కిల్ మీదుగా నగర పాలక సంస్థ కార్యాలయం వరకు ప్రదర్శన నిర్వహించారు. అనంతరం సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్ అధ్యక్షతన జరిగిన బహిరంగ సభలో సిపిఎం పొలిట్ బ్యూరో సభ్యులు ఎంఎ.బేబి, బివి.రాఘవులు, కేంద్ర కమిటీ సభ్యులు ఎంఎ.గఫూర్ ప్రసంగించారు. ఎంఎ.బేబి మాట్లాడుతూ.. మతతత్వ, ప్రజా వ్యతిరేక విధానాలు బిజెపి అవలంభిస్తోందని విమర్శించారు. ప్రజల మధ్య వైషమ్యాలు పెంచి ఎన్నికల్లో విజయం సాధించేందుకు ప్రయత్నిస్తోందని దుయ్యబట్టారు. బిజెపిపై వ్యతిరేకత దేశవ్యాప్తంగా కనిపిస్తోందన్నారు. కలిసొచ్చే పార్టీలతో రాబోయే ఎన్నికల్లో పనిచేయనున్నట్లు తెలిపారు. బివి.రాఘవులు మాట్లాడుతూ.. నిత్యావసర సరుకులను సబ్సిడీతో అందివ్వాలని డిమాండ్ చేశారు. కేంద్రం ఆదేశాలకు అనుగుణంగా విద్యుత్ ఛార్జీల భారాన్ని ప్రజలపై రాష్ట్ర ప్రభుత్వం మోపుతోందన్నారు. విభజన సమయంలో రాష్ట్రానికిచ్చిన ఏ ఒక్క హామీని కేంద్రం నెరవేర్చకపోయినా గట్టిగా అడిగే పరిస్థితుల్లో రాష్ట్ర ప్రభుత్వం లేదని విమర్శించారు. బిజెపి, ఆ పార్టీతో కలిసి పనిచేసే ఇతర పార్టీల ఓటమే లక్ష్యంగా వామపక్షాలు పనిచేస్తాయని తెలిపారు. ఎంఎ.గఫూర్ మాట్లాడుతూ.. అంగన్‌వాడీలకు తెలంగాణ కంటే వెయ్యి రూపాయలు అదనంగా వేతనమిస్తామని ప్రతిపక్షనేత హోదాలో జగన్ హామీనిచ్చారని గుర్తు చేశారు. అయితే అక్కడ రూ.13,500 ఇస్తుంటే.. ఇక్కడ రూ.10 వేలు లోపే ఇస్తున్నారని తెలిపారు. అసంఘటిత రంగంలోని కార్మికులకు వేతనాలు సవరించాలని..వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కొత్తలో వినతిపత్రం ఇచ్చామని, 40 రోజుల్లో కమిటీ వేసి వేతనాలు సవరిస్తామని ముఖ్యమంత్రి హామీనిచ్చారని గుర్తు చేశారు. నాలుగున్నరేళ్లు అయినా ఇప్పటికీ పరిష్కారం చేయలేదన్నారు. మాట తప్పను మడమ తిప్పనంటే ఇదేనా అని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఒ.నల్లప్ప, సావిత్రి, బాలరంగయ్య, సిపిఎం నగర కార్యదర్శి రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

యుసిసిపై మీ వైఖరేమిటి?

- రాష్ట్రంలోని పార్టీలను ప్రశ్నించిన బివి.రాఘవులు, ఎంఎ.బేబి

3

చంద్రయాన్-3కి కౌంట్‌డౌన్ ప్రారంభం

- నేడు శ్రీహరికోట నుంచి ప్రయోగం

ప్రజాశక్తి-సూళ్లూరుపేట

చంద్రయాన్-3 ప్రయోగంతో సరికొత్త అధ్యయనానికి ఇస్రో శ్రీకారం చుట్టబోతుంది. తిరుపతి జిల్లా సతీష్ ధావన్ స్పేస్ సెంటర్ షార్ నుండి శుక్రవారం మధ్యాహ్నం 2.35 నిమిషాలకు ఇస్రో ఎల్‌విఎం3-ఎం4 రాకెట్ ద్వారా చంద్రయాన్-3 ప్రయోగం జరపనుంది. ఇందుకు సంబంధించి గురువారం మధ్యాహ్నం 1.05 గంటకు కౌంట్‌డౌన్ ప్రారంభమైంది. ఈ ప్రక్రియ 25 గంటల 30 నిమిషాల పాటు కొనసాగనుంది. చంద్రునిపై దాగి ఉన్న రహస్యాలను ఛేదించడానికి సరికొత్త సాంకేతిక పరికరాలను అమర్చిన చంద్రయాన్-3ను ఇస్రో పంపనుంది. ఇది 41 రోజుల పాటు ప్రయాణించి, ఆగస్టు 23 తరువాత చంద్రునిపై దక్షిణ ధ్రువంలోని నిర్దేశిత ప్రదేశంలో ల్యాండ్ అవుతుందని ఇస్రో తెలిపింది. గురువారం ఉదయం తిరుపతి జిల్లాలోని సూళ్లూరుపేటలో ఉన్న శ్రీ చెంగాళమ్మ పరమేశ్వరిని ఇస్రో చైర్మన్ సందర్శించి, పూజలు చేశారు. చంద్రయాన్ -3 ప్రయోగం తర్వాత పిఎస్‌ఎల్‌వి రాకెట్‌ను ప్రయోగించనున్నట్లు ఆయన తెలిపారు. వచ్చే నెల చివరిలో ఆదిత్య ఉపగ్రహ ప్రయోగం ఉంటుందని, ఇందుకు సంబం ధించి పరీక్షలు జరుగుతున్నాయని చెప్పారు. 2008లో నిర్వహించిన చంద్రయాన్ -1తో చంద్రునిపై నీటి జాడలను ఇస్రో గుర్తించింది. 2019లో చేపట్టిన చంద్రయాన్-2 చివరి నిమిషంలో అంటే చంద్రుడి ఉపరితలంపై ల్యాండింగ్ సమయంలో విఫలమయింది. ఆ ప్రయోగంలో ప్రయోగించిన ఆర్బిటర్ చంద్రుడి చుట్టూ కక్ష్యలో ఇప్పటికీ తిరుగుతోంది. ఇప్పటికీ విలువైన సమచారాన్ని పంపుతోంది. ప్రస్తుత చంద్రయాన్-3లో ఆర్బిటర్‌ను పంపడం లేదు. గత వైఫల్యాన్ని అధిగమించేలా చంద్రయాన్-3ను రూపొందించామని ఇస్రో తెలిపింది.


యూనివర్శిటీల వైస్ ఛాన్సలర్లతో సిఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి

ఉన్నత విద్యారంగంలో మార్పులు తెద్దాం

- అకడమిక్ బోర్డు ఏర్పాటు
- కరిక్యులమ్‌కు కొత్త ప్రణాళిక
- వర్చువల్, ఎఐ విధానాలు అమలు
- విసిల సమీక్షలో సిఎం జగన్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఉన్నత విద్యారంగంలో నూతన మార్పులు తీసుకువద్దామని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అన్నారు. రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాల వైస్ ఛాన్సలర్లతో క్యాంపు కార్యాలయంలో గురువారం ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మార్పులకు శ్రీకారం చుట్టాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. లక్ష్యాలు ఘనంగా నిర్దేశించుకున్నప్పటికీ ఆచరణలో వాటిని అందుకోలేకపోతున్నామని, దీనికి కారణం ఏమిటో ఆలోచించాలని చెప్పారు. నూతన విజన్ కోసం ప్రపంచంలోనే అత్యుత్తమ ప్రతిభావంతులతో ఉన్నత స్థాయి అకడమిక్ బోర్డును ఏర్పాటు చేస్తామని చెప్పారు. కరిక్యులమ్‌ను రీడిజైన్ చేసి నూతన పాఠ్య ప్రణాళికను రూపొందించాలన్నారు. బోధన, ప్రశ్నపత్రాల తీరును మారుద్దామన్నారు. వర్చువల్ రియాలిటీ, ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ (ఎఐ) లను పాఠ్య ప్రణాళికలో భాగం చేయడంతో పాటు, బోధనలో కూడా వాడుకోవాలని సూచించారు. వీటిని సమర్థవంతంగా అమలు చేయడం కోసం బోర్డును ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. .1784లో మొదటి సాంకేతిక విప్లవం వచ్చిందన్నారు. ఇప్పుడు ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ రూపంలో నాలుగో విప్లవం దిశగా అడుగులు వేస్తున్నామని చెప్పారు. రాబోయే రోజుల్లో విద్యావిధానాన్ని ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ పూర్తిగా మార్చబోతోందని తెలిపారు. తగిన విధంగా అడుగులు వేయగలిగితే ఈ రంగాల్లో అగ్ర శేణిలో నిలవవచ్చని చెప్పారు. జర్మనీ వంటి దేశంలో నైపుణ్యం ఉన్న మానవ వనరుల కొరత ఉందని ఆ దేశ కాన్సులేట్ జనరల్ తనను కలిసిన సమయంలో చెప్పారని వివరించారు. మన దేశం, రాష్ట్రంలో సుమారు 70శాతం మంది పని చేసే వయసులో ఉన్నారని, వీరికి సరైన నాలెడ్జ్, స్కిల్స్ ఇచ్చి సమర్థవంతంగా వినియోగించుకోవాలని అన్నారు. ఆ లక్ష్యంతోనే విద్యారంగంలో మార్పులకు శ్రీకారం చుట్టాలన్నారు. తాను పలువురితో చర్చించిన అంశాలను విసిల ముందు పెడుతున్నానని, ఇవి కార్యాచరణలోకి వచ్చేలా రూపకల్పన జరగాలని తెలిపారు.

చదువుకునే విద్యార్థులకు మరిన్ని ఆప్షన్లు ఇవ్వాలని సూచించారు. డిగ్రీలకు సంబంధించిన క్రెడిట్స్ స్థాయిని కూడా పెంచాల్సి ఉందన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌ను పూర్తిగా వినియోగించుకోవాలని చెప్పారు. సెక్యూరిటీ అనాలసిస్, రిస్క్ మేనేజ్‌మెంట్ వంటి వర్టికల్ కోర్సులకు సంబంధించి బోధన చేసే స్థాయిలో ఉన్నామా? లేదా? అనేది చూడాలని చెప్పారు. మెడికల్ కోర్సుల బోధనలో కూడా మార్పులు గణనీయంగా రావాల్సి ఉందన్నారు. 5 ఏళ్ల మెడికల్ కోర్సుల్లో మిగతా 2లో


ఫ్రాన్స్ సెనెట్ అధ్యక్షులు గెరార్డ్ లార్చర్‌తో గురువారం సమావేశమైన ప్రధానమంత్రి నరేంద్ర మోడీ

ఫ్రాన్స్‌లో మోడీ

- రాఫెల్ జెట్లు, స్కార్పియన్ జలాంతర్గాముల కొనుగోలుకు ఒప్పందం
- నేడు మాక్రాన్‌తో ద్వైపాక్షిక చర్చలు

న్యూఢిల్లీ : నౌకల నుండి ప్రయోగించగల రాఫెల్ జెట్‌లను, స్కార్పియన్ జలాంతర్గాములను ఫ్రాన్స్ నుండి కొనుగోలు చేయడానికి భారత్ గురువారం ఆమోద ముద్ర వేసింది. రెండు రోజుల పర్యటన నిమిత్తం ప్రధాని నరేంద్ర మోడీ గురువారం పారిస్ చేరుకున్నారు. పర్యటనలో భాగంగా తొలుత ఆయన ఫ్రాన్స్ ఎగువ సభ (సెనెట్) అధ్యక్షులు గెరార్డ్ లార్చర్‌తో గురువారం సాయంత్రం సమావేశమయ్యారు. అంతకుముందు పారిస్ విమానశ్రయంలో ఫ్రాన్స్ ప్రధానమంత్రి ఎలిజిబెత్ బోర్నే, పారిస్‌లో నివసిస్తున్న భారత సంతతి ప్రజలు మోడీకి ఘనంగా స్వాగతం పలికారు. బాస్టిల్లే పతనం వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించనున్న వేడుకులకు మోడీ ముఖ్య అతిథిగా మిగతా 7లో

ఉద్యోగుల సమస్యలన్నింటికీ సానుకూల పరిష్కారం

- కాంట్రాక్టు ఉద్యోగుల రెగ్యులరైజేషన్ ప్రక్రియ వేగవంతం
- జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ సమావేశంలో సిఎస్ జవహర్ రెడ్డి


విప్రోలో తగ్గుతున్న ఉద్యోగులు

- క్యూ1లో రూ.2,870 కోట్ల లాభాలు

లోపలి పేజీలో..

ఢిల్లీ విలవిల

- యమునా నదికి పోటెత్తిన వరద
- జల దిగ్బంధనంలో రాజధాని
- అత్యవసర సేవలు మినహా మిగతా కార్యాలయాలన్నీ బంద్
- విద్యాసంస్థలకు సెలవులు
- పలు రైళ్ల రద్దు


లోతట్టు ప్రాంతాలను వరద నీరు ముంచెత్తడంతో ఫ్లైఓవర్ల కింద బిక్కుబిక్కుమంటూ కాలం వెళ్లదీస్తున్న ఢిల్లీ వాసులు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

గత నాలుగు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు యమునా నది పొంగిపొర్లడంతో రాజధాని ఢిల్లీ వరదల్లో చిక్కుకుని విలవిలలాడుతోంది. వేలాది మంది ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. అత్యవసర సేవలు మినహా మిగిలిన అన్ని ప్రభుత్వ, ప్రయివేటు కార్యాలయాలను మూసివేశారు. పాఠశాలలు, కళాశాలలు సహా విద్యా సంస్థలన్నిటికీ ఆదివారం వరకు సెలవు ప్రకటించారు. గురువారం మధ్యాహ్నం 2 గంటలకు యమునా నది నీటి మట్టం ఆల్ టైమ్ రికార్డు స్థాయికి చేరుకొని 208.82 మీటర్లగా నమోదైంది. దీంతో ఢిల్లీలోని వీధులు, లోతట్టు ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి. ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రివాల్ నివాసం కూడా వరద తాకిడికి గురైంది. ఎర్రకోటను వరద నీరు ముంచెత్తింది. దీంతో నగర వాసులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. వరద నీరు పోటెత్తడంతో నగరంలోని పలు చోట్ల ట్రాఫిక్ స్థంభించిపోయింది. రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. యమునా బ్యాంక్ మెట్రో స్టేషన్ వద్ద రోడ్డులో వరద నీరు వచ్చి చేరడంతో ఈ స్టేషన్ తోపాటుగా బ్లూలైన్ గూండా వెళ్లే మెట్రో సర్వీసులను నిలిపివేశారు. ఎన్‌డిఆర్‌ఎఫ్ 12 సహాయక బృందాలను రంగంలోకి దింపి లోతట్టు ప్రాంతాల ప్రజలను రక్షిత ప్రాంతాలకు తరలిస్తోంది. ఇప్పటి వరకు 20 వేల మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించింది.

నదులను తలపిస్తున్న రహదారులు...

ఢిల్లీ రహదారులన్నీ నదులను తలపిస్తున్నాయి. సాధారణ జనజీవనం స్తంభించిపోయింది. ఇళ్లు, ఆస్పత్రులు, శ్మశానవాటికలు, షెల్టర్ హోమ్‌లలోకి కూడా నీరు ప్రవహించింది. రోడ్లన్ని జలమయం అయ్యాయి. ఢిల్లీ సచివాలయంలోని ముఖ్యమంత్రి కేజ్రీవాల్, ఆయన కేబినెట్ సహచరుల కార్యాలయాలు నీట మునిగాయి. రాజ్‌ఘాట్ నుంచి సచివాలయం వరకు ఉన్న రోడ్డు కూడా మునిగింది. ఇండియా గేట్ పరిసరాల్లోకి వరద నీరు చేరడంతో ప్రభుత్వ కార్యాలయాల్లో కార్యకలాపాలకు మిగతా 7లో

హైదరాబాద్ జంట పేలుళ్ల దోషులకు పదేళ్ల జైలు

- తీర్పు ప్రకటించిన ఎన్‌ఐఎ కోర్టు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

దేశంలో పేలుళ్లకు పాల్పడి విధ్వంసం సృష్టించిన కేసులో నలుగురు ఇండియన్ ముజాహిదీన్ తీవ్రవాదులకు ఎన్‌ఐఎ కోర్టు జైలు శిక్ష విధించింది. నలుగురికి పదేళ్ల జైలు శిక్ష విధిస్తూ ఢిల్లీలోని ఎన్‌ఐఎ ప్రత్యేక న్యాయస్థానం గురువారం తుది తీర్పు వెలువరించింది. గతంలో హైదరాబాద్, ఢిల్లీలోని పలు ప్రాంతాల్లో పేలుళ్లకు రెక్కీ నిర్వహించారు. పేలుళ్ల కోసం ఆయుధాలను సైతం సమకూర్చుకున్నారు. హైదరాబాద్‌కు చెందిన ఒబేద్ రెహమాన్, బిహార్‌కు చెందిన ధనిష్ అన్సారీ, ఆఫ్తాబ్ ఆలం..మహారాష్ట్రకు చెందిన ఇమ్రాన్‌ఖాన్‌లను 2013లో ఎన్‌ఐఎ అరెస్ట్ చేసింది. 2007లో హైదరాబాద్‌లోని గోకుల్‌చాట్, లుంబీపార్కు జంట పేలుళ్ల.. 2013లో దిల్‌సుఖ్‌నగర్ జంట పేలుళ్ల కేసులో నిందితుల పాత్ర ఉన్నట్లు ఎన్‌ఐఎ దర్యాప్తులో తేలింది. వారణాసి, ముంబయి, ఘజియాబాద్, అహ్మదాబాద్, బెంగళూరులో జరిగిన పేలుళ్లలోనూ ఈ నలుగురి హస్తం ఉన్నట్లు ఎన్‌ఐఎ గుర్తించింది.




ట్రిపుల్ ఐటి కోర్సుల ప్రవేశ ఫలితాలను విడుదల చేస్తున్న విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, అధికారులు

ట్రిపుల్ ఐటి అర్హుల జాబితా విడుదల

- టాప్-20లో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులే
- 20 నుంచి కౌన్సిలింగ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాజీవ్ గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ టెక్నాలజీ (ఆర్‌జియుకెటి)లోని ట్రిపుల్ ఐటి కోర్సుల ప్రవేశ ఫలితాలు విడుదలయ్యాయి. విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ విజయవాడలో గురువారం ఈ ఫలితాలను విడుదల చేశారు. రాష్ట్రంలోని నాలుగు క్యాంపస్‌లలో 4,400 సీట్లకు గాను ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల నుంచి 38,355 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారు. బాలికలు 2,585 మంది, బాలురు 1455 మంది అర్హత సాధించారు. ప్రభుత్వ పాఠశాలల నుంచి 3,345 (82.79శాతం) మంది, ప్రైవేట్ పాఠశాలల నుంచి (17.20శాతం) మంది ఎంపికయ్యారు. అనకాపల్లి జిల్లా అచ్యుతాపురం ఎపి రెసిడెన్షియల్ బాలికల పాఠశాలకు చెందిన కామిరెడ్డి హేమశ్రీ మొదటి, శ్రీకాకుళం జిల్లా పాతపట్నం ప్రభుత్వ పాఠశాలకు చెందిన మిట్టు మహపాత్రో, బాపట్ల జిల్లా వలపర్ల ఉన్నత పాఠశాలకు చెందిన పొలిశెట్టి సుప్రజ, నెల్లూరు జిల్లా భక్తవత్సల నగర్‌కు చెందిన మున్సిపల్ కార్పొరేషన్ పాఠశాలకు చెందిన గోవుల గోకుల్ కృష్ణారెడ్డి ప్రథమ, ద్వితీయ, తృతీయ, నాల్గవ ర్యాంకులు సాధించి నూజివీడు క్యాంపస్‌లో సీట్లు సాధించారు. మొత్తం ప్రభుత్వ పాఠశాలలకు చెందిన విద్యార్థులే టాప్-20లో నిలిచారు. సీట్లు సాధించిన వారిలో తెలంగాణ రాష్ట్రానికి చెందిన విద్యార్థులు 88 మంది ఉండగా, ఇతర రాష్ట్రాలకు చెందిన వారు 17 మంది ఉన్నారు. ఎంపికైన విద్యార్థుల జాబితా www.rgukt.in లో మిగతా 2లో


బొప్పన సత్యనారాయణరావు (ఫైల్)

శ్రీ చైతన్య విద్యాసంస్థల అధినేత బిఎస్ రావు ఇకలేరు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

శ్రీ చైతన్య విద్యాసంస్థల అధినేత డాక్టర్ బొప్పన సత్యనారాయణరావు (బిఎస్‌రావు) (75) కన్నుమూశారు. గురువారం మధ్యాహ్నం 3.30గంటల సమయంలో ఆయనకు గుండెపోటు రావడంతో కుటుంబ సభ్యులు వెంటనే జూబ్లీహిల్స్‌లోని అపోలో ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే ఆయన మృతి చెందినట్టు ధ్రువీకరించారు. బిఎస్‌రావు భౌతికకాయాన్ని అపోలో ఆసుపత్రి నుంచి నేరుగా విజయవాడలోని ఆయన స్వగృహానికి కుటుంబ సభ్యులు తరలించారు. విదేశాల్లో ఉన్న బిఎస్‌రావు కుమార్తె సీమ వచ్చిన తర్వాతే అంత్యక్రియలు నిర్వహించనున్నట్టు కుటుంబ సభ్యులు వెల్లడించారు.

బ్రిటన్‌లో సమ్మెల హోరు

డాక్టర్ల అయిదు రోజుల సమ్మె ప్రారంభం

మరో సారి సమ్మెకు సిద్ధమవుతున్న టీచర్లు

అదే బాటలో సెక్యూరిటీ గార్డ్లు

వేతన సమస్యపై అంతటా పారిశ్రామిక అశాంతి



అయిదు రోజుల సమ్మెలో పాల్గొన్న జూనియర్ డాక్టర్లు

7

గ్రామ సచివాలయాలను, వలంటీర్లను పంచాయతీల్లో విలీనం చేయాలి

- ఎపి పంచాయతీరాజ్ ఛాంబర్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాజ్యాంగంలోని 73, 74వ సవరణ ప్రకారం ఏర్పడిన రాజ్యాంగ ప్రతిపత్తి కలిగిన ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ శాఖలో రాజ్యాంగ ప్రతిపత్తి లేని ఆంధ్రప్రదేశ్ సచివాలయాల శాఖను, వలంటీర్లను విలీనం చేయాలని ఎపి పంచాయతీరాజ్ ఛాంబర్ రాష్ట్ర అధ్యక్షులు వైవిబి రాజేంద్రప్రసాద్ డిమాండ్ చేశారు. గురువారం విజయవాడలోని బాలోత్సవ్ భవన్‌లో ఎపి పంచాయతీరాజ్ ఛాంబర్, ఎపి సర్పంచ్‌ల సంఘాల రాష్ట్ర కమిటీ సమావేశం జరిగింది ఈ సందర్భంగా వైవిబి రాజేంద్రప్రసాద్, రాష్ట్ర సర్పంచుల సంఘం అధ్యక్షులు లక్ష్మీ ముత్యాలరావు మాట్లాడారు. గ్రామ సచివాలయాలు, వలంటీర్ వ్యవస్థలు గ్రామపంచాయతీలకు, సర్పంచులకు సమాంతర వ్యవస్థగా పనిచేస్తున్నాయన్నారు. 73, 74వ రాజ్యాంగ సవరణ చట్టం ప్రకారం గ్రామ సచివాలయాలను, సచివాలయ సెక్రటరీలను, గ్రామ వలంటీర్లను సర్పంచ్‌ల ఆధ్వర్యంలోనే పనిచేయించాలన్నారు. వారందరినీ గ్రామ పంచాయతీ సిబ్బందిగా మార్చి వారి జీతభత్యాలు పంచాయతీలు చెల్లించేలా జీఓలను జారీ చేయాలని డిమాండ్ చేశారు. ప్రధాన మంత్రి ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ కేంద్ర కార్యదర్శులు, ముఖ్యమంత్రి ఆధ్వర్యంలోనే రాష్ట్ర కార్యదర్శులు ఎలా పని చేస్తున్నారో, అలాగే గ్రామపంచాయతీ సర్పంచ్ ఆధ్వర్యంలోనే గ్రామ సచివాలయాలు, కార్యదర్శులు, వలంటీర్లు పనిచేసేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రూ.8,660 కోట్ల ఆర్థిక సంఘం నిధులను రాష్ట్రప్రభుత్వం అక్రమంగా మళ్లించిందని, దీనిపై ఎపి సిఐడి చీఫ్‌కు ఫిర్యాదు చేస్తామని తెలిపారు. ఈ సమావేశంలో సర్పంచుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పగడాల రమేష్, ఎపి పంచాయతీ రాజ్ ఛాంబర్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బిర్రు ప్రతాపరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మా నిధులు వాడుకోండి

- రాష్ట్రానికి నాబార్డ్ లేఖ

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

రాష్ట్ర ప్రభుత్వం ఒకవైపు అప్పుల కోసం అర్రులు చాస్తుండగా, మరో వైపు తామిచ్చిన రుణాన్ని వాడుకోవాలని కోరుతూ నాబార్డ్ లేఖ రాసింది.రాష్ట్రంలోని ఉప్పాడ, మచిలీపట్నం, నిజాంపట్నంలో ఉన్న ఫిషింగ్ హార్బర్లను ఆధునీకరించేందుకు గతేడాది అక్టోబర్‌లో నాబార్డ్ 450 కోట్లు కేటాయించింది. ఫిషరీస్ అండ్ ఆక్వాకల్చర్ ఇన్‌ఫ్రా డెవలప్‌మెంట్ ఫండ్ (ఎఫ్ఐడిఎఫ్) కింద ఒక్కో హార్బర్‌కు 150 కోట్లు చొప్పున ఈ నిధులను మంజూరు చేశారు. అయితే, ఆ మొత్తానికి సంబంధించి అంగీకార పత్రాలను ప్రభుత్వం ఇంకా పంపలేదు. ఈ మొత్తానికి సంబంధించి వినియోగ గడువు కూడా ముగిసిందని చెబుతున్నారు. ఈ నేపథ్యంలో నాబార్డు తాజాగా ప్రభుత్వానికి రాసిన లేఖ చర్చనీయాంశమైంది. రుణ అంగీకార పత్రాలను పూర్తిచేసి, నిధులను వాడుకోవాలని ఈ లేఖలో నాబార్డు అధికారులు ప్రభుత్వాన్ని కోరారు.

ట్రిపుల్ ఐటి అర్హుల జాబితా విడుదల

మొదటి పేజీ తరువాయి

పొందుపరిచారు. ఈ నెల 20 నుంచి 25వ తేది వరకు ప్రవేశాల కౌన్సిలింగ్ నిర్వహిస్తామని మంత్రి చెప్పారు. నూజివీడు క్యాంపస్‌లో 20, 21 తేదీల్లో, ఇడుపులపాయ ఆర్‌కె వ్యాలీలో 21, 22 తేదీల్లో, ఒంగోలు క్యాంపస్‌కు ఎంపికైన వారికి 24,25 తేదీల్లో ఇడుపులపాయ క్యాంపస్‌లో, శ్రీకాకుళం క్యాంపస్‌కు ఎంపికైన వారికి అదే జిల్లా ఎచ్చెర్ల క్యాంపస్‌లో 24, 25 తేదీల్లో కౌన్సిలింగ్ జరుగుతుందని వివరించారు. త్వరలోనే ఐఐటిల్లో పిహెచ్‌డి ప్రారంభిస్తామని చెప్పారు. ఈ సమావేశంలో ఆర్‌జియుకెటి ఛాన్సలర్ కెసిరెడ్డి, వైస్ ఛాన్సలర్ ఎం విజయ్‌కుమార్, డైరెక్టర్లు సంధ్యారాణి, జయరామిరెడ్డి, జగదీశ్వరరావు, జివిఆర్ శ్రీనివాసరావు, కన్వీనర్ గోపాలరాజు తదితరులు పాల్గొన్నారు.

గంగవరం పోర్టు కార్మికులకు అన్యాయం చేస్తే ఊరుకోం

- స్టీల్‌ప్లాంట్ ఎంప్లాయీస్ యూనియన్ నేతలు



ధర్నా చేస్తున్న స్టీల్‌ప్లాంట్ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు

ప్రజాశక్తి - ఉక్కునగరం (విశాఖపట్నం)

అదానీ గంగవరం పోర్టులో పనిచేస్తున్న కార్మికులకు యాజమాన్యం అన్యాయం చేస్తే చూస్తూ ఊరుకోబోమని స్టీల్‌ప్లాంట్ ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు) నేతలు, ఉక్కు కార్మికులు హెచ్చరించారు. విశాఖలో కొద్ది రోజులుగా పోరాటం చేస్తున్న అదానీ గంగవరం పోర్టు కార్మికులకు మద్దతుగా గురువారం స్టీల్‌ప్లాంట్ ప్రధాన పరిపాలన భవనం వద్ద స్టీల్‌ప్లాంట్ ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యాన ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం గౌరవాధ్యక్షులు జె.అయోధ్యరామ్, అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వైటి.దాస్, యు.రామస్వామి మాట్లాడుతూ అదానీ గంగవరం పోర్టు యాజమాన్యం దుర్మార్గాన్ని అందరూ ఖండించాలన్నారు. కార్మికుల పట్ల పోర్టు యాజమాన్యం నిరంకుశ వైఖరిని ప్రదర్శించడం దారుణమన్నారు. గంగవరం ప్రజలు తమ ఉపాధిని, నివాసాలను, భూములను పోర్టు కోసం త్యాగం చేశారని, అలాంటి వారిని విస్మరించడం సరికాదన్నారు. కనీస వేతనం అడిగితే విధుల నుంచి బహిష్కరించడం దుర్మార్గమన్నారు. పోర్టులో పోలీసుల పెత్తనం పెరిగిందని, కార్మికులను భయాందోళనకు గురిచేస్తున్నారని తెలిపారు. గత ఆర్థిక సంవత్సరంలో రూ.700 కోట్ల నికర లాభాలు వచ్చినా కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయలేదని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే గంగవరం పోర్టు కార్మికుల న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు పి.శ్రీనివాసరాజు, బి.అప్పారావు, కె.గంగాధర్, కృష్ణమూర్తి, పవన్ కుమార్, కె.సత్యనారాయణ, వీరాస్వామి, మొహిద్దీన్, వి.మురళి పాల్గొన్నారు.

సిపిఎం నేత కోటేశ్వరరావు మృతి

- ఉద్యమాలకు తీరనిలోటు :సిహెచ్.బాబూరావు



ప్రజాశక్తి - విజయవాడ : సిపిఎం విజయవాడ నగర కమిటీ సభ్యులు, సిఐటియు నేత, ఎపిఎస్ ఆర్‌టిసి స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ (ఎస్‌డబ్ల్యుఎఫ్) ఉమ్మడి కృష్ణాజిల్లా కార్యదర్శిగా సుదీర్ఘకాలం పనిచేసిన రాజమహేంద్రవరపు కోటేశ్వరరావు (ఆర్‌కె) (73) గుండెపోటుతో గురువారం మరణించారు. ఆయనకు భార్య, కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. గతంలో విజయవాడ రీజినల్ వర్క్‌షాప్‌లో ఉద్యోగ బాధ్యతలు నిర్వహిస్తున్న సమయంలో ఉద్యోగులను సంఘటిత పరిచి పలు ఉద్యమాలు నిర్వహించారు. ఎస్‌డబ్ల్యుఎఫ్ (సిఐటియు)కు సుదీర్ఘకాలం ఉమ్మడి కృష్ణాజిల్లా కార్యదర్శి బాధ్యతలతో పాటు వివిధ బాధ్యతలు నిర్వర్తించారు.

సిఐటియు విజయవాడ నగర ఉద్యమంలో కీలక పాత్ర పోషించారు. దశాబ్దాలపాటు స్థానిక ప్రజా సమస్యలపై అనేక ఉద్యమాలు సాగించారు. నగరపాలక సంస్థ ఎన్నికల్లో దుర్గాపురం నుండి సిపిఎం అభ్యర్థిగా పోటీ చేశారు. కోటేశ్వరరావు భౌతికకాయాన్ని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు, సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు సందర్శించి నివాళులర్పించారు. ఆయన భౌతికకాయంపై పార్టీ పతాకాన్ని కప్పి నివాళులర్పించారు. కోటేశ్వరరావు మృతి పట్ల సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు ఎవి.నాగేశ్వరరావు, సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు, వి.ఉమామహేశ్వరరావు, ఎన్‌టిఆర్ జిల్లా కార్యదర్శి డివి.కృష్ణ తదితరులు సంతాపం తెలిపారు.

సిపిఎం రాష్ట్ర కమిటీ సంతాపం

అనంతపురంలో జరిగిన సిపిఎం రాష్ట్ర కమిటీ సమావేశంలో రెండు నిమిషాలపాటు మౌనం పాటించి కోటేశ్వరరావు మృతికి నివాళులర్పించారు.



భౌతికకాయం వద్ద నివాళులర్పిస్తున్న సిహెచ్.నర్సింగరావు తదితరులు, ఇన్‌సెట్‌లో ఆర్.కోటేశ్వరరావు (ఫైల్)

ఎస్‌డబ్ల్యుఎఫ్ సంతాపం

ఎస్‌డబ్ల్యుఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు సిహెచ్.సుందరయ్య, పట్టాభిరామ్ దొర, రాష్ట్ర గౌరవాధ్యక్షులు జిలాని బాషా, ఫెడరేషన్ రిటైర్డ్ ఉద్యోగ సంఘం రాష్ట్ర నాయకులు ఎన్‌కె.శాస్త్రి, కె.గంగాధర్, బిడిఆర్‌రెడ్డి, అలిండియా ట్రాన్స్‌పోర్టు వర్కర్స్ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి ఆర్ లక్ష్మయ్య, రిటైర్డ్ ఆర్‌టిసి ఎంప్లాయిస్ అసోషియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కానాల గంగాధరరావు, ఎస్‌డబ్ల్యుఎఫ్ రాష్ట్ర నాయకులు పట్టాభిరామ్ దొర తదితరులు కోటేశ్వరరావు భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు.

నేడు అంత్యక్రియలు

పార్టీ, ప్రజా, కార్మిక సంఘాల నేతలు, ప్రజలు, అభిమానుల సందర్శనార్థం భౌతికకాయాన్ని నగరంలోని దుర్గాపురం రజక వీధిలోని ఆయన స్వగృహం వద్ద ఉంచారు. శుక్రవారం ఉదయం 10 గంటలకు అంతిమయాత్ర ప్రారంభమవుతుందని కుటుంబ సభ్యులు తెలిపారు.

వేర్వేరు ప్రమాదాల్లో నలుగురు దుర్మరణం

ప్రజాశక్తి - ఉండి, ముసునూరు

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో జరిగిన వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో గురువారం నలుగురు మరణించారు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. పశ్చిమగోదావరి జిల్లా ఉండి మండలం ఆరేడు గ్రామ మాజీ సర్పంచ్ పిప్పిరిశెట్టి పోలేశ్వరరావుకు చెందిన రొయ్యల చెరువుకు కాపలా పని నిమిత్తం ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం సుకుమా ప్రాంతానికి చెందిన బీమ పొడియామి (18) పది రోజుల క్రితం చేరారు. సమీపంలో పనిచేస్తున్న సుకుమా ప్రాంతానికి చెందిన సనేష్‌కుమార్ (19)తో కలిసి పొడియామి టిఫెన్ చేసేందుకు రోడ్డు దాటుతుండగా టాటాఏస్ వాహనం వీరిని ఢీ కొట్టింది. పొడియామి, సనేష్‌కుమార్ అక్కడికక్కడే మృతి చెందారు. టాటాఏస్ వాహనంలో ఉన్న ఆరుగురికి స్వల్పగాయాలయ్యాయి. ఏలూరు జిల్లా ముసునూరు మండలం ఎల్లాపురం గ్రామానికి చెందిన జున్నూరి నరేష్ (27) తన టాటా ఏస్ వాహనంలో తమ్మిలేరులో ఇసుక లోడు చేసుకుని ఏలూరులో విక్రయించడానికి బయలుదేరారు. నరేష్‌తో పాటు అదే గ్రామానికి చెందిన తాడిగడప గణేష్ (21) తోడుగా వచ్చాడు. వీరి వావానాన్ని ఏలూరు చొదిమెళ్ల శివారు వద్ద ఎదురుగా వస్తున్న టిప్పర్ ఢీకొంది. ఈ ప్రమాదంలో నరేష్, గణేష్ అక్కడికక్కడే మృతి చెందారు. నరేష్‌కు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చట్ట ప్రకారం వలంటీర్లే దోషులవుతారు

- వైఎస్ దేవుడైతే.. ఐఎఎస్‌లు ఎందుకు జైలుకెళ్తారు
- తాడేపల్లిగూడెంలో జనసేన అధినేత పవన్ కళ్యాణ్

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి, తాడేపల్లిగూడెం

రాష్ట్రంలో ప్రజాస్వామ్యం లేదని, దౌర్జన్యంతో కూడిన క్రిమినల్ రాచరికం నడుస్తుందని జనసేన అధినేత పవన్ కల్యాణ్ విమర్శించారు. వారాహి రెండో విడత యాత్రలో భాగంగా ఐదో రోజు ఏలూరు జిల్లా పెంటపాడు మండలం అలంపురంలోని జయగార్డెన్స్‌లో తాడేపల్లిగూడెం నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలతో సమీక్ష సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా పవన్ మాట్లాడుతూ.. వలంటీర్లపై వ్యక్తిగత అభిప్రాయాలు ఏమీ లేవన్నారు. వైఎస్ రాజశేఖర్‌రెడ్డిని అందరూ దేవుడంటున్నారని, ఆయన దేవుడైతే అంతమంది ఐఎఎస్‌లు ఎందుకు జైలుకు వెళ్లారని ప్రశ్నించారు. ఆయన అవినీతి చేయబట్టేకదా అని అన్నారు. ప్రభుత్వం మారితే కొందరు వలంటీర్లు ఆ విధంగానే ఇరుక్కుంటారని తెలిపారు. వలంటీర్లు సేకరిస్తున్న డేటా డిజిటల్ ప్రొడక్షన్ డేటా బిల్-2022 ప్రకారం చట్టవిరుద్ధమన్నారు. వలంటీర్ వ్యవస్థ లేనప్పుడు పాలన నడవలేదా? అని ప్రశ్నించారు. 'షర్మిల పార్టీని కాంగ్రెస్‌లో కలిపేస్తున్నారని అంటున్నారు. మీరు అలా చేస్తారా? అని నన్ను అడిగారు. నాకు పదవులు కావాలంటే కాంగ్రెస్‌లోకి వెళ్లిపోయేవాడిని. సిద్ధాంతం కోసం పార్టీ పెట్టాను. చచ్చిపోవాలే తప్ప రాజీ పడకూడదు' అని అన్నారు. పార్టీని బి టీమ్ అంటే మనవాళ్లే నమ్మడం బాధగా ఉందని అన్నారు. రాజకీయాల్లో ప్రలోభాలు ఉంటాయని, అయినా నైతిక విలువలతో పార్టీని నడుపుతున్నాని తెలిపారు. దాడులు చేస్తున్నారంటే మనం బలంగా ఉన్నామని కార్యకర్తలు గుర్తించాలన్నారు. నా లెటర్ ప్యాడ్‌పై కొంతమంది కుట్రతో వచ్చిన అంశాలను వెంటనే నమ్మవద్దని సూచించారు. జగన్మోహన్‌రెడ్డి పాలసీల గురించి మాట్లాడకుండా పెళ్లిల గురించి మాట్లాడటం సిగ్గుచేటన్నారు.

శ్రీకాళహస్తికి నేనే వెళ్తా

శాంతియుతంగా ధర్నా చేస్తున్న జనసేన నాయకుడిని శ్రీకాళహస్తిలో పోలీస్ అధికారి కొట్టారన్నారు. జనసేన నాయకుడు కదలకుండా ధైర్యంగా నిలబడటం గొప్ప విషయమన్నారు. ఈ నేపథ్యంలో శ్రీకాళహస్తికి శుక్రవారం వెళ్తానని తెలిపారు. సిఐ ఎందుకు కొట్టారో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. పంచాయతీ ఎన్నికల్లో దౌర్జన్యాలు చేస్తే వైసిపిని పట్టించుకోని పోలీసులు శాంతియుతంగా ధర్నా చేస్తే కొడతారా? అంటూ ప్రశ్నించారు.



తాడేపల్లిగూడెం నియోజకవర్గ కార్యకర్తలు, వీరమహిళలతో మాట్లాడుతున్న పవన్

26న విద్యుత్ ఉద్యోగుల రాష్ట్ర సదస్సు

- ఎపి విద్యుత్ ట్రేడ్ యూనియన్ల పోరాట కమిటీ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

విద్యుత్ కార్మికుల పిఆర్‌సిని ప్రకటించాలని, కాంట్రాక్టు కార్మికులను పర్మినెంట్ చేయాలని కోరుతూ ఈ నెల 26న రాష్ట్రసదస్సు నిర్వహించనున్నట్లు ఎపి విద్యుత్ ట్రేడ్ యూనియన్ల పోరాట కమిటీ తెలిపింది. గత ఏడాది కాలంలో 1104 జెఎసి సారథ్యంలోని సంఘాలతో 23 సార్లు జాయింట్‌గా, కొన్నిసార్లు విడివిడిగా మొక్కుబడి సమావేశాలు జరిగాయని కమిటీ గురువారం ఒక ప్రకటనలో పేర్కొంది. పిఆర్‌సి చర్చలు ఎక్కడ వేసిన గొంగలి అక్కడే అన్న చందంగా ఉన్నాయని తెలిపింది. కాంట్రాక్ట్ లేబర్ రెగ్యులర్ గురించి, జెఎల్‌ఎం గ్రేడ్-2 (ఎనర్జీ అసిస్టెంట్లు) గురించి ఏ ఒక్క అంశాన్ని తేల్చకుండా మాస్టర్ స్కేల్ చుట్టూ చర్చలు సాగిస్తున్నారని అసంతృప్తి వ్యక్తం చేసింది. రాష్ట్రప్రభుత్వం కొన్ని ఎన్‌జివో సంఘాలను లోబర్చుకొని తప్పుడు పిఆర్‌సిని ప్రకటించిందని, అదే పద్ధతిని విద్యుత్ రంగంలోనూ ప్రయోగించాలని కుట్ర చేస్తోందని విమర్శించింది. పిఆర్‌సి పూర్తయి ఏడాది దాటినా వేతన ఒప్పందానికి అధికారులు సిద్ధపడటం లేదని పేర్కొంది. తెలంగాణలో కాంట్రాక్టు స్కిల్డ్ కార్మికులకు నెలకు రూ.43,162 ఇస్తుంటే రాష్ట్రంలో మాత్రం రూ.20,598 మాత్రమే చెల్లిస్తున్నారని వివరించింది. రాష్ట్రప్రభుత్వ విద్యుత్ విధానం వల్ల విద్యుత్ సంస్థలకు చెల్లించాల్సిన రాయితీలు పూర్తిగా చెల్లిస్తే అత్యంత లాభాలతో డిస్కంలు నడుస్తాయని పేర్కొంది. రాష్ట్రప్రభుత్వం వేల కోట్ల బకాయిలు పెట్టి విద్యుత్ సంస్థలను నష్టాల్లోకి నెడుతుందని విమర్శించింది. స్మార్ట్ మీటర్ల పేరుతో అత్యధిక లాభాలు వచ్చే కాంట్రాక్టులు షిరిడీ సాయి, అదానీ కంపెనీలకు అప్పగించించారని విమర్శించింది. జులై 11న హైడ్రో స్టోరేజ్ పంప్ ప్రాజెక్టు రూ.8104 కోట్లతో జిందాల్ స్టీల్‌కు అప్పగించాలని ప్రభుత్వం నిర్ణయించిందని వివరించింది. కార్పొరేట్లకు లాభాలు వచ్చేందుకే ఉద్యోగులకు జీతాలు తగ్గించాలని ప్రయత్నిస్తున్నదని విమర్శించింది. ప్రజల మీద స్మార్ట్ మీటర్లపేరుతో భారాలు వేస్తున్నారని తెలిపింది. ప్రభుత్వ విధానాలు మారకపోతే విద్యుత్ రంగంలో ప్రజా ఉద్యమాలు తప్పవని హెచ్చరించింది. కార్మికుల జీతాల్లో కోతలు విధిస్తే భారీ పోరాటాలు తప్పవని, ఇప్పటికైనా ప్రభుత్వం దిగొచ్చి సమస్యలు తక్షణం పరిష్కరించాలని డిమాండ్ చేశారు. 1104 నాయకత్వంలోని జెఎసి సంఘాలు తమ జెఎసితో కలిసి రావాలని కోరింది.

బీడి కార్మికుల సమస్యలు పరిష్కరించాలి


- ఆలిండియా కార్యదర్శి డెబోషిష్‌రాయ్
- రాష్ట్ర కన్వీనర్‌గా ఓబుల్ ఎన్నిక

ప్రజాశక్తి-నెల్లూరు

బీడి కార్మికుల సమస్యలు పరిష్కరించాలని బీడి అండ్ సిగార్ వర్కర్స్ యూనియన్ ఆలిండియా కార్యదర్శి డెబోషిష్ రాయ్ డిమాండ్ చేశారు. నెల్లూరులోని జెట్టి శేషారెడ్డి విజ్ఞాన కేంద్రం భవన్‌లో నిర్వహించిన ఎపి బీడి అండ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సమావేశానికి సిఐటియు నాయకులు ఎస్‌కె రెహనా బేగం అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా డెబోషిష్‌రాయ్ మాట్లాడుతూ..దక్షణాది రాష్ట్రాల్లో మైనార్టీలు బీడి కార్మికులుగా పనిచేస్తున్నారన్నారు. కార్మికులకు బీడి కంపెనీ పేర్లు తెలుసు కాని కంపెనీల యజమానులు తెలియదని, దళారులను ఏజెంట్లుగా పెట్టుకుని తక్కువ వేతనం చెల్లిస్తూ అధిక లాభాలను ఆర్జిస్తున్నారని తెలిపారు. ప్రతి కార్మికుడికి గుర్తింపు కార్డు, లాక్‌బుక్ అందజేయాలని, ప్రావిడెంట్ ఫండ్, ఇఎస్ఐ, వంటి సౌకర్యాలు కల్పించాలని, ప్రతి నెలా 26 రోజులు పని కల్పించాలని డిమాండ్ చేశారు.

రాష్ట్ర కమిటీ ఎన్నిక

ఎపి బీడి అండ్ సిగార్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కన్వీనర్, కో-కన్వీనర్‌గా ఓబుల్, చైతన్యను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా ఎస్‌కె గుల్‌జాన్, ప్రధాన కార్యదర్శిగా ఎస్‌కె షంషాద్, మరో 13 మంది సభ్యులతో నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఓబుల్, చైతన్య మాట్లాడుతూ.. కార్మికులకు గుర్తింపు కార్డులు అందజేయాలని, కార్మికుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని రాష్ట్ర ప్రభుత్వం ఒక బోర్డును ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. అన్ని జిల్లాల్లో కమిటీలను ఏర్పాటు చేసి భవిష్యత్తులో బీడి కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.



ఓబుల్ చైతన్య

తెలంగాణతో రాష్ట్ర విద్యావిధానాన్ని పోల్చొద్దు : మంత్రి బొత్స

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

తెలంగాణతో రాష్ట్ర విద్యావిధానాన్ని పోల్చి చూడటం సరికాదని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ అన్నారు. ట్రిపుల్ ఐటి కోర్సుల ప్రవేశ ఫలితాల విడుదల సందర్భంగా విజయవాడలో గురువారం ఆయన మాట్లాడారు. తెలంగాణ విద్యావ్యవస్థలో చూచి రాతలు, కుంభకోణాలు ఉన్నాయని, కనీసం ఉపాధ్యాయుల బదిలీలు కూడా చేసుకోలేని దుస్థితి అని విమర్శించారు.

పవన్ మాటలు పట్టించుకోవద్దు

పవన్ కల్యాణ్ మాటలను పరిగణలోకి తీసుకోవాల్సిన అవసరం లేదని అన్నారు. వాలంటీర్ వ్యవస్థ ఎలా పుట్టిందో పవన్ కల్యాణ్ తెలుసుకోవాలని చెప్పారు. వాలంటీర్లు ఆడపిల్లల్ని లోబరుచుకుంటారంటూ కించపరిచే వ్యాఖ్యలు సరికాదన్నారు. మహిళల అదృశ్యంపై ఏ నిఘా వర్గాలు సమాచారం ఇచ్చాయో పవన్ చెప్పాలని అన్నారు. ప్రజల సమాచారాన్ని హైదరాబాద్‌లో ఉంచాల్సిన అవసరం లేదన్నారు. రాజధాని విషయంలో రాష్ట్రప్రభుత్వం సింగపూర్ ప్రభుత్వంతో ఎలాంటి ఒప్పందం చేసుకోలేదని చెప్పారు. మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సన్నిహిత సింగపూర్ మంత్రితో ప్రచారం చేశారని విమర్శించారు.

విజయవాడకైనా.. విశాఖకైనా రెడీ

- నువ్వు వస్తావా?..మమ్మల్ని రమ్మంటావా?
- మంత్రి బొత్సకు తెలంగాణ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ సవాల్
- విద్యా వ్యవస్థను, విద్యార్థులను అవమానించారంటూ ఆగ్రహం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

'తెలంగాణలోని విద్యా వ్యవస్థ, పరీక్షల విధానం, అభివృద్ధిపై చర్చకు మా ప్రభుత్వం సిద్ధం. నువ్వొస్తావా? నన్ను రమ్మంటావా?. విజయవాడకైనా, విశాఖకైనా.. ఎక్కడికైనా రెడీ. హైదరాబాద్‌లో ఉన్న నీ ఇంటికైనా సరే' అంటూ మంత్రి బొత్స సత్యనారాయణకు తెలంగాణ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ సవాల్ విసిరారు. హైదరాబాద్ సచివాలయంలోని మీడియా సెంటర్‌లో గురువారం మంత్రి శ్రీనివాస్‌గౌడ్ విలేకరులతో మాట్లాడారు. బొత్స సత్యనారాయణ పరీక్షలన్నీ చూసి రాశాడేమోనని, అందుకే అలా అంటున్నారని మండిపడ్డారు. తెలంగాణపై అక్కసు, అభివృద్ధిని చూసి ఓర్వలేనితనంతో మాట్లాడుతున్నారని తెలిపారు. ఎపి రాజధాని ఏదంటే చెప్పుకోలేని పరిస్థితి ఉందని వ్యాఖ్యానించారు. ఇక్కడ పరీక్షలు చూసి రాస్తుంటే... తెలంగాణలోనూ మెడికల్ సీట్లు కావాలని ఎపి విద్యార్థులు కోర్టుకెందుకెళ్లారు? అని నిలదీశారు. ఉమ్మడి రాష్ట్రంలో ఎపిపిఎస్‌సి పరీక్షల్లో స్కాములు జరిగేవని తెలిపారు. ఆయా పరీక్షల పేరుతో దందాలు చేసేవారని విమర్శించారు. తెలంగాణ వచ్చాక అంతా పారదర్శకంగా నడుస్తుందని తెలిపారు. కోళ్ల ఫారాలాంటి షెడ్డుల్లో నడిపిన ఇంజినీరింగ్ కాలేజీలను రద్దు చేశామని చెప్పారు. మా దగ్గర ఏమైనా వోక్స్‌వాగన్ కుంభకోణం జరిగిందా? విజయవాడ, తిరుపతిలో ఉన్నట్టు గుళ్ల దగ్గర వివక్షత ఉందా? అని ప్రశ్నించారు. పోటీ పరీక్షల్లో ఎపి రాజధాని ఏంటని అడిగితే సమాధానం రాయలేని పరిస్థితి నెలకొందన్నారు. రెండు ప్రాంతాల ప్రజలను సమానంగా చూస్తే పరిస్థితి భిన్నంగా ఉండేదన్నారు. ఏపీలో కులాల పిచ్చి, ప్రజలను రెచ్చగొట్టే రాజకీయం గురించి ఎప్పుడైనా మాట్లాడామా? అని ప్రశ్నించారు.

బొత్స మాటలను ఖండిస్తున్నాం : సబితా ఇంద్రారెడ్డి

ఆంధ్రప్రదేశ్ విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ తెలంగాణ విద్యా వ్యవస్థను కించపరిచినట్టుగా మాట్లాడటం దారుణమని ఆ రాష్ట్ర విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి అన్నారు. బొత్స సత్యనారాయణ వ్యాఖ్యలను ఆమె ఖండించారు. గురువారం రంగారెడ్డి జిల్లా కందుకూరు మండల కేంద్రంలోని సామ నరసింహారెడ్డి కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మంత్రి మాట్లాడారు. సిఎం కేసీఆర్ వెయ్యి గురుకుల పాఠశాలలు ఏర్పాటు చేశారన్నారు. కేజీ టూ పీజీ వరకు ఉచిత విద్య అమలు చేస్తున్నట్టు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 2.50 లక్షల మంది విద్యార్థుల కొత్త అడ్మిషన్లు జరిగాయన్నారు. ఏపీలో విద్యావ్యవస్థ గురించి తాము ఎప్పుడూ మాట్లాడలేదన్నారు. తెలుగు రాష్ట్రాలు కలిసిమెలిసి ఉండాలన్నదే తమ ఉద్దేశమని స్పష్టంచేశారు. ఇప్పటికైనా బొత్స సత్యనారాయణ తెలంగాణ రాష్ట్ర ప్రజలకు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు.

వలంటీర్ వ్యవస్థ నిర్వీర్యానికి కుట్ర

- ఎంపి మార్గాని భరత్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ప్రభుత్వ సంక్షేమ పథకాలను అవినీతి రహితంగా, పారదర్శకంగా పేదలకు అందేలా రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన వలంటీర్ వ్యవస్థను నిర్వీర్యం చేసేందుకు రాష్ట్రంలోని ప్రతిపక్షాలు కుట్ర చేస్తున్నాయని వైసిపి ఎంపి మార్గాని భరత్ అన్నారు. గురువారం తాడేపల్లిలోని వైసిపి కేంద్రకార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. చంద్రబాబు మార్గదర్శకత్వంలో పవన్‌కల్యాణ్ వారం రోజులుగా వలంటీర్ వ్యవస్థపై విషం చిమ్ముతున్నారని అన్నారు. వలంటీర్ వ్యవస్థను ఇతర రాష్ట్ర ప్రభుత్వాలు ఆదర్శంగా తీసుకొని అక్కడ తీసుకురావాలని ప్రయత్నిస్తుంటే రాష్ట్రంలోని ప్రతిపక్షాలు ఓర్వలేక విమర్శలు చేస్తున్నాయని అన్నారు.

చంద్రబాబు హయాంలో ప్రతి పథకానికి డబ్బులు వసూలు చేసిన జన్మభూమి కమిటీలను పవన్‌కల్యాణ్ ఎందుకు వ్యతిరేకించలేదని ప్రశ్నించారు. రాష్ట్రవ్యాప్తంగా వున్న 2.5 లక్షల వలంటీర్లలో 1.80 లక్షల మంది మహిళలు ఉన్నారని, వారిలో ఎక్కువ మంది ఎస్‌సి, ఎస్‌టి, బిసిల మహిళలేనని పవన్‌కల్యాణ్ గుర్తించాలని అన్నారు. ప్రతి సంక్షేమ పథకాన్ని అర్హులకు నేరుగా ఇంటికి చేరుస్తున్న వలంటీర్లపై దుష్ప్రచారం చేయడం తగదని అన్నారు.

ఆర్‌టిసి ఉద్యోగులకు వరం

- అధిక ఫించన్ విధానంపై మంత్రి పినిపే విశ్వరూప్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

దేశంలో ఎక్కడా లేని విధంగా ఆర్‌టిసి ఉద్యోగులకు రాష్ట్రంలో అధిక పెన్షన్ విధానాన్ని అమలు చేస్తున్నట్లు రవాణాశాఖ మంత్రి పినిపే విశ్వరూప్ తెలిపారు. గురువారం తాడేపల్లిలోని వైసిపి కేంద్రకార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. ఉద్యోగులకు అత్యధిక పెన్షన్ కోసం పిఎఫ్ ఫండ్ ట్రస్ట్‌కు తెలంగాణ ఆర్‌టిసితో పాటు పలు ప్రభుత్వ రంగసంస్థలు దరఖాస్తు చేసినా, రాష్ట్ర ఆర్‌టిసికి మాత్రమే అవకాశం వచ్చిందన్నారు. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి చూపిన చొరవే దీనికి కారణమన్నారు. ఈ పెన్షన్ విధానం ఆర్‌టిసి ఉద్యోగులకు వరం లాంటిదని చెప్పాఉ. 50 వేలకు పైగా ఆర్‌టిసి ఉద్యోగులతోపాటు 2014 తర్వాత రిటైర్ అయిన దాదాపు 10,200 మంది ఉద్యోగులు, కార్మికులు అత్యధిక పెన్షన్ విధానంలో ప్రయోజనం పొందుతారని చెప్పారు. గతంలో ఆర్‌టిసి ఉద్యోగులకు పెన్షన్ అంటే కేవలం రూ 3 వేల నుండి రూ 4 వేల దాకా వచ్చేదని ఇపుడు ఈ అత్యధిక పెన్షన్ విధానంతో రూ 15వేల నుండి రూ 40వేల దాకా పెన్షన్ వస్తుందని తెలిపారు. ఈ పెన్షన్ విధానాన్ని ప్రభుత్వం తీసుకురావడం పట్ల కార్మికులు, ఉద్యోగులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలవనున్నారని తెలిపారు. 2016నుండి మృతి చెందిన 858మంది ఆర్‌టిసి ఉద్యోగుల కుటుంబసభ్యులకు కారుణ్య నియమకాల కింద ఉద్యోగ అవకాశాలు కల్పించామన్నారు. ప్రభుత్వ ఉద్యోగులకు వర్తించే హెల్త్‌కార్డులను ఇచ్చామన్నారు. ఆర్‌టిసి ఉద్యోగులు మిగతా ఉద్యోగులులా కాకుండా ప్రత్యేక పరిస్థితుల్లో విధులు నిర్వహిస్తుండటంతో అనారోగ్య సమస్యలు ఎక్కువగా వస్తున్నాయని వాటిపై అధ్యయనం చేస్తున్నట్లు తెలిపారు. ఇందులో బాగంగానే 55 ఏళ్లు దాటిన ఉద్యోగులకు దూరప్రాంత డ్యూటీల నుండి మినహాయింపును ఇస్తున్నట్లు తెలిపారు. ప్రతి ఉద్యోగికి రూ 40 లక్షల ప్రమాద బీమా, రూ 5 లక్షల బీమా సౌకర్యాన్ని కల్పించామని అన్నారు.

రవాణాశాఖ మంత్రి వ్యాఖ్యలు అవాస్తవం : ఎస్‌డబ్ల్యుఎఫ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

దేశంలో అన్ని రాష్ట్రాల ఆర్‌టిసిల కంటే ఎపిఎస్ ఆర్‌టిసిలోనే మెరుగైన పెన్షన్ విధానాన్ని తీసుకొచ్చినట్లు రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ మాట్లాడటం తగదని ఎపిపిటిడి స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ పేర్కొంది. మంత్రి ప్రకటన అవాస్తవమని తెలిపింది. ఈ మేరకు గురువారం ఎపిపిటిడి స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర గౌరవాధ్యక్షులు ఎస్‌కె జిలానిబాషా, అధ్యక్ష కార్యదర్శులు సిహెచ్ సుందరయ్య, అయ్యపురెడ్డి ఒక ప్రకటన విడుదల చేశారు. 1989లో ఏర్పాటు చేసుకొన్న ఎస్‌ఆర్‌బిఎస్ పెన్షన్ స్కీమ్‌ను విలీనం పేరుతో రద్దు చేసి వచ్చే అరకొర పెన్షన్‌కు రాష్ట్ర ప్రభుత్వం ఎసరు పెట్టిందని అన్నారు. అత్యధిక పిఎఫ్ పెన్షన్‌లో ప్రభుత్వ వాటా ఏ మాత్రం వుండదని, ఉద్యోగుల సొంత డబ్బుతో కొనుక్కునే పెన్షన్ పథకాన్ని తమ ఘనతగా చెప్పుకోవడం తగదని అన్నారు. కేరళ, తమిళనాడు రాష్ట్రాలో ప్రభుత్వ ఉద్యోగుల ఓల్డ్ పెన్షన్ పథకాన్ని అమలు చేస్తున్నాయని తెలిపారు. హర్యానా, పంజాబ్ ఆర్‌టిసిలతోపాటు నగరపాలక సంస్థలు నడుపుతున్న 16 ఆర్‌టిసిలలో ప్రభుత్వ పెన్సన్ స్కీమ్ వుందన్నారు. రాష్ట్ర రవాణా శాఖ మంత్రి ఆయా రాష్ట్రాల్లోని రవాణాశాఖ కార్యదర్శుల నుంచి సమాచారం తెప్పించుకొని మాట్లాడాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి వుంటే తక్షణం ఆర్‌టిసి ఉద్యోగులకు ఓల్డ్ పెన్షన్ స్కీమ్‌ను అమలు చేయాలని డిమాండ్ చేశారు.

ఉన్నత విద్యారంగంలో మార్పులు తెద్దాం

మొదటి పేజీ తరువాయి

నూతన సాంకేతిక పరిజ్ఞానానికి తగినట్టుగా మార్పులు రావాలని చెప్పారు. వైద్యులకు రోబోటిక్స్, ఎఐలను పాఠ్యప్రణాళికలో, బోధనలో భాగస్వామ్యం చేయాలని సూచించారు. వ్యవసాయం చేసే తీరుకూడా గణనీయంగా మారిపోతోందన్నారు. ప్రతి రైతును, ప్రతి ఎకరాలో సాగును కూడా చేయిపట్టుకుని నడిపించుకునే స్థాయికి వెళ్లాలన్నారు. ప్రతి ఎకరాలో భూసార పరీక్ష చేసి, శాటిలైట్ ఇమేజ్ ద్వారా భూమిలో ఉన్న కాంపోజిషన్ చెప్పే పరిస్థితి ఉందన్నారు. ఆక్స్‌ఫర్డ్, హార్వర్డ్, ఎంఐటి, కేంబ్రిడ్జ్ పాఠ్యపుస్తకాలు, బోధనా పద్ధతులు, ప్రశ్నపత్రాలు రూపొందించే విధానం చాలా విభిన్నంగా ఉంటుందన్నారు. మనకు, వీరికీ తేడా ఎందుకు ఉంటుంది? అన్నదానిపై ఆలోచన చేయాలని చెప్పారు. ఉన్నత విద్యలోనే మార్పులు చేస్తే ఫలితాలు రావని చెప్పారు. ప్రాథమిక విద్యాస్థాయి నుంచే ఈ మార్పులు రావాలని, ఆ దిశగా ఇప్పటికే కొన్ని అడుగులు పడ్డాయని వివరించారు. వీటిని స్థిరపరుచుకుని, మరిన్ని ఫలితాలు సాధించేందుకు పాఠశాల విద్య స్థాయిలో ఒక బోర్డును ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. ఈ సమావేశంలో విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కెఎస్ జవహర్ రెడ్డి, వైద్య ఆరోగ్యశాఖ, వ్యవసాయ శాఖ, ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు ఎంటి కృష్ణబాబు, గోపాలకృష్ణ ద్వివేది, ఉన్నత విద్య, పాఠశాల విద్య ముఖ్యకార్యదర్శులు జె శ్యామలరావు, ప్రవీణ్ ప్రకాష్, ఐటీ కార్యదర్శి కోన శశిధర్, కళాశాల విద్య కమిషనర్ పోలా భాస్కర్, ఎపి ఉన్నత విద్యామండలి చైర్మన్ కె హేమచంద్రారెడ్డి, సమాచార, పౌరసంబంధాల శాఖ కమిషనర్ టి విజయకుమార్ రెడ్డి, యూనివర్సిటీల విసిలు పాల్గొన్నారు. కేంద్రంలోని నరేంద్రమోడీ ప్రభుత్వం విద్యను కాషాయీకరించే లక్ష్యంతో తీసుకొచ్చిన నూతన విద్యావిధానం ఉన్నత విద్యలో అనేక మార్పులు చేయాలని చెబుతోంది. ఈ నేపథ్యంలో కరిక్యులమ్‌లో మార్పులు చేస్తానని ముఖ్యమంత్రి చెప్పడం గమనార్హం.

పవన్ కల్యాణ్‌పై విజయవాడలో కేసు



ప్రజాశక్తి - విజయవాడ

వలంటీర్లపై అనుచిత వ్యాఖ్యలు చేసిన జనసేన అధినేత పవన్ కల్యాణ్‌పై విజయవాడ కృష్ణలంక పోలీస్‌స్టేషన్‌లో గురువారం కేసు నమోదైంది. విజయవాడ అయోధ్య నగర్‌కు చెందిన వలంటీర్ దిగమంటి సురేష్ బాబు ఫిర్యాదుతో 153, 153 ఎ, 505 (2) ఐపిసి సెక్షన్ల కింద పోలీసులు కేసు నమోదు చేశారు. పవన్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని వైసిపి విజయవాడ లీగల్ సెల్ ప్రతినిధులు, పలువురు వలంటీర్లు ఎన్‌టిఆర్ జిల్లా పోలీస్ కమిషనరేట్‌లో డిప్యూటీ పోలీస్ కమిషనర్ (డిసిపి-అడ్మిన్) మోకా సత్తిబాబుకు ఫిర్యాదు చేశారు.

మావోయిస్టు దేవా లొంగుబాటు

ప్రజాశక్తి - పాడేరు (అల్లూరి సీతారామరాజు జిల్లా)

మావోయిస్టు పార్టీ డివిజన్ కమిటీ సభ్యులు మడకం దేవా అలియాస్ భగత్ (42) పాడేరు జిల్లా కేంద్రంలో అల్లూరి జిల్లా ఎస్‌పి తుహిన్ సిన్హా ఎదుట గురువారం లొంగిపోయారు. అనంతరం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్‌పి తుహిన్ సిన్హా మాట్లాడుతూ.. సిపిఐ (మావోయిస్టు) పిఎల్‌ఎ బెటాలియన్ రెండో కంపెనీ రెండో ప్లాటూన్ కమాండర్ అయిన దేవా ఛత్తీస్‌గఢ్‌లోని సుక్మా జిల్లా, చింతగుప్ప పోలీస్ స్టేషన్ పరిధి దెబ్బకుంట గ్రామానికి చెందిన వారని తెలిపారు. 17 సంవత్సరాలుగా మావోయిస్టు పార్టీలో పనిచేస్తున్నారని, ఆయనపై రూ.ఐదు లక్షల రివార్డు ఉందని చెప్పారు. లొంగిపోయిన తరువాత ప్రభుత్వ పరంగా ఆయనకు రావాల్సిన మొత్తాన్ని అందజేస్తామని, సౌకర్యాలు కల్పిస్తామని అన్నారు. కార్యక్రమంలో రంపచోడవరం ఎఎస్‌పి మహేశ్వరరెడ్డి, చింతూరు ఎఎస్‌పి రాహుల్ మీనా పాల్గొన్నారు. ఇదిలా ఉండగా దేవా 2004లో కుంట పిఎస్ పరిధిలో జరిగిన పేలుడులో 12 మంది పోలీసులు మరణించిన ఘటనలో నిందితుడిగా ఉన్నాడు. 2020లో సుక్మా జిల్లా అర్మెట్ట గ్రామంలో 17 మంది సిఆర్‌పిఎఫ్ కమాండోలు మరణించడంలోనూ కీలకపాత్ర వహించాడు. మావోయిస్టు పార్టీ కార్యకలాపాల్లో చురుగ్గా వ్యవహరించాడు.

యుసిసిపై మీ వైఖరేమిటి?

- రాష్ట్రంలోని పార్టీలు స్పష్టతనివ్వాలని డిమాండ్
- సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బివి.రాఘవులు, ఎంఎ.బేబి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బివి.రాఘవులు, చిత్రంలో ఎంఎ.బేబి, వి.రాంభూపాల్

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

యూనియన్ సివిల్ కోడ్ (యుసిసి)పై వైసిపి, టిడిపి, జనసేనలు తమ వైఖరిని స్పష్టం చేయాలని సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బివి.రాఘవులు డిమాండ్ చేశారు. అనంతపురంలోని రేడియెంట్ ఫంక్షన్ హాలులో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో బివి.రాఘవులు, ఎంఎ.బేబి మాట్లాడారు. ఈ సందర్భంగా బివి.రాఘవులు మాట్లాడుతూ.. సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తోన్న తరుణంలో యూనియన్ సివిల్ కోడ్ అంశాన్ని కేంద్రం ముందుకు తీసుకొస్తోందని తెలిపారు. దేశంలో ప్రతి మతానికి ఒక పర్సనల్ లా ఉందని, ఇందులో మహిళలకు వ్యతిరేకంగానున్న వాటిని మొదట సమీక్షించి, అన్నింటిలోనూ సమానత్వాన్ని తీసుకొచ్చాక దీన్ని అమలు చేయాలని తమ పార్టీ సూచిస్తోందన్నారు. ఒక క్రమపద్ధతిలో అన్ని పర్సనల్ లాలను సమీక్షిస్తూ ముందుకుపోవాలని మొదటి లా కమిషన్ సూచించిందని గుర్తు చేశారు. దీనిపై దేశ వ్యాప్తంగా ఇంత పెద్దఎత్తున చర్చ జరుగుతున్నా రాష్ట్రంలోని ప్రధాన పార్టీలు పెదవి విప్పకపోవడం శోచనీయమన్నారు. నిత్యావసర సరుకుల ధరలు 10 నుంచి 20 శాతం పెరిగాయని చెప్పారు. ధరల నియంత్రణకు కేంద్రం ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు. ఇప్పటికైనా ధరల స్థిరీకరణ నిధిని ఏర్పాటు చేసి నిత్యావసర ధరలను ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. ఇక రాష్ట్రంలో పేదలకు 60 వేల ఎకరాలు పంచుతామని మంత్రివర్గంలో తీసుకున్న నిర్ణయాన్ని చిత్తశుద్ధితో అమలు చేస్తారా? లేక ఎన్నికల కోసం తీసుకున్న నిర్ణయమా? అన్నది ప్రశ్నార్థకంగా ఉందన్న సందేహాన్ని వ్యక్తం చేశారు. అసైన్డ్ చట్టంలోనూ మార్పులు తీసుకొచ్చి 20 సంవత్సరాలు దాటితే భూమిని అమ్ముకునే వెసులుబాటు కల్పించారన్నారు. 45 రోజుల్లో దళిత వాడలన్నింటికీ శ్మశాన వాటికలు ఏర్పాటు చేయాలని ఆదేశాలిచ్చారని.. ఆ ఆదేశాలు ఇంత వరకు అమలు కాలేదన్నారు. వలంటీర్ల వ్యవస్థపై మీడియా ప్రతినిధులు అడిగిన ప్రశ్నకు ఆయన స్పందిస్తూ..ప్రభుత్వ సేవలను ప్రజలకు దగ్గర చేయడానికి ఒక వ్యవస్థ ఏర్పాటు చేయడం సరైనదే అని, కాని దాన్ని ఆచరణలో ఏమి చేస్తున్నారన్నది ప్రధానమైన అంశమన్నారు. రాష్ట్రంలో ఈ వ్యవస్థ ద్వారా స్థానిక సంస్థల అధికారాలు, విధులను నాశనం చేసే విధంగా ఉందన్నారు. పంచాయతీల పరిధిలోకి వీటిని తీసుకొచ్చి సక్రమంగా సేవలందించే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. బిజెపి, దాని మిత్రపక్షాలుగానున్న పార్టీలను ఓడించడమే తమ లక్ష్యమని చెప్పారు. ఎన్నికల్లో ఎవరితో పొత్తు అన్న అంశంపై విలేకరి అడిగిన మరో ప్రశ్నకు ఆయన పై విధంగా సమాధానమిచ్చారు.

యుసిసి అంటే అల్టీరియల్ కమ్యూనల్ క్యాలిక్యులేషన్‌గా మారింది : ఎంఎ.బేబి

యూనిఫామ్ సివిల్ కోడ్ కాకుండా అల్టీరియల్ కమ్యూనల్ క్యాలిక్యులేషన్ అనే అర్థం వచ్చే విధంగా కేంద్రం మార్చివేస్తోందని సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు ఎంఎ.బేబి విమర్శించారు. యూనిఫామ్ సివిల్ కోడ్ అంటూనే ఈశాన్య రాష్ట్రాలు, గిరిజనులు, క్రిస్టియన్లు దీని పరిధిలోకి రావని బిజెపి నాయకులు చెబుతున్నారని గుర్తు చేశారు. వచ్చే ఎన్నికలకు దృష్టిలో ఉంచుకుని మతపరమైన విభజన ద్వారా లబ్ధిపొందేందుకు దీన్ని ముందుకు తీసుకొస్తోందని విమర్శించారు. కేంద్ర దర్యాప్తు సంస్థలను రాజకీయ పరికరంగా వాడుకుంటూ మహారాష్ట్ర, ఇతర రాష్ట్రాల్లో ప్రభుత్వాలను పడగొట్టి అధికారంలోకి వచ్చిందని గుర్తు చేశారు. అనంతపురం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్ పాల్గొన్నారు.

అమరావతి రైతుల బకాయిలు విడుదల చేయండి

- ప్రభుత్వానికి క్రిడా అధికారుల లేఖ

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

అమరావతిలో భూములిచ్చిన రైతులకు చెల్లించవలసిన ఎన్యూటీ బకాయిలను తక్షణమే విడుదల చేయాలని క్రిడా అధికారులు రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు మున్సిపల్, పట్టణాభివృద్ధి శాఖ ముఖ్యకార్యదర్శికి లేఖ రాశారు. రైతుల నుండి తీసుకున్న భూములకు చెల్లించవలసిన వార్షిక పరిహారం 175 కోట్ల రూపాయలు విడుదల చేయాలని ఈ లేఖలో కోరారు. ఎన్యూటీ చెల్లింపు ఇప్పటికే ఆలస్యమైన నేపథ్యంలో ఆర్థికశాఖతో అవసరమైన సమన్వయాన్ని చేసుకోవాలని కోరారు. ఎన్యూటీ ఇంకా అందకపోవడంతో రైతులు క్రిడా కార్యాలయం చుట్టూ తిరుగుతున్న సంగతి తెలిసిందే. భూ సమీకరణ పథకం కింద రైతుల నుంచి 34 వేల ఎకరాలను క్రిడా అధికారులు సేకరించారు. ఈ భూముల్లో మెట్ట రైతులకు 3వ వేలు, జరీబు రైతులకు 50 వేలు చొప్పున వార్షిక పరిహారంగా చెల్లించాల్సి ఉంటుంది. ఇందుకు అదనంగా మెట్ట భూములకు 3 వేలు, జరీబు రైతులకు ఐదు వేలు చొప్పున ప్రతియేటా పెంచి చెల్లించాల్సి ఉంటుంది. వీటి కోసం 2023-24 ఆర్థిక సంవత్సరంలో రాష్ట్ర ప్రభుత్వం 240 కోట్లు కేటాయించింది. ఇందులో 22,125 మంది రైతులకు సంబంధించి 26,926 ఎకరాలకు వార్షిక పరిహారం కింద 175 కోట్లు చెల్లించేందుకు ఆర్థికశాఖకు బిల్లులు కూడా క్రిడా అధికారులు పంపించారు. ఈ బిల్లులు ఇంకా సిఎఫ్‌ఎంఎస్‌లోనే పెండింగ్‌లో ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. దీంతో కొందరు రైతులు హైకోర్టును కూడా ఆశ్రయించారు. ఈ నేపథ్యంలో ఆ నిధులు తక్షణమే విడుదల అయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ క్రిడా అధికారులు తాజా లేఖను రాశారు.

చర్మకార వృత్తిదారులకు సౌకర్యాలు కల్పించాలి

- లిడ్‌క్యాప్ ఛైర్మన్‌కు కెవిపిఎస్ వినతి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

పట్టణాల్లో ఉన్న చర్మకార వృత్తిదారులకు గొడుగులు, కూర్చోవడానికి బల్లలు ఇవ్వాలని కెవిపిఎస్ కోరింది. ఈ మేరకు లిడ్‌క్యాప్ ఛైర్మన్ కాకుమాను రాజశేఖర్‌కు ఆ సంఘం అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఓ నల్లప్ప, అంద్ర మాల్యాద్రి బుధవారం లేఖ రాశారు. పట్టణ కేంద్రాల్లో ప్లాట్‌ఫారాలు, ఇళ్ల వద్ద సుమారు 10వేల మంది చెప్పులు కుట్టే కార్మికులు ఉన్నారని తెలిపారు. దళిత కుటుంబాలకు చెందిన వీరు తరతరాలుగా ఈ వృత్తినే కొనసాగిస్తున్నారని తెలిపారు. ఎండ, వర్షాల్లో రోడ్డు పక్కన ప్రమాదకరమైన పరిస్థితుల్లో వృతి సాగిస్తున్నారని పేర్కొన్నారు. వీరికి కనీసం గుర్తింపు లేదని, అధికారుల చుట్టూ తిరిగినా పట్టించుకోవడం లేదని తెలిపారు. పోలీసులు వీరిని అనేక రూపాల్లో భయపెడుతున్నారని వెల్లడించారు. జిల్లా అధికారులు, వృత్తిదారులతో తక్షణమే సమావేశం నిర్వహించి సమస్యలను పరిష్కరించాలని కోరారు. వీటితోపాటు వారికి పెన్షన్లు ఇవ్వాలని కోరారు.

వైసిపికి విశాఖ జిల్లా అధ్యక్షులు పంచకర్ల రాజీనామా

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ (విశాఖపట్నం)

వైసిపి విశాఖ జిల్లా అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు పార్టీ అధ్యక్ష పదవికి, పార్టీ సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్టు ప్రకటించారు. విశాఖలో గురువారం ఉదయం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన ఈ నిర్ణయాన్ని వెల్లడించారు. ఇరవై ఏళ్లుగా రాజకీయాల్లో ఉన్నానని, ఎప్పుడూ ఎవరినీ నొప్పించకుండా కొనసాగానని తెలిపారు. ఎన్నో ఆశలు, ఆశయాలతో వైసిపిలోకి వచ్చానని, అవి నెరవేరనప్పుడు పార్టీలో ఉండడం సరికాదని భావించి రాజీనామా చేస్తున్నానని చెప్పారు. భవిష్యత్తు రాజకీయాలపై అభిమానులు, శ్రేయోభిలాషులతో చర్చించి నిర్ణయం తీసుంటామని తెలిపారు. వైసిపికి తాను ఫెయిల్యూర్ అధ్యక్షుడునని పేర్కొన్నారు. ఏడాది కాలంగా ఎన్నో సమస్యలను సిఎం దృష్టికి తీసుకెళ్లాలని ప్రయత్నించినా వీలుకాలేదన్నారు. ప్రజా సమస్యలు తీర్చలేనప్పుడు ఆ పదవిలో ఉండడం, పార్టీలో కొనసాగడం సమంజసం కాదన్నారు. పార్టీలో తనకు శత్రువులు ఎవ్వరూ లేరని, ఎన్నికల్లో టికెట్ల కేటాయింపు సర్వేల ఆధారంగానే జరుగుతాయని తెలిపారు. తాను ఎవరికీ, ఏ పార్టీకీ టచ్‌లో లేనని, ఇతరులు కూడా తనతో టచ్‌లో లేరని చెప్పారు. ఇదిలా ఉండగా, రమేష్‌బాబు రానున్న ఎన్నికల్లో పెందుర్తి టికెట్ ఆశించారని, ఆ మేరకు ఆయనకు హామీ దక్కక పోవడంతోనే రాజీనామా చేశారని పలువురు విశ్లేషిస్తున్నారు.

గ్రాట్యుటీ అమలు చేయండి

- సిఎం హామీ నిలబెట్టు కోవాలి
- లేకుంటే మరో పోరాటానికి సిద్ధం : సుబ్బరావమ్మ

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

గ్రాట్యుటీ అమలు చేయాలని, అంగన్‌వాడీ వర్కర్లకు ప్రతిపక్షనేత హోదాలో సిఎం జగన్ ఇచ్చిన హామీలను నెరవేర్చాలని అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుబ్బరావమ్మ డిమాండ్ చేశారు. అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ సమస్యలపై ప్రభుత్వం స్పందించకపోతే మరో పోరాటానికి సన్నద్ధం అవుతామని హెచ్చరించారు. అనంతపురం జిల్లాలో గురువారం విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. దీర్ఘకాలికంగా అంగన్‌వాడీలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోరుతూ రాష్ట్ర వ్యాప్తంగా 36 గంటల నిరసనలు చేపట్టామని, దీనికి రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ అంగన్‌వాడీలపైనే తప్పుడు ప్రచారాలకు పాల్పడడం దుర్మార్గమన్నారు. అనేక పోరాటాల ఫలితంగా గత ప్రభుత్వం 2018లో అంగన్‌వాడీ వర్కర్ల వేతనాన్ని రూ.7,500 నుంచి రూ.10,500, హెల్పర్‌లకు రూ.నాలుగు వేల నుంచి రూ. ఏడు వేలకు పెంపుదల చేసిందన్నారు.

వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కేవలం రూ. వెయ్యి మాత్రమే పెంచి మిన్నకుండిపోయిందన్నారు. పక్క రాష్ట్రాల కంటే అదనంగా వేతనాలు ఇస్తామన్న మాటను సిఎం జగన్ నిలుపుకోవాలని విజ్ఞప్తి చేశారు. యాప్‌ల పేరుతో వేధింపులూ అధికమయ్యాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఉద్యోగ విరమణ సదుపాయాలను వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి రమాదేవి మాట్లాడుతూ అంగన్‌వాడీలకు సంపూర్ణ పోషణ బిల్లులు చెల్లించాలని, మెయిన్ వర్కర్లతో సమానంగా మినీ వర్కర్లను గుర్తించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు శకుంతల, జిల్లా కోశాధికారి జమున, శ్యామల పాల్గొన్నారు.

'విలీన ఎయిడెడ్ ఉపాధ్యాయులకు ప్రమోషన్లివ్వాలి'

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ప్రభుత్వంలో విలీనమైన ఎయిడెడ్ ఉపాధ్యాయులకు ప్రమోషన్ సౌకర్యం కల్పించాలని ఆంధ్రప్రదేశ్ టీచర్స్ గిల్డ్ ప్రతినిధి సిహెచ్ ప్రభాకర్‌రెడ్డి డిమాండ్ చేశారు. గతేడాది 2250 మంది, ఈ ఏడాది 750 మంది ఉపాధ్యాయులు విలీనమయ్యారని గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వీరికి ఎపిజిఎల్ఐ, పిఎఫ్, గ్రూప్ ఇన్సూరెన్స్ జీతం నుంచి మినహాయిస్తారని తెలిపారు.

ఎంపి మిథున్‌రెడ్డికి నిరసన సెగ

- కాన్వాయ్‌ను అడ్డుకున్న పంచాయతీ కార్మికులు
- సమస్యలు పరిష్కరించాలని డిమాండ్



నిరసనకారులను బలవంతంగా అరెస్టు చేస్తున్న పోలీసులు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్ (అన్నమయ్య జిల్లా)

అన్నమయ్య జిల్లా మదనపల్లెలో ఎంపి మిథున్‌రెడ్డికి నిరసన సెగ తగిలింది. గురువారం మదనపల్లెకు వచ్చిన మిథున్‌రెడ్డికి తమ సమస్యలను విన్నవించేందుకు ప్రయత్నించగా ఆయన పట్టించుకోకపోవడంతో పంచాయతీ కార్మికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కాన్వాయ్‌ను అడ్డుకుని తిరుపతి రోడ్డుపై బైఠాయించారు. గంటపాటు రాస్తారోకో నిర్వహించడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. ప్రజాప్రతినిధులు ట్రాఫిక్‌లో చిక్కుకున్నారు. అక్కడే ఉన్న సిఐ మురళీ కృష్ణ కార్మికులకు నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. అయినప్పటికీ కార్మికులు తమ సమస్యలు ఎంపికి విన్నవించాలని పట్టుబడడంతో ఆందోళనకారులను పోలీసులు అరెస్టు చేశారు. అనంతరం వారిని విడుదల చేశారు. అరెస్టయిన వారిలో సిపిఎం జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు, పంచాయతీ కార్మిక సంఘం నాయకులు నాగరాజు, శంకర ఉన్నారు.

ఈ సందర్భంగా పంచాయతీ కార్మికుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు వెంకట్రామయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి సురేంద్రబాబు, సిపిఎం జిల్లా కార్యదర్శి మాట్లాడుతూ.. ఎంపి మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే నవాజ్‌బాషాలకు ప్రచార ఆర్భాటం తప్ప ప్రజలు, కార్మికుల సమస్యలు పట్టడం లేదన్నారు. కార్మికులకు ఇఎస్ఐ, పిఎఫ్ సౌకర్యం కల్పించాలని, వేతనాలు బ్యాంకు ద్వారా ఇవ్వాలని కోరితే, కేసులు పెడతారా? అని ప్రశ్నించారు. హైకోర్టు తీర్పు అమలు చేయాలని, కనీస వేతనం రూ. 21 వేలు ఇవ్వాలని, మరణించిన కార్మికులకు మట్టి ఖర్చులు రూ.25 వేలు ఇవ్వాలని, అక్రమంగా తొలగించిన కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించని పక్షంలో ఆందోళనలు మరింత తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు.



కియా నిర్వహించిన సంబరాల్లో పాల్గొన్న మంత్రులు, ఎంపి, ఎమ్మెల్యే, కియా ప్రతినిధులు

'కియా' అభివృద్ధికి మరింత సహకారం

మంత్రులు బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి, గుడివాడ అమర్‌నాథ్

ప్రజాశక్తి-పెనుకొండ (శ్రీ సత్యసాయి జిల్లా)

'కియా మోటార్స్' కంపెనీ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం నుంచి మరింత సహకారం, ప్రోత్సాహం అందిస్తామని రాష్ట్ర మంత్రులు బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి, గుడివాడ అమర్‌నాథ్ తెలిపారు. శ్రీ సత్యసాయి జిల్లా పెనుకొండ మండలం ఎర్రమంచి వద్ద ఏర్పాటు చేసిన కియా కంపెనీ గత నాలుగేళ్లలో పది లక్షల కార్ల ఉత్పత్తిని పూర్తి చేసుకున్న సందర్భంగా గురువారం విజయోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి బుగ్గన మాట్లాడుతూ.. వైసిపి ప్రభుత్వంలో రాష్ట్రానికి ఏడాదికి సగటున రూ.13 వేల కోట్లు పెట్టుబడులుగా వచ్చాయన్నారు. రాష్ట్రంలో ఏ పరిశ్రమ ఏర్పాటు చేసినా 75 శాతం స్థానికులకు ఉపాధి కల్పించాలని చట్టం తీసుకువచ్చినట్లు తెలిపారు. కియా మోటార్స్ కంపెనీకి ప్రభుత్వం నుంచి అవసరమైన సహకారం అందిస్తున్నామని చెప్పారు. మంత్రి గుడివాడ అమర్నాథ్ మాట్లాడుతూ.. 47 నెలల కాలంలోనే పది లక్షల కార్లను తయారు చేసిన కియా సంస్థ పురోగతి అభినందనీయమని అన్నారు. హైదరాబాద్ - బెంగళూరు కారిడార్‌లో ఓర్వకల్లు వద్ద పది వేల ఎకరాల్లో పారిశ్రామిక కారిడార్‌ను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుందన్నారు. కార్యక్రమంలో హిందూపురం ఎంపి గోరంట్ల మాధవ్, ఎమ్మెల్యే ఎం.శంకరనారాయణ, ఎమ్మెల్సీ మంగమ్మ, కియా మోటార్స్ ప్రతినిధులు పాల్గొన్నారు.

పరిపాలనపై అవగాహన లేకే విమర్శలు

- రెవెన్యూశాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి



రాష్ట్రంలో గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థ ద్వారానే పరిపాలన, అభివృద్ధి పథకాలు సమర్థవంతంగా అమలవుతున్నాయని రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. గుంటూరు కలెక్టరేట్‌లో గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. గతంలో మాదిరిగా ప్రజలు మండల, జిల్లా కేంద్రాలకు వెళ్లకుండా గ్రామాల్లోనే వారి సమస్యలు పరిష్కారమయ్యేలా నూతన వ్యవస్థను ఏర్పాటు చేశామన్నారు. పరిపాలనపై అవగాహన లేకనే కొంతమంది సచివాలయ వ్యవస్థపై విమర్శలు చేస్తున్నారని తెలిపారు. పరిపాలనలో నిజమైన వికేంద్రీకరణ జరిగిందన్నారు. దీనిని అన్ని రాష్ట్రాలు ఆదర్శంగా తీసుకుంటున్నాయని తెలిపారు. జగనన్న సురక్ష ద్వారా లక్షలాది మందికి కొన్ని రోజుల్లోనే 11 రకాల ధృవీకరణపత్రాలు అందించామన్నారు. 32 లక్షల మందికి ఇళ్ల స్థలాలు ఇచ్చి ఇళ్లు కటిస్తుంటే ఓర్వలేని కొంత మంది లోపాలను వెతుకుతున్నారని విమర్శించారు.

విప్రోలో తగ్గుతున్న ఉద్యోగులు

క్యూ1లో రూ.2,870 కోట్ల లాభాలు



బెంగళూరు : టెక్ దిగ్గజం విప్రోలో వరుసగా మూడో త్రైమాసికంలోనూ ఉద్యోగుల్లో తగ్గుదల చోటు చేసుకుంది. 2023 జూన్‌తో ముగిసిన త్రైమాసికంలో 8,812 ఉద్యోగులు తగ్గారు. దీంతో మొత్తం నికర ఉద్యోగుల సంఖ్య 2,49,758కి తగ్గింది. కాగా.. గతేడాది ఇదే సమయంలో మాత్రం 15,446 కొత్త ఉద్యోగులను చేర్చుకుంది. 2023 మార్చి త్రైమాసికంలో మొత్తం ఉద్యోగుల సంఖ్య 2,56,921కి పడిపోయింది. కాగా.. గడిచిన త్రైమాసికంలో మరో ప్రధాన పోటీదారు టిసిఎస్ నికరంగా 523 మందిని, హెచ్‌సిఎల్ టెక్నలాజీస్ 2,500 మందిని జోడించింది.

బెంగళూరు కేంద్రంగా పని చేస్తోన్న అజీం ప్రేమ్‌జీకి చెందిన విప్రో ప్రస్తుత ఆర్థిక సంవత్సరం జూన్‌తో ముగిసిన ప్రథమ త్రైమాసికం (క్యూ1)లో లాభాల ఆర్జనలో మార్కెట్ అంచనాలను చేరలేకపోయింది. గడిచిన క్యూ1లో 11.9 శాతం వృద్ధితో రూ.2,870 కోట్ల లాభాలు నమోదు చేసింది. గతేడాది ఇదే త్రైమాసికంలో రూ.2,563 కోట్ల లాభాలు ప్రకటించింది. క్రితం క్యూ1లో రూ.3000 కోట్ల మేర లాభాలు ఆర్జించవచ్చని మార్కెట్ నిపుణులు అంచనా వేయగా.. విప్రో చేరలేకపోయింది. క్రితం క్యూ1లో కంపెనీ రెవెన్యూ 6 శాతం పెరిగి రూ.22,831 కోట్లుగా చోటు చేసుకుంది. గడిచిన త్రైమాసికంలో కంపెనీ పెద్ద క్లయింట్లను సాధించినట్లు విప్రో సిఇఒ, ఎండి తియెరి డెలపోర్ట్ తెలిపారు. 3.7 బిలియన్ డాలర్ల బుకింగ్స్‌ను నమోదు చేయగా.. ఇందులో పెద్ద ఒప్పందాల విలువ 1.2 బిలియన్ డాలర్లుగా ఉందన్నారు.

హెచ్‌డిఎఫ్‌సి లక్ష మంది ఖాతాదారులకు ఇ-రూపీ సౌలభ్యం

ముంబయి : ప్రయివేటు రంగంలోని హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్‌నకు చెందిన లక్ష మంది ఖాతాదారులు, 1,70,000 వ్యాపారులకు పైలట్ ప్రాజెక్టు కింద డిజిటల్ కరెన్సీ వినియోగానికి అవకాశం కల్పించింది. "సెంట్రల్ బ్యాంక్ డిజిటల్ కరెన్సీ (సిబిడిసి) అందుబాటులోకి తెచ్చిన ఇ-రూపీ లావాదేవీలకు వారికి అవకాశం కల్పించనున్నాము. క్యూఆర్ కోడ్‌ను ఉపయోగించి చెల్లింపులు చేయడానికి వీలుంది." అని హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ తెలిపింది. ఈ ఏడాదిలో 10 లక్షల ఇ-రూపీ లావాదేవీలు చేపట్టాలని ఆర్‌బిఐ లక్ష్యంగా పెట్టుకున్నామని.. ప్రస్తుతం ఇది 5,000 నుంచి 10,000గా ఉందని ఆర్‌బిఐ డిప్యూటీ గవర్నర్ టి రబి శంకర్ తెలిపారు. ఇది తమ వినియోగదారుల నుంచి నుండి డిజిటల్ రూపాయి కరెన్సీ రూపంలో లావదేవీలను అనుమతిస్తుందని హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ పేర్కొంది. ప్రస్తుతం హైదరాబాద్, విశాఖపట్నం, విజయవాడ సహా దేశంలోని ఇతర కీలక నగరాల్లో డిజిటల్ రూపాయి చెల్లింపులను అందిస్తోన్నామని తెలిపింది.

నవీ టెక్నాలజీలో 200 మందికి ఉద్వాసన

న్యూఢిల్లీ : ఫ్లిప్‌కార్ట్ ఫౌండర్ సచిన్ బన్సల్ ఆధ్వర్యంలోని స్టార్టప్ సంస్థ నవీ టెక్నలాజీ 200 మంది ఉద్యోగులకు ఉద్వాసన పలికింది. ఇందులో దాదాపు 60 నుంచి 70 శాతం మంది ప్రొడక్ట్ డెవలప్‌మెంట్ అండ్ మేనేజ్‌మెంట్ విభాగానికి చెందిన వారు ఉన్నారు. మిగిలిన ఉద్యోగులు పలు విభాగాలకు చెందిన వారని తెలుస్తోంది. కొన్ని వారాల క్రితమే ఈ ప్రక్రియ ప్రారంభమైనట్లు తెలిసింది. భవిష్యత్తులో మరి కొంత మందిని ఇంటికి పంపించే అవకాశాలున్నాయి. ప్రస్తుతం సంస్థలో 4680 మంది పని చేస్తున్నారు. మరోవైపు నవీ టెక్నాలజీస్ ఇన్షియల్ పబ్లిక్ ఆఫర్ (ఐపిఒ)కు రానున్న సమయంలో ఈ చర్య చోటు చేసుకోవడం గమనార్హం.

తాడేపల్లి కేంద్రంగా డ్రోన్ల తయారీ

- ఏడాదికి మూడువేలు ఉత్పత్తి
- ఒక్క డ్రోన్‌తోనే రోజుకు 30 ఎకరాల్లో పురుగుమందు పిచికారీ



ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

దేశంలో ప్రముఖ డ్రోన్ తయారీ సంస్థ డ్రోన్స్ ప్రైవేటు లిమిటెడ్ ఎపిలోని తాడేపల్లి కేంద్రంగా డ్రోన్ల తయారీకి సిద్ధమైంది. ప్రస్తుతం హైదరాబాద్‌లో తయారు చేస్తున్నా త్వరలో తాడేపల్లి నుంచి తయారీ ప్రారంభించనున్నట్లు సంస్థ సిఇఒ బొంతు యశ్వంత్ ప్రకటించారు. ఈ మేరకు గురువారం ప్రకటన విడుదల చేశారు. ప్రస్తుతం మానవ రహిత వైమానిక వాహనం (యుఎవి) క్రిషి 2.0ను ఆవిష్కరించామని, ఈ డ్రోన్ ద్వారా రోజుకు 30 ఎకరాల్లో క్రిమి సంహారక పురుగుమందులు పిచికారీ చేయొచ్చని తెలిపారు. ఇప్పటికే సర్వేయింగ్, మ్యాపింగ్, థర్మల్ ఇమేజింగ్, లీడార్ సేవలను సేవలందిస్తున్న డ్రోగో డ్రోన్స్ కొత్తగా తయారీ రంగంలోకి దిగిందని, డిమాండ్‌ను బట్టి ఉత్పత్తిని పెంచుతామని ఆయన వివరించారు. డ్రోన్ సేవల రంగం వచ్చే మూడేళ్లలో రూ.30 వేల కోట్లకు పెరిగే అవకాశం ఉందని పేర్కొన్నారు. రాష్ట్రంలో 26 సేవా కేంద్రాలను ఏర్పాటు చేయనున్నామని యశ్వంత్ వివరించారు.

సెల్‌కాన్ చేతికి టచ్ మొబైల్స్

- 200 ఫ్రాంచైజీ స్టోర్ల ఏర్పాటు లక్ష్యం : సిఎండి వై గురు



ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మల్టీ మొబైల్స్ రిటైల్ చెయిన్ టచ్ మొబైల్స్‌ను ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తుల కంపెనీ సెల్‌కాన్ గ్రూప్ స్వాధీనం చేసుకున్నట్లు ప్రకటించింది. ఈ ఒప్పందం ఒక ముఖ్యమైన మైలురాయిగా నిలువనుందని సెల్‌కాన్ గ్రూప్ సిఎండి వై గురు అన్నారు. గురువారం హైదరాబాద్‌లో ఆ సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మురళి రేతినేనితో కలిసి గురు మీడియాతో మాట్లాడారు. టచ్ మొబైల్స్‌కు ప్రస్తుతం తెలుగు రాష్ట్రాల్లో 42 అవుట్‌లెట్లు ఉన్నాయన్నారు. వచ్చే మార్చి ముగింపు నాటికి దక్షిణాదిలో మరో 200 ఫ్రాంచైజీ స్టోర్లను, సొంతగా మరో 50 అవుట్‌లెట్‌లను ఏర్పాటు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. వచ్చే ఆర్థిక సంవత్సరం నుంచి దేశ వ్యాప్త విస్తరణపై దృష్టి పెట్టనున్నా మన్నారు. రూ.15 లక్షల మొత్తంతో ఫ్రాంచైజీ తెరవడానికి వీలు కల్పిస్తున్నామన్నారు. యువ ఔత్సాహికవేత్తలకు, టెక్నిషన్లకు అవకాశాలు కల్పించనున్నామన్నారు. 2022-23లో సెల్‌కాన్ గ్రూప్ రూ.2,600 కోట్ల ఆదాయం ఆర్జించిందని.. 2023-24లో రూ.5,000 కోట్లు అంచనా వేస్తున్నామన్నారు. గతేడాది టచ్ మొబైల్స్ రూ.200 కోట్ల టర్నోవర్ నమోదు చేసిందన్నారు. మొబైల్స్ సర్వీస్, విక్రయాలలో సమగ్ర శిక్షణ అందించడానికి హైదరాబాద్, తిరుపతి నగరాల్లో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్లను ఏర్పాటు చేయనున్నామన్నారు. 10వ తరగతి, ఐటిసి చేసిన వారికి నైపుణ్యాలు అందించి.. వారికి ఉపాధిని కల్పించనున్నామన్నారు. ప్రతీ ఏడాది 500-1000 మందికి శిక్షణ ఇవ్వాలని నిర్దేశించుకున్నామన్నారు. తెలుగు రాష్ట్రాల్లో మహిళల ఆధ్వర్యంలో ఎక్స్‌క్లూజివ్ స్టోర్లను ఏర్పాటు చేయనున్నామన్నారు. తెలంగాణ ప్రభుత్వం నుంచి రూ.100 కోట్లు, ఎపి ప్రభుత్వం నుంచి రూ.125 కోట్ల ఆర్డర్లను కలిగి ఉన్నామన్నారు.

సంపాదకీయం

వరదలు చెప్పే పాఠం!

మన దేశంలో ఇప్పుడు ఓ విచిత్రమైన వాతావరణం నెలకొని ఉంది. దక్షిణాది, కొన్ని ఇతర రాష్ట్రాలూ వర్షాభావంతో సతమతమవుతుంటే- ఉత్తరాది రాష్ట్రాలు కొన్ని రికార్డు స్థాయి వర్షాలూ వరదలతో విలవిల్లాడుతున్నాయి. వారం రోజుల వ్యవధిలో లక్షల కోట్ల ఆస్తి నష్టంతో గజగజ వణుకుతున్నాయి. హిమాచల్ ప్రదేశ్, పంజాబ్, హర్యానా, ఢిల్లీ, ఉత్తరాఖండ్, ఉత్తర ప్రదేశ్, జమ్మూ కాశ్మీర్, రాజస్థాన్ భారీ వర్షాలతో అతలాకుతలమయ్యాయి. జనజీవనం స్తంభించిపోయింది. 120 మందికి పైగా ప్రాణాలు కోల్పోయారు. జమ్మూ కాశ్మీర్లో నిర్మాణంలో వున్న ఒక టన్నెల్ కూలిపోయి, పదుల సంఖ్యలో కార్మికులు అందులో చిక్కుకుని చనిపోయారు. కొండ చరియలు విరిగిపడి, కొన్నిచోట్ల వంతెనలు కొట్టుకుపోయి, వాహనాలు ఎక్కడికక్కడ ఆగిపోయాయి. దాదాపు వెయ్యి రైళ్లు రద్దయి, ప్రయాణాలు ఆగిపోయాయి. 45 ఏళ్ల తరువాత యమునా నదిలో తీవ్రస్థాయిలో వరద పోటెత్తింది. ఢిల్లీలోని అనేక జనావాసాలను ముంచెత్తింది. ఢిల్లీ ముఖ్యమంత్రి నివాసం సైతం వరద తాకిడికి గురైంది. విద్యుత్ సరఫరా నిలిచిపోయి, వీధుల్లోకి, ఆవాసాల్లోకి వరద నీరు చొచ్చుకు వచ్చి, రవాణా సదుపాయాలు స్తంభించిపోయి, నిత్యావసర సరుకులు అందకుండా పోయి...వరద ప్రాంతాల్లోని ప్రజలు పడుతున్న బాధలు వర్ణనాతీతం.

2013 ఉత్తరాఖండ్ ఆకస్మిక వరదలు తరువాత ప్రతి ఏటా ఏదొక చోట ఇలాంటి ప్రకృతి వైపరీత్యాల తీవ్రతను చూస్తూనే ఉన్నాం. చెన్నయ్, బెంగళూరు, ముంబయి వంటి మహా నగరాలు వరదల్లో చిక్కుకుపోవడం, కార్లు, బస్సులు వంటి వాహనాలు కాగితపు పడవల్లా కొట్టుకుపోవడం చూశాం. ఇలా వరస వైపరీత్యాలు జరుగుతున్నప్పుడు అప్పటికప్పుడు హడావిడి చేయడంగా కాక, శాశ్వత పరిష్కారాలను కనుక్కోవాల్సి ఉంటుంది. ఈ పరిస్థితులకు మూలమేమిటో శాస్త్రీయంగా పరిశీలించటం; ఆధునిక విజ్ఞానాన్ని, సాధారణ వివేకాన్ని ఉపయోగించటం చాలా అవసరం. కానీ, వర్షాల కోసం యజ్ఞాలు చేసి, వరదలకు దేవతల శాపాలే కారణమని ప్రవచించే పార్టీల, నాయకుల ఏలుబడిలో ఉన్నాం మనం. నదుల వ్యవస్థకు సంబంధించి ఒక సమగ్రమైన ప్రణాళిక కానీ, కట్టుదిట్టమైన కార్యాచరణ కానీ కేంద్ర ప్రభుత్వం వద్ద లేదు.

సరళీకరణ విధానాలు ప్రారంభమయ్యాక దేశంలో ప్రకృతి వనరులు కార్పొరేట్ల వ్యాపార చెరలోకి వెళ్లిపోయాయి. అభివృద్ధి పేరిట విచ్చలవిడిగా, విధ్వంసకరంగా చేపడుతున్న చర్యలు వాతావరణ సమతుల్యాన్ని విపరీతంగా దెబ్బతీస్తున్నాయని శాస్త్రజ్ఞులు ఎప్పటినుంచో చెబుతున్నారు. నివారణా మార్గాలను, పరిష్కార సూత్రాలను అనేక నివేదికల్లో వల్లె వేస్తూనే ఉన్నారు. కానీ, పాలకులు పట్టించుకున్నది ఎక్కడ? రియల్ ఎస్టేటు వ్యాపారం విస్తరించి, పట్టణాలు, నగరాల్లోని నీటి ప్రవాహ మార్గాలు పెద్దఎత్తున ఆక్రమణకు గురయ్యాయి. వాగులూ వంకలను, చెరువులను స్వార్థంతో కప్పేసి, నివాస నిలయాలుగా మార్చేస్తున్నారు. నదీ పరివాహక ప్రాంతాల్లోనూ చెట్ల నరికివేత విపరీతంగా సాగి, నివాసాలు వెలుస్తున్నాయి. అభివృద్ధి చెందిన, చెందుతున్న దేశాలు విడుదల చేస్తున్న కర్బన ఉద్గారాల కాలుష్యం పర్యావరణానికి తీరని హాని కలిగిస్తూనే ఉంది. వీటన్నిటి పర్యవసానంగా హిమాలయాల్లో బగిని వంటి మంచు ప్రాంతాలు కరగటం, ప్రకృతి అదుపు తప్పి అతివృష్టిగానో, అనావృష్టిగానో విరుచుకుపడడం మామూలై పోయింది!

ఈ విపత్కర పరిస్థితి నుంచి ప్రజలు బయటపడటానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో పనిచేయాలి. ఢిల్లీ నగరంలోనే పీఠం వేసిన కేంద్ర పాలక వ్యవస్థ ముఖ్యమంత్రి కేజ్రీవాల్ స్వయంగా కోరినప్పటికీ సహాయక చర్యల్లోకి దిగలేదు. విపత్తు సమయాల్లోనూ వికృత రాజకీయాలకు పాల్పడ్డం ప్రజాస్వామిక చర్య అనిపించుకోదు. దేశ ప్రధాని, ఆయా రాష్ట్రాల ముఖ్యమంత్రులు, ఇతర ప్రజాప్రతినిధులు, అధికార యంత్రాంగం యావత్తూ కదలి, వరద బాధితులకు భరోసా ఇవ్వాలి. తిండి, నీరు, నివాస యోగ్యత కల్పించి, అన్ని విధాలా ఆదుకోవాలి. తరువాత శాశ్వత ప్రాతిపదికన అవసరమైన చోట చిన్న చిన్న రిజర్వాయర్లు నిర్మించటం, కొండవాలు ప్రాంతాల్లో రక్షణ గోడల ఏర్పాటు, ప్రవాహ మార్గాల్లో ఆక్రమణలను అరికట్టటం వంటి చర్యలు తీసుకోవాలి. ఆధునిక శాస్త్ర సాంకేతిక విజ్ఞానాన్ని, వ్యవస్థలను బలోపేతం చేయాలి. వాటి సమన్వయంతో, శాస్త్రీయమైన ఆచరణతో మాత్రమే వరదలు వంటి ప్రకృతి వైపరీత్యాల నుంచి మనల్ని మనం రక్షించుకోగలం.

మహనీయుల మాట




ఏం జరుగుతున్నదో బిగ్గరగా చెప్పడమే ఎవరైనా ఎప్పుడైనా చేయగల అత్యంత విప్లవాత్మకమైన పని.

- రోజా లగ్జంబర్గ్,
మార్క్సిస్టు సిద్ధాంతకర్త.

Rosa Luxemburg

పోలవరం అంటే నిర్వాసితుల త్యాగాలే...

విశ్లేషణ



ఎ. రవి

పోలవరం అంటే ప్రాజెక్టు మాత్రమే కాదు. అంతకుమించి త్యాగజీవులైన నిర్వాసితులకు పునరావాసం కల్పించడం కూడా. ప్రాజెక్టు మొదలెట్టి పద్దెనిమిదేళ్లయినా పునరావాసం పన్నెండు శాతం కూడా పూర్తికాకపోవడం నిర్వాసితుల పట్ల పాలకుల నిర్లక్ష్యానికి అద్దం పడుతుంది. పునరావాసం కల్పించకుండా వారిని జలసమాధి చేసి ప్రాజెక్టు నిర్మాణం చేయడాన్ని ఎవ్వరూ అంగీకరించరు. ప్రాజెక్టు నిర్మాణం అంటే పునరావాసం పూర్తి చేయడం ద్వారానే సాధ్యమని గుర్తించాలి. గతంలో ప్రకృతి ప్రకోపించడంతో గోదావరికి వరదలొచ్చేవి. నేడు ప్రాజెక్టు నిర్మాణం వల్ల వరదలు వస్తున్నాయి. గతంలో వరదలొస్తే వారం, పది రోజులు మెట్ట ప్రాంతాల్లో పునరావాసం పొందాల్సి వచ్చేది. కాఫర్ డ్యాం నిర్మాణంతో నీళ్ళు ఎదురు తన్నడంతో వరదలొస్తున్నాయి. ఎప్పుడూ జులై నెలలో వరదలొచ్చేవి కావు. కానీ ప్రభుత్వ వైఫల్యం వల్ల 2022 జులైలో వరదలొచ్చాయి. 15 నుండి 3 నెలల పాటు కొండలు, గుట్టలు, పునరావాస కేంద్రాల్లో తలదాచుకున్నారు. ఈ సందర్భంగా చాలామందికి ఉన్న గూడు కొట్టుకుపోయింది. వరదల సమయంలో ఒక కొవ్వొత్తి మాత్రమే ఇచ్చారు. ఈసారి వరదల్లో అగ్గిపెట్టె అయినా ఇస్తారా అని దీనంగా ప్రశ్నిస్తున్నారు. రేషన్ కార్డుపై ఒక మంచినీటి ప్యాకెట్ మాత్రమే ఇచ్చారు. నాడు ఇస్తానన్న వరద పరిహారం సంవత్సరం గడిచినా నేటికీ ఇవ్వలేదు. వరదలు తగ్గాక భూములు సాగుకు సాధ్యం కావడం లేదు. ఉపాధి లేదు. బతికే మార్గం గగనమయ్యింది. ముంపు ప్రాంతం పేరుతో మౌలిక వసతుల కల్పన సైతం ఆపేశారు. దీనితో మాకు రావాల్సిన పునరావాస ప్యాకేజి ఇచ్చి కాలనీలు కట్టిస్తే మా బతుకేదో మేం బతుకుతాం అంటూ వాపోతున్నారు. పాలకులలో మాత్రం కదలిక లేదు.

ప్రాజెక్టు నిర్మాణానికి తొలి నోటిఫికేషన్ 2005 ఏప్రిల్ 15న వెలువడింది. అంటే 18 ఏళ్ళు పూర్తయ్యాయి. జాతీయ ప్రాజెక్టు, అధునాతన పరిజ్ఞానంతో నిర్మాణమని గొప్పగా చెప్తున్నా...నేటికీ ముంపు గ్రామాలేవో, నిర్వాసితులెవరో తేల్చకపోవడమే నిదర్శనం. పాలకులు ఇందుకు సిగ్గు పడాలి. ఫ్లడ్ రిజర్వాయర్ లెవల్ (ఎఫ్ఆర్ఎల్) అని మొదట్లో హద్దులు వేశారు. తర్వాత దశలు. కాంటూరు బ్లాకులు అంటూ విడదీశారు. తొలుత 41.15 మీటర్లు కాంటూరులో ఉన్న గ్రామాలకు పునరావాసం కల్పిస్తామంటున్నారు. తర్వాత 45.7 కాంటూరు పరిధిలోని వారికి పునరావాసం కల్పిస్తామన్నారు. ఈ కాకి లెక్కలతో నేటికీ ఏలూరు జిల్లా కుకునూరు, వేలేరుపాడు, రంపచోడవరం జిల్లాలో వి.ఆర్.పురం, చింతూరు, కూనవరం, ఎటపాక మండలాల్లో ముంపు గ్రామాల ఎంపికలో గందరగోళం సాగుతూనే ఉంది. దీంతో 18 ఏళ్ళైనా ఏ గ్రామాలు మునుగుతాయో, ఏవి మునగవో, మునిగిపోతున్న తమను నిర్వాసితులుగా గుర్తించారో లేదో అని ఆందోళనతోనే జీవిస్తున్నారు.

చిత్రమేమంటే 1986, 2022 సంవత్సరాల్లో వచ్చిన వరదల్లో పూర్తిగా మునిగిపోయిన గ్రామాలు సైతం 41.15 కాంటూరు లోకి రావని, ముంపు గ్రామాలు కావని అనడంతో నిర్వాసితుల ఆక్రోశం వర్ణనాతీతం. వరదల్లో తమ ఇళ్ళపై నుండి పడవలు తిరిగాయని ఇప్పుడు తమ గ్రామం ముంపులోకి రాదంటే ఎలాగని ప్రశ్నిస్తున్నారు. ఇంకా విచిత్రమేమంటే నిర్వాసితులకు నిర్మిస్తోన్న కుకునూరు మండలంలోని కివ్వాక, వెంకటాపురం, కూనవరం మండలంలో భైరవపట్నం, ఎటపాక మండలంలో కన్నాయిగూడెం కాలనీలు ముంపుకు గురయ్యాయి. ఇక పునరావాస కాలనీలు కూడా మునిగిపోతే ఇక మా పరిస్థితి ఏమిటన్న ప్రశ్నకు ప్రభుత్వం నుండి సమాధానం లేదు. కుకునూరు మండలంలో 10 గ్రామాలు వేలేరుపాడు మండలంలో 9, చింతూరు 1, వి.ఆర్.పురం 9, కూనవరం 7 గ్రామాలను మొత్తం 36 గ్రామాలను తొలి దశలో పునరావాసం కల్పించే గ్రామాల జాబితాలో ప్రకటించారు. వేలేరుపాడు మండలంలో బోరేపల్లి, కొత్తూరు, వసంతవాడ, కట్కూరు గ్రామాలలో ఇదే పరిస్థితి. మిగిలిన మండలాలోనూ ఇలాంటి ఉదాహరణలెన్నో. గ్రామాలకు పునరావాసం 70 కి.మీ. దూరంలో కల్పిస్తున్నారు. వీరు ఆ భూముల్ని ఎలా సాగు చేస్తారన్న ప్రశ్నకు సమాధానం లేదు. ఇక భూములు మునిగాక వాళ్ళెలా జీవించగలరనేది ఎవరికైనా తట్టే ప్రశ్న. కానీ ప్రభుతాలకు మాత్రం ఈ ప్రశ్న తట్టడం లేదు. అందుకే ప్రభుత్వం చెప్తున్నట్లుగా నిజంగానే కొన్ని గ్రామాలు ముంపుకు గురికావనే అనుకున్నా దీవుల్లా, దిబ్బల్లా మిగిలే గ్రామాలకు సాధారణ జీవితం, విద్యా, వైద్యం ఇతర మౌలిక సౌకర్యాలు ఎలా అందుతాయి? అందుకే ఈ కాకి లెక్కలు కట్టిపెట్టి మండలాన్ని యూనిట్గా తీసుకోవాలని ఈ ప్రాంత ప్రజలతో పాటు, సిపిఎంతో పాటు ఈ ప్రాంతపు సమస్యలపై కొద్దిపాటి అవగాహన ఉన్న వారంతా డిమాండ్ చేస్తున్నారు. ముంపు ప్రాంతాల గుర్తింపుకు ఇదే సరైన ప్రాతిపదిక కాగలదు. 18 సంవత్సరాలు నిండిన యువతీ, యువకులకు పునరావాస ప్యాకేజీ ఇవ్వడంలోనూ ప్రభుత్వం అనేక మెలికలు పెడుతున్నది. యువతులకు ఇవ్వనని ఒకసారి...ఇప్పుడు ఫ్యామిలీ ప్యాకేజీ అని మాట మారుస్తున్నది. పోరాటాల ఫలితంగా కటాఫ్ తేదీ 2017 డిసెంబర్ నాటికి గుర్తించింది. నేటికీ అత్యధిక గ్రామాలకు పునరావాసం కల్పించకపోవడంతో, ఖాళీ చేయించే తేదీనే కటాఫ్ తేదీగా నిర్ణయించాలని ప్రజానీకం, సిపిఎం కోరుతున్నది.



గుర్తించినా పునరావాసం దక్కలేదు

ముంపు గ్రామాల గుర్తింపే ఓ పెద్ద యజ్ఞంలా, ప్రహసనంలా సాగితే ఇక గుర్తించిన వారికి సైతం ఇన్నేళ్ళుగా పునరావాస ప్యాకేజి ఇవ్వకపోవడం మరో బాధాకర ఘట్టం. ఇంకా చెప్పాలంటే మొత్తం ప్రాజెక్టు వ్యవహారంలో ఇదే అతి పెద్ద వైఫల్యం. ఇంత వరకు ముంపులో ఉన్నది లక్షా ఆరు వేల కుటుంబాలైతే...అందులో పునరావాస ప్యాకేజీ ఇచ్చింది కేవలం 12 వేల కుటుంబాలకే. అంటే పద్దెనిమిదేళ్ళు గడిచినా 12 శాతం మందికి కూడా పునరావాస ప్యాకేజీ ఇవ్వలేకపోయిన పాలకులు మిగిలిన 88 శాతం మందికి ఇవ్వడానికి ఎన్ని దశాబ్దాలు పడ్తాయో కదా! ప్యాకేజీ పొందిన వారిలో పోలవరం, దేవిపట్నం మండలాల వారే వున్నారు. అయితే వారి మీద ప్రత్యేక ప్రేమతో పునరావాసం కల్పించలేదు. వీరిని అక్కడి నుండి తరలించనిదే ప్రాజెక్టు పనులు సాధ్యం కావని, వీరి పునరావాస కల్పన నిర్వాకానికి నిర్వాసితులు ఎక్కడ ప్రాజెక్టు పనులకు అడ్డుపడతారోనని వీరికి పునరావాస ప్యాకేజీ ఇచ్చి కాలనీలకు తరలించారు. పోలవరం మండలంలో ఆదివాసీల్ని పోలవరం, బుట్టాయిగూడెం, జీలుగుమిల్లి, మండలాలకు పునరావాసం కల్పించింది. ఇతరులకి పోలవరం, జంగారెడ్డిగూడెం, కొయ్యలగూడెం, గోపాలపురం మండలాల్లో పునరావాసం కల్పించారు. మోసపూరిత మాటలతో మరికొందర్ని, పోలీసులతో బెదిరించి మరికొందర్ని, దళారుల మాయ మాటలతో ఇంకొందర్ని పునరావాస కాలనీలకు తరలించారు. ఇందుకు నిలువెత్తు ఉదాహరణ వై.ఎస్. రాజశేఖర్ రెడ్డి హయాంలోనే సాగాయి. ప్రాజెక్టు నిర్మాణ గ్రామం, ఆదివాసీలున్న షెడ్యూల్డ్ గ్రామం దేవరగొందిని నాన్ షెడ్యూల్ ప్రాంతానికి తరలించారు. నాటి కలెక్టర్ ఎల్.అగర్వాల్ ఈ వికృత చర్యకు పాల్పడ్డాడు. త్వరలోనే పునరావాస కాలనీని షెడ్యూల్ ప్రాంతంగా గుర్తించేలా చేస్తానని నమ్మబలికాడు. నాడు ఈ చర్యను వ్యతిరేకించినందుకు సిపిఎం నేతల్ని నిర్బంధించడంతో పాటు పునరావాసానికి అడ్డొస్తున్నారంటూ ప్రచారం చేశారు. నాటి నుండి 2022 జులై వరదల్లో కూడా వేలేరుపాడు బోరెడ్డిగూడెం, కోయిదా గ్రామాల వారిని పునరావాస కాలనీలకు వెళ్ళిన మరుక్షణమే ప్యాకేజీ మొత్తం ఇస్తామన్నా నేటికీ బకాయిలున్నాయి. పదేళ్ళక్రితం తరలించిన గ్రామాల్లో సైతం 18 సంవత్సరాలు నిండిన యువతీయువకులకు ప్యాకేజీని పదుల సంఖ్యలో కూడా ఇవ్వలేదు. వేలేరుపాడు మండలంలో తేరాకగొమ్ములో 450 కుటుంబాల్లో కేవలం 5 గిరిజన కుటుంబాలకే ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ అందించారు. ఇది కూడా మండలంలో 70 గ్రామాలకు 50 గ్రామాలు మునుగుతుంటే 31 గ్రామాలను ముంపులో గుర్తించి 5 గ్రామాల్లో మాత్రమే పరిహారమిచ్చారు. కుకునూరు మండలం భువనగిరిలో చీరవల్లిలో సగం మందికి పరిహారమిచ్చారు. ఈ మండలం పరిస్థితీ ఇంతే. మొత్తం 90 గ్రామాలుంటే 70 గ్రామాలు ముంపుకు గురవుతుంటే 18 గ్రామాలను ప్రభుత్వం గుర్తించింది. వాటిలో ఒక గ్రామంలో పూర్తిగానూ, మరో గ్రామంలో పాక్షికంగానూ పరిహారం చెల్లించారు. ఇక అల్లూరి జిల్లాలో 4 మండలాల్లో ఇంతకంటే ఘోరం. పోడు భూములకు హక్కు పత్రాలు లేవనే సాకుతో ఎవ్వరికీ పరిహారం ఇవ్వలేదు. పునరావాస ప్యాకేజీ రూ.10 లక్షలు, భూమికి పరిహారం రూ.5 లక్షలు ఇస్తామన్న జగన్ ఎన్నికల హామీలు నాలుగున్నరేళ్ళు గడిచినా అతీగతీ లేదు. బటన్ ముఖ్యమంత్రిగా 'నేను కన్నాను. విన్నాను'న్న జగన్ గారికి నిర్వాసితుల కష్టాలు కనపడడం లేదా? మా ప్యాకేజీ బటన్ కూడా నొక్కొచ్చు కదా అన్న వారి మాటలు వినపడ్డం లేదా?

> **ముంపు గ్రామాల గుర్తింపే ఓ పెద్ద యజ్ఞంలా, ప్రహసనంలా సాగితే ఇక గుర్తించిన వారికి సైతం ఇన్నేళ్ళుగా పునరావాస ప్యాకేజి ఇవ్వకపోవడం మరో బాధాకర ఘట్టం. ఇంకా చెప్పాలంటే మొత్తం ప్రాజెక్టు వ్యవహారంలో ఇదే అతి పెద్ద వైఫల్యం. ఇంత వరకు ముంపులో ఉన్నది లక్షా ఆరు వేల కుటుంబాలైతే...అందులో పునరావాస ప్యాకేజీ ఇచ్చింది కేవలం 12 వేల కుటుంబాలకే. అంటే పద్దెనిమిదేళ్ళు గడిచినా 12 శాతం మందికి కూడా పునరావాస ప్యాకేజీ ఇవ్వలేకపోయిన పాలకులు మిగిలిన 88 శాతం మందికి ఇవ్వడానికి ఎన్ని దశాబ్దాలు పడ్తాయో కదా!**

నిర్వాసితుల కాలనీల్లో సౌకర్యాలేవీ?

రెండు జిల్లాల్లోని 8 మండలాల నిర్వాసితులకు సుమారు 70 కాలనీలు నిర్మిస్తున్నారు. వీటిలో 8 మండలాల గిరిజనేతరులకు జంగారెడ్డిగూడెం మండలంలో చల్లావారిగూడెం (తాడువాయి)లో 10 వేల కుటుంబాలకు ఇళ్ళు నిర్మిస్తున్నారు. గిరిజనులకు షెడ్యూల్ మండలాల్లో నిర్మిస్తున్నారు. రెండేళ్ళు కాకుండానే ఇల్లంతా వాన కురుస్తున్నది. గతంలో మేం పూరిపాకలో వుండేవాళ్ళం. ఇల్లంతా వాన కురిసేది. కురిసేచోట పాత్రలు పెట్టేవాళ్ళం. నేడు కాంక్రీట్ బిల్డింగ్లో పాత్రలు పెట్టుకున్నాం. తేడా ఏముందన్న నిర్వాసితుల ప్రశ్నకు పాలకులే జవాబివ్వాలి. 2013 భూసేకరణ చట్టం ప్రకారం 25 సౌకర్యాలతో కాలనీలు నిర్మించాలంటున్నా వాటి జాడే లేదు. ఇప్పటికీ పలు భవనాలు పునాది స్థితిలోనే ఉన్నాయి. పూర్తయ్యాయని చెప్పిన చోట మంచినీళ్ళు కూడా లేక అల్లాడుతున్నారు. వేలేరుపాడు మండలం బోరెడ్డి గూడెం గ్రామస్తులకు జీలుగుమిల్లి మండలంలో నిర్మించిన కాలనీలో 3 రోజుల వరకు నీరు రాకపోవడంతో పొరుగున రైతు బోరు నుండి నాల్గో రోజు నీళ్ళు తెచ్చుకున్నారు. కాలనీకో వీధిలైటు అన్నా పలు చోట్ల ఒక్క లైట్ వెలుగుతున్నది. అత్యధిక చోట్ల అంతర్గత రహదారులు నిర్మించలేదు. పోలవరం మండలం కొరుటూరు కాలనీకైతే లింకు రోడ్డు కూడా లేక అనేక ఇక్కట్లకు గురవుతున్నారు. కాలనీల్లో ఎక్కడా అంగన్వాడీ కేంద్రాలు, బడులు, పి.హెచ్.సి లు ప్రారంభం కాలేదు. దీంతో విద్య, వైద్యం అందని ద్రాక్షగా ఉంది. జీలుగుమిల్లి కాలనీలకు చెందిన వారు 7 కిలోమీటర్ల దూరంలోని తాడువాయి పాఠశాలకు వెళ్ళలేక చదువులు చాలిస్తున్నారు. గతంలో ఎత్తైన పాపికొండలపై జీవించారు తెల్లదిబ్బల గ్రామస్తులు. నేడు చెరువులో కాలనీ నిర్మాణంతో నిత్యం నీళ్ళు నిలిచిపోతున్నాయి. చివరికి చనిపోయిన వారికి అంత్యక్రియలు చేయడానికి సైతం శ్మశాన భూమి కేటాయించక పోవడంతో వారి ఆక్రోశం వర్ణనాతీతం. సిరివాక, సరుగుడు, తల్లవరం, పల్లపూరు, రామన్నగూడెం, పలు గ్రామాల వారికి శ్మశానవాటిక లేక ఆందోళన చేయగా...భూములైతే చూపించారుగానీ వాటికి దారులు లేవు.

స్థానిక గిరిజనుల సాగులో ఉన్న భూములను గిరజనేతర భూస్వాములు... అధికారులు, ప్రజా ప్రతినిధులతో కుమ్మక్కై తప్పుడు రికార్డులతో పరిహారం పొందారు. పలు చోట్ల ఆ భూములే నిర్వాసిత గిరిజనులకు అంటగట్టారు. ఘర్షణలు తలెత్తిన చోట తమకు సంబంధం లేదన్నట్టు అధికారులు చేతులెత్తేశారు. కొరుటూరు గ్రామస్తుల భూమి నేటికీ వివాదాల్లో ఉంది. పలుచోట్ల పాత భూయజమానులే కౌలు పేరుతో భూములు తమ గుప్పెట్లో ఉంచుకున్నారు. అన్నింటికీ మించి ఉపాధి కల్పనపై నిర్వాసితులకు జీవనం పొందడమే దుర్లభమై పోయింది. ఇప్పటికే యాంత్రీకరణతో వ్యవసాయ పనులు స్థానికులకే తగ్గిపోయాయి. నేడు వారక్కడికి చేరడంతో పనులు దొరకడమే గగనమవుతుంది. ఉపాధి హామీ పనులు చూపడానికి కూడా 'మా మండలంలో మీ జాబ్ కార్డులు లేవు. మీ గ్రామాలు గుర్తింపు లేదం'టూ నిరాకరిస్తున్నారు. చట్టం చెప్పినట్లు ఇంటికో ఉద్యోగం అన్న మాట కాగితాలకే పరిమితం అయ్యింది. చివరికి ఎస్టీ సర్టిఫికెట్లు జారీ చేయటంలో సైతం రికార్డులు మా దగ్గర లేవనే పేరుతో తిప్పుతున్నారు. ఎస్సీ, ఎస్టీలకు ఇచ్చే ఉచిత విద్యుత్ను సైతం నిరాకరిస్తున్నారు. ఇప్పుడు వరద గోదావరంత కష్టాలున్న నిర్వాసితులకు పునరావాసంతో మాకు సంబంధం లేదంటూ కేంద్రం, వారు నిధులిస్తేనే మీకు పునరావాసం అంటున్న రాష్ట్ర ప్రభుత్వంపై వారు తీవ్ర ఆగ్రహంతో ఉన్నారు. ఈ తరుణంలో సిపిఎం చేపట్టిన మహా పాదయాత్ర వారికి కొండంత ధైర్యాన్నిచ్చింది. ఐక్యంగా పోరాడితేనే పునరావాసం దక్కుతుందని నిర్వాసితులకు నచ్చజెప్పింది. పోరు కేక పోరుబాటగా మార్చడమే పరిష్కారంగా మహా పాదయాత్ర ద్వారా నిర్వాసితుల్ని చైతన్యపరిచింది. ఆ బాటే వారికి పునరావాసపు బాటలు వేస్తుంది.

/ వ్యాసకర్త సిపిఎం ఏలూరు జిల్లా కార్యదర్శి/

పశ్చిమ బెంగాల్ పంచాయతీ ఎన్నికల ప్రహసనం!

వ్యాఖ్య

పశ్చిమ బెంగాల్లో ఇటీవల జరిగిన మూడంచెల పంచాయతీ ఎన్నికల సందర్భంగా తృణమూల్ కాంగ్రెస్ (టిఎంసి) తన రాజకీయ ప్రత్యర్థులపై, తమకు వ్యతిరేకంగా ఓటు వేస్తారని భావించిన ప్రజలపై పదే పదే తీవ్ర స్థాయిలో హింసాకాండకు దిగింది, బెదిరింపులకు పాల్పడింది.

పోలింగ్ ప్రక్రియలోని ప్రతి దశలోను (నామినేషన్ల దాఖలు చేయడం నుండి, ప్రచారం, జులై 8 పోలింగ్ రోజున, జులై 11 ఓట్ల లెక్కింపు రోజున) అభ్యర్థులపై, ప్రతిపక్ష పార్టీల మద్దతుదారులపై దాడులు జరిగాయి. ఓటర్లను బెదిరించడం, వారిని పోలింగ్ బూత్లకు వెళ్ళి, ఓటు వేయనీయకుండా అడ్డుకోవడం, బ్యాలట్ బాక్సులను ఎత్తుకెళ్లడం, పోలింగ్ బూత్లను స్వాధీనం చేసుకోవడం వంటి చర్యలకు దిగారు. ఓటింగ్ క్రమంలో పెద్ద ఎత్తున అవకతవకలకు పాల్పడ్డారు.

చివరగా, అనేక చోట్ల పోలింగ్ ఫలితాలు తమకు అనుకూలంగా రావడం లేదని గ్రహించడంతో, ఓట్ల లెక్కింపు క్రమంలో పెద్ద ఎత్తున అవకతవకలకు దిగడం, ప్రతిపక్ష పార్టీలకు చెందిన కౌంటింగ్ ఏజెంట్లను లెక్కింపు జరిగే ప్రాంతాల నుండి బయటకు వెళ్ళగొట్టడం, ప్రతిపక్షాలకు చెందిన అభ్యర్థుల బ్యాలట్ పత్రాలను నాశనం చేయడం, ఫలితాలను తారుమారు చేయడం వంటి పనులకు దిగారు. సిపిఎం అభ్యర్థులు గెలుపొందారని, వారికి ఎన్నికైనట్లు సర్టిఫికెట్లను ఇచ్చే సమయంలో తృణమూల్ గూండాలు వాటిని లాక్కుని, చించివేసినట్లు అనేక వార్తలు వచ్చాయి. అత్యంత దారుణమైన కేసుల్లో ఒకటి భానగర్లో జరిగింది. అక్కడ ఐఎస్ఎఫ్ అభ్యర్థి జెహనారా బీబీ జిల్లా పరిషత్ ఎన్నికల్లో గెలుపొందారు. కానీ అక్కడ తృణమూల్ అభ్యర్థి గెలుపొందినట్లు ప్రకటించడానికి ప్రయత్నాలు జరిగాయి. ఈ మోసానికి వ్యతిరేకంగా స్థానికులు తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. దాంతో అర్ధరాత్రి సమయంలో, వారిపై పోలీసులు కాల్పులు జరిపారు. అక్కడికక్కడే ముగ్గురు మరణించారు. మొత్తమ్మీద ఈ ఎన్నికల సందర్భంగా చెలరేగిన హింసాకాండలో 60 మంది చనిపోయారు.

ఈ అన్ని అక్రమాల్లోనూ ప్రభుత్వ యంత్రాంగం, పోలీసులు, పాలక పార్టీతో కుమ్మక్కవడం ఈ ఎన్నికల్లో మరో కలవరపరిచే అంశం. రాష్ట్ర ఎన్నికల కమిషనర్ పాత్ర ఈ మొత్తం క్రమంలో అత్యంత అవమానకరంగా వుంది. ఇప్పటివరకు ప్రకటించిన ఫలితాల్లో తృణమూల్ కాంగ్రెస్ ఘన విజయం సాధించిందని ప్రధాన స్రవంతిలోని మీడియా ప్రకటించింది. రాజకీయ నిర్ధారణల కోసం ఈ ఎన్నికల ఫలితాలను విశ్లేషించడానికి ప్రయత్నించడంలో ఎలాంటి అర్థం లేదు. మొత్తం ఎన్నికల ప్రక్రియ అంతా ఒక ప్రహసనంగా మారింది. పంచాయతీ సంస్థలన్నింటినీ తన వశం చేసుకోవడానికి తృణమూల్ కాంగ్రెస్ చేసిన ప్రయత్నంలో ప్రజాస్వామ్యం ఛిద్రమైంది.

> **బిజెపి విషపూరిత, ప్రజాస్వామ్య వ్యతిరేక దాడులను ఎదుర్కొనడానికి ప్రతిపక్ష పార్టీలన్నీ సమాయత్తమవుతున్న వేళ...బెంగాల్లో టిఎంసి విషపూరితమైన ప్రజాస్వామ్య వ్యతిరేక దాడులు ... ప్రజాస్వామ్య పరిరక్షణకు పాటుపడుతున్నట్టు పోజు పెట్టేందుకు బిజెపికి అవకాశమిస్తున్నాయి. తద్వారా ప్రతిపక్షాల ఐక్యతకు తృణమూల్ తీవ్ర హాని కలిగిస్తున్నది.**

అయితే, ఈ ప్రజాస్వామ్య వ్యతిరేక దాడి...కొన్ని హృదయపూర్వకమైన దృశ్యాలను అడ్డుకోలేకపోయింది. 2018 పంచాయితీ ఎన్నికల సమయంలో మాదిరిగా కాకుండా, ఈ ఎన్నికల్లో మొదట నుండి టిఎంసి గూండాల దౌర్జన్యాలకు ప్రజా ప్రతిఘటన తీవ్రంగా వుంది. సిపిఎం, వామపక్ష సంఘటన అభ్యర్థులు, మద్దతుదారులు ఈ బెదిరింపులకు, భౌతిక దాడులకు ఎదురొడ్డి నిలబడిన ఘటనలు వందలాదిగా వున్నాయి. పోలింగ్ రోజున, వేలాదిమంది ప్రజలు టిఎంసి గూండాలను ఎదిరించి, బారికేడ్లను ఛేదించుకుని, తమ ఓటు హక్కు వినియోగించు కున్నారు. ఓట్ల లెక్కింపు క్రమంలో ఫలితాలను తారుమారు చేయాలని పన్నాగాలు పన్నిన పాలక పార్టీకి ఈ అనుభవం కలవరం కలిగించింది.



తృణమూల్ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని తీవ్ర స్థాయిలో వ్యతిరేకించింది వామపక్షాలు, కాంగ్రెస్ అన్న విషయం కూడా ఈ పంచాయతీ ఎన్నికల్లో వెల్లడైంది. దాంతో టిఎంసి భయోత్పాత ఎత్తుగడలకు ప్రధాన లక్ష్యాలుగా మారింది కూడా ఈ పార్టీలవారే. వీరితో పోలిస్తే బిజెపి ఇటువంటి దాడులకు గురైంది తక్కువే. ఈ కారణంగానే, టిఎంసి, బిజెపిలు ఒకే వర్గ ప్రాతిపదికను పంచుకుంటాయి. గ్రామీణ సంపన్నుల్లో, వారి పరాన్నభుక్కుల్లో వాటికి మద్దతు వుంది.

PEOPLE'S DEMOCRACY
THE WEEKLY PAPER OF THE COMMUNIST PARTY OF INDIA (MARXIST)

గ్రామీణ ప్రాంతాల్లో టిఎంసి ఆధిపత్యం గత దశాబ్ద కాలంగా అది ఏర్పాటు చేసుకున్న, నిర్వహించిన నెట్వర్క్ నుండే వచ్చింది. గ్రామీణ ప్రాంతాల్లో నయా సంపన్నులు ఈ పార్టీకి ప్రధాన మద్దతుగా వున్నారు. గ్రామీణ బెంగాల్లోని రాజకీయ ఆర్థిక వ్యవస్థ అంతా అన్ని స్థాయిల్లోని టిఎంసి కార్యకర్తలు వసూలు చేసే రెంట్ (ముడుపులు)తో నిండిపోయి వుంటుంది. వీరు ప్రభుత్వ సంక్షేమ పథకాల నిధులను 'కట్ మనీ' (కమిషన్లు) ద్వారా స్వాహా చేస్తుంటారు. వివిధ రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వ పథకాల లబ్ధిదారులయ్యేందుకు ప్రజల నుండి బలవంతంగా వసూలు చేసే కమిషన్లు ఇవి. టిఎంసి అభీష్టాన్ని అమలు చేసే నయా సంపన్నులు, వారి ఏజెంట్ల అవినీతి, శక్తివంతమైన నెట్వర్క్ ఇది. ముడుపులకు, బలవంతపు వసూళ్ళకు పంచాయతీలను దౌర్జన్యంగా హస్తగతం చేసుకోవడం, వాటిపై ఆధిపత్యం కలిగి వుండడం చాలా కీలకం. ఈ నెట్వర్క్ పరిధిలోనే, దోపిడీ సొమ్ము పంచుకోవడంపై ఘర్షణలు, విభేదాలు తలెత్తాయి. అదే సమయంలో, తృణమూల్ పెంచి పోషించే ఈ ముఠాలు, రాజకీయ ప్రత్యర్థులపై, అలాగే అసమానతలు, ప్రయోజనాలను కొల్లగొట్టడంపై ఎవరైనా అసమ్మతి గళాన్ని వినిపిస్తే వారి నుంచి ఈ పథకాల ప్రయోజనాలను లాగేసుకోవడం అనేది తృణమూల్ కాంగ్రెస్ చేతిలో ఒక ఆయుధంగా మారింది.

ఈ అవినీతి-క్రిమినల్ బంధాన్ని వ్యతిరేకిస్తూ సిపిఎం, వామపక్ష శక్తులు పోరాడుతున్నాయి. అసెంబ్లీ ఎన్నికలు జరిగినప్పటి నుండి గత రెండేళ్ళలో, టిఎంసి అవినీతి బంధాలకు పెరుగుతున్న వ్యతిరేకతలో వామపక్షాల పాత్ర ప్రధానంగా వుంది. అందువల్లే పంచాయితీ ఎన్నికల్లో వామపక్షాలపైనే ఎక్కువగా హింసాత్మక దాడులు చోటుచేసుకున్నాయి.

నిరంతరంగా జరుగుతున్న పోరాటాలు, విపరీతంగా జరుగుతున్న దాడులను సమర్థవంతంగా ఎదుర్కొంటూ సిపిఎం వామపక్షాలు, ఇతర లౌకిక మిత్రులు అందరూ కలిసి ప్రజా ప్రయోజనాలను మరింత ముందుకు తీసుకెళ్ళడాన్ని కొనసాగిస్తారు. తృణమూల్ పాలనపై పోరు సల్పుతారు. అత్యంత అధ్వాన్న ప్రత్యామ్నాయమైన బిజెపిని కూడా వారు కృత నిశ్చయంతో వ్యతిరేకిస్తారు.

బిజెపి విషపూరిత, ప్రజాస్వామ్య వ్యతిరేక దాడులను ఎదుర్కొనడానికి ప్రతిపక్ష పార్టీలన్నీ సమాయత్తమవుతున్న వేళ...బెంగాల్లో టిఎంసి విషపూరితమైన ప్రజాస్వామ్య వ్యతిరేక దాడులు...ప్రజాస్వామ్య పరిరక్షణకు పాటు పడుతున్నట్టు పోజు పెట్టేందుకు బిజెపికి అవకాశమిస్తున్నాయి. తద్వారా ప్రతిపక్షాల ఐక్యతకు తృణమూల్ తీవ్ర హాని కలిగిస్తున్నది.


/ 'పీపుల్స్ డెమోక్రసీ' సంపాదకీయం/

ఉద్యోగుల సమస్యలన్నింటికీ సానుకూల పరిష్కారం

- కాంట్రాక్టు ఉద్యోగుల రెగ్యులరైజేషన్ ప్రక్రియ వేగవంతం
- ఉద్యోగుల ఆరోగ్యపథకంపై త్వరలో స్టీరింగ్ కమిటీ
- జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ సమావేశంలో సిఎస్ జవహర్ రెడ్డి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలోని ప్రభుత్వ ఉద్యోగులకు సంబంధించిన 461 డిమాండ్లలో ఇప్పటికే 341 డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించిందని, పరిశీలనలో ఉన్న మిగతా డిమాండ్లను కూడా సాధ్యమైనంత తొందరలో పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కెఎస్ జవహర్ రెడ్డి తెలిపారు. గురువారం వెలగపూడి రాష్ట్ర సచివాలయంలో ఆంధ్రప్రదేశ్ సివిల్ సర్వీసెస్ జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో జవహర్‌రెడ్డి మాట్లాడుతూ సంబంధిత శాఖల స్థాయిలో ఉద్యోగ సంఘాలతో సమావేశాలు నిర్వహించి పరిష్కరించాలనే ఆదేశాలను దాదాపు అన్ని శాఖలు అమలు చేశాయని తెలిపారు. కరోనాతో మరణించిన ఉద్యోగుల స్థానే వారి కుటుంబ సభ్యులకు కారుణ్య నియామకాల్లో 1042 ఉద్యోగాలు ఇవ్వాలని ప్రభుత్వం ఇప్పటికే నిర్ణయించిందని తెలిపారు. కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్దీకరణకు ప్రభుత్వం ఇప్పటికే ఆదేశాలు జారీ చేసిందని, ఆ ప్రక్రియ వేగవంతానికి చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఉద్యోగుల వేతన సవరణ సంబంధించిన మాజీ ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి మన్మోహన్ సింగ్ నేతృత్వంలో 12వ పిఆర్‌సి కమిటీని నియమించిందన్నారు. సమావేశంలో ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు కె ప్రవీణ్ కుమార్, అజయ్ జైన్, బి రాజశేఖర్, ఎంటి కృష్ణబాబు, గోపాలకృష్ణ ద్వివేది, ముఖ్య కార్యదర్శులు చిరంజీవి చౌదరి, జయలక్ష్మి, శశిభూషణ్ కుమార్, ప్రవీణ్ ప్రకాష్, శ్యామల రావు, ఆర్‌టిసి ఎమ్‌డి ద్వారకా తిరుమల రావు, ప్రభుత్వ సలహాదారు ఉద్యోగుల సంక్షేమం చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఉద్యోగ సంఘాల నుంచి రాష్ట్ర సచివాలయ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు వెంకట్రామిరెడ్డి, ఎపి ఎన్‌జిఒ సంఘం అధ్యక్షులు బండి శ్రీనివాసరావు, ఎపి రెవెన్యూ సర్వీసెస్ అధ్యక్షులు బొప్పరాజు వెంకటేశ్వర్లు, ఎపి యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు ఎన్ వెంకటేశ్వర్లు, కెఎస్ఎస్ ప్రసాద్, ఎపి ఎస్‌టియు అధ్యక్షులు సాయి శ్రీనివాస్, పిఆర్‌టియు అధ్యక్షులు ఎం కృష్ణయ్య, ఎస్ వెంకటేశ్వర్లు, ప్రభుత్వ డ్రైవర్ల సంఘం అధ్యక్షులు ఎస్ శ్రీనివాసరావు, ఎపిటిఎఫ్ అధ్యక్షులు జి హృదయరాజు, ఎపిజిఇఎ జనరల్ సెక్రటరీ జి ఆస్కార్ రావు, ఆల్ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ నాల్గవ తరగతి ఉద్యోగుల సెంట్రల్ అసోసియేషన్ అధ్యక్షులు ఎస్ గోపాలకృష్ణ, ఎస్ మల్లేశ్వరరావు, ఎపి ఉపాధ్యాయ సంఘం అధ్యక్షులు సిహెచ్ శ్రావణ్ కుమార్, ఎపి వ్యవసాయ విస్తరణ అధికారుల సంఘం అధ్యక్షులు వేణుమాధవ రావు, ఎపి ఎకనమిక్స్ అండ్ స్టాటిస్టికల్ సబార్డినేట్ సంఘం అధ్యక్షులు రజనీస్ బాబు తదితరులు పాల్గొన్నారు.



జవహర్ రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్ వెంకటేశ్వర్లు

పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలి : యుటిఎఫ్

రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న జిపిఎస్ విధానాన్ని అంగీకరించబోమని, పాతపెన్షన్ విధానాన్ని అమలు చేయాలని ఎపి యుటిఎఫ్ డిమాండ్ చేసింది. ఈ మేరకు జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ సమావేశం సందర్భంగా యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు ఎన్ వెంకటేశ్వర్లు, కెఎస్ఎస్ ప్రసాద్ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కెఎస్ జవహర్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. సిపిఎస్ రద్దు పోరాటం సందర్భంగా ఉద్యోగులు, ఉపాధ్యాయులపై పోలీసులు నమోదు చేసిన కేసులను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు.

సీమ ప్రాజెక్టుల పేరుతో భారీ దోపిడీ

టిడిపి ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాయలసీమ ఇరిగేషన్ ప్రాజెక్టుల పేరుతో రాష్ట్రప్రభుత్వంలో భారీ దోపిడీ జరిగిందని టిడిపి ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్ విమర్శించారు. రాయలసీమ కరువు నివారణ కార్పొరేషన్ పేరుతో నిధులు తెచ్చి నేరుగా ప్రైవేట్ కంపెనీల ఖాతాల్లోకి రుణాలు మళ్లించారని అన్నారు. విజయవాడలోని తన నివాసంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. సుమారు రూ.900 కోట్లు నిధులు దారి మళ్లాయని, ఏ రాష్ట్రంలో జరగని విధంగా నిధుల దోపిడీ జరిగిందన్నారు. దీనిపై సిబిఐ విచారణ జరపాల్సిన అవసరం ఉందని డిమాండ్ చేశారు. ఎలక్ట్రో మెకానికల్ వర్క్స్ నిమిత్తం తీసుకున్న రుణం ఏమైందో ప్రజలకు తెలపాలని పేర్కొన్నారు. లిఫ్ట్ ఇరిగేషన్ పనుల కోసం రూ.3 వేల కోట్ల అప్పు తెచ్చారని విమర్శించారు. పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్ ద్వారా ప్రభుత్వం అప్పులు తెచ్చిందని పేర్కొన్నారు. వైఎస్ఆర్ పంటలబీమా వైసిపి వారి కోసమే అని మాజీ మంత్రి కాల్వ శ్రీనివాసులు అన్నారు. టిడిపి కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అర్హులైన రైతులకు సిఎం జగన్ అన్యాయం చేస్తున్నారని విమర్శించారు. పంటలు వేయకపోయినా వైసిపి నేతలకు పంటల బీమా పరిహారం ఇస్తున్నారని, పంటలు వేసి నష్టపోయిన రైతులకు అన్యాయం చేస్తున్నారని పేర్కొన్నారు.

టిడిపి అధికారంలోకి వస్తే వాలంటీర్ వ్యవస్థను రద్దు చేయబోమని ఆ పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు వర్ల రామయ్య మరో సమావేశంలో తెలిపారు. మెరుగైన రీతిలో వారి వృత్తి ప్రమాణాలు పెంచుతామన్నారు.



పేదలకు మేలు చేస్తున్నామనే నెపంతో జగన్ సర్కార్ కొత్త దోపిడీకి తెరలేపిందని టిడిపి అధికార ప్రతినిధి కొమ్మారెడ్డి పట్టాభిరామ్ అన్నారు. పివోటి చట్టాన్ని సవరిస్తే 600 ఎకరాలకు పైగా ఒక నేతకే లబ్ధి జరుగుతుందని ఆరోపించారు. వైసిపి భూ బకాసురులకు జగన్ తియ్యని కబురు చెప్పారని పేర్కొన్నారు. దళితుల్ని కిరాతకంగా చంపి, వారిని దూషిస్తున్న వారికి సిఎం అండగా నిలవడం దళితజాతిని అవమానించడం కాదా అని టిడిపి అధికార ప్రతినిధి మహాసేన రాజేష్ అన్నారు.

చంద్రబాబుపై సిఐడి కేసు విచారణ వాయిదా

ప్రజాశక్తి-అమరావతి

రాజధాని అమరావతి ఎసైన్డ్ భూములను కొనుగోలు చేశారంటూ మాజీ ముఖ్యమంత్రి, తెలుగుదేశం నాయకులు నారా చంద్రబాబునాయుడు, మాజీ మంత్రి నారాయణలపై సిఐడి నమోదు చేసిన కేసును కొట్టేయాలంటూ దాఖలైన పిటిషన్ల విచారణ ఈనెల 20కి వాయిదా పడింది. ఈ మేరకు జస్టిస్ విఆర్‌కె కృపాసాగర్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. మంగళగిరి వైసిపి ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి దాఖలు చేసిన ఫిర్యాదు ఆధారంగా సిఐడి వారిద్దరిపై కేసు నమోదు చేసింది. సిఐడి కేసులపై హైకోర్టు గతంలోనే తదుపరి చర్యలను నిలిపివేస్తూ మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చిన విషయం విధితమే.

నిమ్మగడ్డ ఓటు నమోదు దరఖాస్తు తీసుకోండి

తన ఓటు నమోదుకు చీఫ్ ఎలక్టోరల్ అధికారి తిరస్కరించారని పేర్కొంటూ రాష్ట్ర ఎన్నికల సంఘం మాజీ కమిషనర్ నిమ్మగడ్డ రమేష్‌కుమార్ హైకోర్టును ఆశ్రయించారు. గుంటూరు జిల్లా దుగ్గిరాలలో ఓటరుగా నమోదు చేసేలా ఉత్తర్వులు ఇవ్వాలని కోరారు. ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారికి తగిన పత్రాలు ఇవ్వాలని, ఆ దరఖాస్తుపై అధికారి చట్ట ప్రకారం తిగిన చర్యలు తీసుకోవాలని జస్టిస్ మానవేంద్రనాద్‌రాయ్ గురువారం తీర్పు చెప్పారు. తన స్వగ్రామంలో ఓటును హైదరాబాద్ బదిలీ చేసుకున్నట్లు, రిటైర్ అయ్యాక తిరిగి దుగ్గిరాలలో నమోదుకు దరఖాస్తు చేసుకుంటే అధికారి తిరస్కరించారని పిటిషనర్ హైకోర్టుకు తెలిపారు.

ధార్మిక పరిషత్‌పై రిట్ విచారణ వాయిదా

ధార్మిక పరిషత్ ఏర్పాటు చట్టానికి రాష్ట్రపతి ఆమోదం చెప్పనందున ఆ చట్టాన్ని రద్దు చేయాలని దాఖలైన పిటిషన్‌ను జస్టిస్ దుర్గాప్రసాదరావు, జస్టిస్ వెంటక జ్యోతిర్మయిలతో కూడిన డివిజన్ బెంచ్ గురువారం విచారించింది. కౌంటర్ దాఖలు చేయాలని దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి, ధార్మిక పరిషత్ మెంబర్ సెక్రటరీ, దేవాలయ కమిషనర్లకు నోటీసులు ఇచ్చింది. స్వామి హతీరాం మఠం పూర్వపు మహంత్ అర్జున్ దాస్ దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణను 3 వారాలకు వాయిదా వేసింది.

మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వలేం

గుంటూరు జిల్లా పెదకాకానిలోని గంగా భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి ఆలయ పాలక మండలి ఏర్పాటు జీవో అమలును నిలిపివేస్తూ మధ్యంతర ఉత్తర్వుల జారీకి హైకోర్టు నిరాకరించింది. పొన్నూరు ఎమ్మెల్యే కె.రోశయ్య, ఆలయ కమిటీ చైర్మన్ అమ్మిశెట్టి శివశంకరరావు, సభ్యులు, ఇతర ప్రతివాదులకు నోటీసులు ఇచ్చింది. విచారణను వచ్చే నెల 7కి వాయిదా వేస్తూ జస్టిస్ సుబ్బారెడ్డి గురువారం ఆదేశాలిచ్చారు. గత నెల 27న జారీ చేసిన జీవో 700 ప్రకారం పాలక మండలి ఏర్పాటు చేయరాదంటూ రాజారావు ఇతరులు వేసిన పిటిషన్‌లో అనుబంధ పిటిషన్‌ను కొట్టేసింది.

మార్గదర్శి చందాదారుల కేసు విచారణ

మార్గదర్శి చిట్‌ఫండ్స్ ప్రైవేట్ లిమిటెడ్‌కు చెందిన చిట్ గ్రూపుల మూసివేతను సవాల్ చేస్తూ చందాదారులు దాఖలు చేసిన పిటిషన్లపై గురువారం హైకోర్టులో వాదనలు కొనసాగాయి. చిట్ గ్రూపు చందాదారులు దాఖలు చేసిన పిటిషన్లపై విచారణను ఈ నెల 17కి వాయిదా వేస్తూ జస్టిస్ నైనాల జయసూర్య గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. చందాదారులనుంచి ఫిర్యాదు లేకపోయినా అధికారులు చిట్ గ్రూప్‌లను మూసేయడం అన్యాయమని పిటిషనర్ న్యాయవాది వాదించారు. చందారుల ప్రయోజనాలను కాపాడేందుకే చిట్ గ్రూప్‌లను మూసేయాల్సివచ్చిందని అనంతపురం, గుంటూరు, పల్నాడు జిల్లాల రిట్‌రిజిస్ట్రార్లు గత నెల 20న ఉత్తర్వులు ఇచ్చారు. వీటిని పిటిషనర్లు సవాల్ చేశారు.



ఫైనల్‌కు జబీర్, వోండ్రోసోవా

నేడు పురుషుల సింగిల్స్ సెమీఫైనల్స్.. వింబుల్డన్ గ్రాండ్‌స్లామ్

లండన్: వింబుల్డన్ మహిళల సింగిల్స్ ఫైనల్లోకి 6వ సీడ్ ట్యునీషియాకు చెందిన ఓన్స్ జబీర్ ప్రవేశించింది. గురువారం సెంటర్ కోర్టులో జరిగిన సెమీస్‌లో జబీర్ 6-7(5-7), 6-4, 6-3తో 2వ సీడ్ సబలెంకాపై సంచలన విజయం సాధించింది. తొలి సెట్‌ను టై బ్రేక్‌లో కోల్పోయిన జబీర్.. రెండో సెటన్‌ను పోరాడి చేజిక్కించుకుంది. ఇక నిర్ణయాత్మక మూడో సెట్‌లోనూ ఓ దశలో 5-1 ఆధిక్యతలో నిలిచి చివరకు ఆ సెట్‌ను 6-3తో గెలిచి ఊపిరి పీల్చుకుంది. గత ఏడాది వింబుల్డన్ గ్రాండ్‌స్లామ్ ఫైనల్‌కు చేరి నయా చరిత్ర సృష్టించిన జబీర్.. శనివారం జరిగే ఫైనల్లో అన్‌సీడెడ్ వోండ్రోసోవాతో టైటిల్‌కై తలపడనుంది. టైటిల్ గెలిస్తే.. ట్యునీషియా తరఫున ఓ గ్రాండ్‌స్లామ్ టైటిల్ నెగ్గిన తొలి క్రీడాకారిణిగా రికార్డు నెలకొల్పనుంది.

వోండ్రోసోవా తొలిసారి..

2019 ఫ్రెంచ్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ రన్నరప్, చెక్ రిపబ్లిక్‌కు చెందిన మార్కెటా వోండ్రోసోవా కెరీర్‌లో తొలిసారి వింబుల్డన్ గ్రాండ్‌స్లామ్ ఫైనల్లోకి దూసుకెళ్లింది. వింబుల్డన్ గ్రాండ్‌స్లామ్‌ల్లో ఏనాడూ ఏనాడూ 2వ రౌండ్‌ను దాటని అన్‌సీడెడ్ క్రీడాకారిణి అయిన వోండ్రోసోవా గురువారం జరిగిన మహిళల సింగిల్స్ తొలి సెమీఫైనల్లో ఎలేనా స్విటోలీనాను షాక్ ఇచ్చింది. ప్రపంచ ర్యాంకింగ్స్‌లో వోండ్రోసోవా 42వ ర్యాంక్‌లో ఉండగా.. స్విటోలినాది 76వ ర్యాంక్. గురువారం జరిగిన తొలి సెమీస్‌లో వోండ్రోసోవా 6-3, 6-3తేడాతో స్విటోలినాపై వరుససెట్లలో గెలుపొందింది. ఫైనల్‌కు చేరే క్రమంలో వోండ్రోసోవా క్వార్టర్స్‌లో 4వ సీడ్ పెగులా(అమెరికా), ప్రి క్వార్టర్స్‌లో 32వ సీడ్, తన దేశానికే చెందిన బోజ్కోవా, అంతకుముందు 20వ సీడ్ వేకిక్(క్రొయేషియా) వంటి సీడెడ్ క్రీడాకారిణులను ఓడించి ఫైనల్‌కు చేరింది. వింబుల్డన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీలో వోండ్రుసోవా ఫైనల్‌కు చేరడం ఇదే తొలిసారి.

సెమీస్‌లో ఓడిన బొప్పన్న జోడీ..

వింబుల్డన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీలో వెటరన్ రోహన్ బొప్పన్న పోరాటం ముగిసింది. సెమీస్‌కు చేరి ఆశలు రేపిన రోహన్ బొప్పన్న జోడీ గురువారం జరిగిన సెమీస్‌లో టాప్‌సీడ్ జోడీ చేతిలో ఓటమిపాలైంది. 6వ సీడ్ బరిలోకి దిగిన బొప్పన్న-ఎబ్డెన్ (ఆస్ట్రేలియా) జోడీ 5-7, 4-6తో టాప్‌సీడ్, కౌల్హాఫ్ (ఫ్రాన్స్)-స్కుప్కీ (బ్రిటన్) జోడీ చేతిలో వరుససెట్లలో ఓడింది.

నేడు పురుషుల సింగిల్స్ సెమీస్..
అల్కారాజ్(1) × మెద్వదెవ్(3)
జకోవిచ్(2) × సిన్నర్(8)

అప్పుల బాధతో కౌలు రైతు ఆత్మహత్య

ప్రజాశక్తి - బనగానపల్లె

నంద్యాల జిల్లా బనగానపల్లె మండలంలోని ఎర్రగుడి గ్రామానికి చెందిన కౌలు రైతు అప్పుల బాధ తాళలేక గురువారం ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై రామిరెడ్డి తెలిపిన వివరాల మేరకు.. కౌలు రైతు నట్టల మురళీకృష్ణ (40)కు ఐదెకరాలసొంత పొలముతో పాటు మరో 15 ఎకరాలను కౌలుకు తీసుకొని పంటలు సాగు చేశాడు. పంటల సాగు నిమిత్తం రూ. 15 లక్షల వరకు అప్పులు చేశాడు. పంటలు దిగుబడి సరిగా రాకపోవడం, గిట్టుబాటు ధర లేకపోవడంతో తీవ్రంగా నష్టపోయాడు. అప్పులు తీరే దారిలేక ఇంటిలో ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఆయనకు భార్య, కూతురు, కుమారుడు ఉన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

విఎస్ఎస్ భూమి అప్పగించాలని గిరిజనుల ధర్నా

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం (పార్వతీపురం మన్యం జిల్లా)

పార్వతీపురం మన్యం జిల్లా గుమ్మలక్ష్మీపురం మండలం ఎల్విన్‌పేట పంచాయతీ పరిధిలో జాతాపు కోటపాడు విఎస్ఎస్ భూమికి రక్షణ కల్పించి తమకు అప్పగించాలని గురువారం గిరిజన సంఘం ఆధ్వర్యంలో తహశీల్దార్ కార్యాలయం ఎదుట గిరిజనులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా గిరిజనులు మాట్లాడుతూ ఇతర గ్రామాల నుంచి విఎస్ఎస్ భూమిని ఆక్రమిస్తున్నారని తెలిపారు. ఆక్రమణకు గురవుతున్న భూమి జెకెపాడులో ఉన్న విఎస్ఎస్ ఉమ్మడి భూమి అని సర్వహక్కులు మాకు ఉన్నాయని తెలిపారు. ఇళ్ల స్థలాల పేరుతో ఇతర గ్రామాల నుంచి వచ్చి ఆక్రమిస్తున్న నేపథ్యంలో తగాదాలు జరుగుతున్నాయని చెప్పారు. విఎస్ఎస్ భూమి తమ పంచాయతీ పరిధిలో గిరిజనులకు అనేక అవసరాలకు ఉపయోగపడుతుందని తెలిపారు. ప్రతి ఏటా అటవీశాఖ నుండి జంగిల్ క్లియరెన్స్ ద్వారా లక్షలాది రూపాయలు ఖర్చు చేస్తున్నారని తెలిపారు. దీని ద్వారా తమకు లబ్ధి చేకూరుతుందన్నారు. ఈ విషయమై అటవీ శాఖ అధికారులకు తెలిపామని చెప్పారు. భూమికి హక్కుదారులు జెకెపాడు గ్రామస్తులేనని చెప్పారన్నారు. కార్యక్రమంలో ఎపి గిరిజన సంఘం జిల్లా గౌరవ అధ్యక్షులు మండంగి రమణ, రాష్ట్ర నాయకులు కోలక అవినాష్, మండల నాయకులు పువ్వల తిరుపతిరావు, సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.

'పోలవరం పోరుకేక' వలంటీర్లకు అభినందనలు

ప్రజాశక్తి-విఆర్.పురం

పోలవరం పోరుకేక పాదయాత్రలో పాల్గొన్న వలంటీర్ల అభినందన సభ గురువారం విశాఖలోని విఆర్.పురం మండల కేంద్రం రేఖపల్లి సిపిఎం కార్యాలయంలో జరిగింది. పోలవరం పోరుకేక పేరుతో ఎటపాక మండలం నెల్లిపాక నుండి విజయవాడ వరకు 15 రోజుల పాటు సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు నాయకత్వంలో పాదయాత్ర నిర్వహించిన విషయం విధితమే. ఈ పాదయాత్రలో విఆర్.పురం మండలం నుండి పాల్గొన్న వాలంటీర్లకు అభినందన సభ ఏర్పాటు చేయగా, వారంతా తమ అభిప్రాయాలను వెల్లడించారు. సభకు అధ్యక్షత వహించిన సిపిఎం మండల కార్యదర్శి సోయం చిన్నబాబు మాల్లాడుతూ పోరుకేక పాదయాత్ర సందర్భంగా ప్రజలు అనేక సమస్యలను సిపిఎం నాయకుల దృష్టికి తీసుకొచ్చారని తెలిపారు. ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలు ఎండగడుతూ గ్రామ గ్రామాన నిర్వాసితులు పాదయాత్ర బృందానికి ఎదురెళ్లి నీరాజనాలు పలికారని పేర్కొన్నారు. అనంతరం మండలం నుండి పాల్గొన్న 94 మంది వాలంటీర్లకు మెమోంటోలను సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పూనెం సత్యనారాయణ, మండల కార్యదర్శి సోయం చిన్నబాబు చేతుల మీదుగా అందజేశారు ఈ కార్యక్రమంలో రేఖపల్లి వార్డు మెంబర్ కట్టం లక్ష్మి, వెట్టి శ్రీను, తోడం అమరావతి, కూర జోగయ్య, పోడియం గంగరాజు, కొవ్వాసి లక్ష్మణ్, మడకం రాధ, వాలంటీర్లు బృందం పాల్గొన్నారు.

20 ఏళ్లలో అతిపెద్దదాడి

జెనిన్ శరణార్థుల శిబిరం సందర్శించిన అనంతరం మీడియాతో పాలస్తీనా అధ్యక్షులు



జెనిన్ : వెస్ట్‌బ్యాంక్‌లోని జెనిన్ శరణార్థుల శిబిరాన్ని పాలస్తీనా అధ్యక్షులు మహమూద్ అబ్బాస్ గురువారం సందర్శించారు. గతవారంలో ఈ శిబిరంపై ఇజ్రాయిల్ సైన్యం వినాశకర దాడికి పాల్పడిన సంగతి తెలిసిందే. ఈ దాడిలో 12 మంది పాలస్తీనీయులు మరణించగా, వేలాది మంది తమ ఇళ్లను విడిచిపెట్టి నిరాశ్రయులుగా మారాల్సి వచ్చింది. దాదాపు గత 20 ఏళ్లలో వెస్ట్‌బ్యాంక్‌లో ఇజ్రాయిల్ చేసిన అతి తీవ్ర దాడిగా దీనిని పేర్కొంటున్నారు. ఇజ్రాయిల్ తీవ్ర దాడి నేపథ్యంలో జెనిన్ శరణార్థుల శిబిరాన్ని పాలస్తీనా అధ్యక్షులు సందర్శించారు. ఈ శిబిరాన్ని పాలస్తీనా అధ్యక్షులు సందర్శించడం 2005 తరువాత ఇదే మొదటిసారి. జోర్డాన్ హెలికాప్టర్‌లో జెనిన్‌కు అబ్బాస్ చేరుకున్నారు. శ్మాశాన వాటికను సందర్శించి, గతవారం దాడిలో మరణించిన వారి సమాధుల వద్ద నివాళిఅర్పించారు. పోరాటం, దృఢత్వం, సవాళ్లకు జెనిన్ క్యాంప్ ఒక చిహ్నం అని అబ్బాస్ తెలిపారు. అలాగే శిబిరం పునర్నిర్మాణంను త్వరలోనే ప్రారంభిస్తామని హామీ ఇచ్చారు. వెస్ట్‌బ్యాంక్‌లో పాలస్తీనియన్ అథారిటీని బలోపేతం చేయడనికి చర్యలు తీసుకుంటామని ఇజ్రాయిల్ ప్రధానమంత్రి బెంజిమిన్ నెతన్యాహు ప్రకటన తరువాత అబ్బాస్ పర్యటన సాగింది. గత ఏడాది నుంచి వెస్ట్‌బ్యాంక్‌పై ఇజ్రాయిల్ సైన్యం రోజు వారీ దాడులు ప్రారంభించాయి. కేవలం ఈ ఏడాదిలో ఇప్పటి వరకూ 150 మందికి పైగా పాలస్తీనీయులు ఇజ్రాయిల్ సైన్యం దాడుల్లో మరణించారు.



కొల్‌కతాలో లెఫ్ట్‌ఫ్రంట్ ర్యాలీలో భారీగా పాల్గొన్న జనం

తృణమూల్ హింసాకాండకు నిరసనగా లెఫ్ట్‌ఫ్రంట్ భారీ ర్యాలీ

కొల్‌కతా : పశ్చిమ బెంగాల్ పంచాయతీ ఎన్నికల్లో భాగంగా భాంగోర్‌లో జరిగిన హింసాకాండాకు నిరసనగా గురువారం కొల్‌కతాలో లెఫ్ట్‌ఫ్రంట్ భారీ ర్యాలీ నిర్వహించింది. లెఫ్ట్‌ఫ్రంట్‌తో పాటు కాంగ్రెస్, ఐఎస్ఎఫ్ కూడా ఈ ర్యాలీకి పిలుపునిచ్చాయి. ఈ ర్యాలీలో వేలాది మంది పాల్గొన్నారు. టిఎంసి హింసాకాండకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ నెల 11న పంచాయతీ ఎన్నికల ఓట్ల లెక్కంపులో సాయంత్రం 8:30 గంటల సయమానికి భాంగోర్‌లో స్థానం నుంచి ఐఎస్ఎఫ్ (లెఫ్టఫ్రంట్ కూటమి) అభ్యర్థి జహనరా బిబి 1,700 ఓట్ల తేడాతో విజయం సాధించినట్లు వెల్లడయింది. ఆమె మద్దతుదారులు సంబరాలు కూడా ప్రారంభించారు. అయితే విజయ ధ్రువీకరణ కోసం కొద్ది సేపు వేచి ఉండాలని చెప్పిన బిడిఒ తరువాత టిఎంసి అభ్యర్థితో కుమ్మకయ్యారు. రాత్రి 12 గంటల సమయంలో టిఎంసి అభ్యర్థి విజయం సాధించినట్లు ప్రకటించారు. దీంతో ఆగ్రహం చెందిన ఐఎస్ఎఫ్ కార్యకర్తలు కౌంటింగ్ కేంద్రం వద్దే నిరసనగా దిగారు. వీరిపై టిఎంసి గూండాలు, పోలీసులు భౌతిక దాడికి దిగారు. ఈ దాడిలో ముగ్గురు ఐఎస్ఎఫ్ కార్యకర్తలు రాజౌల్ గాజి, హస్సన్ మోల్లాహ, రాజు మోల్లా అక్కడికక్కడిక్కడే తీవ్రగాయాలతో మరణించారు. ఈ తరువాత కూడా టిఎంసి హింసాకాండ ఆగలేదు. భంగోర్‌లో సుమారు 50 మందికి పైగా సిపిఎం, ఐఎస్ఎఫ్ కార్యకర్తల ఇళ్లు, ఆస్తులను ధ్వంసం చేశారు. ఈ హింసాకాండకు వ్యతిరేకంగా కొల్‌కతాలో గురువారం భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం సెంట్రల్ కమిటీ సభ్యులు, దక్షిణ 24 పరగణాల జిల్లా కార్యదర్శి షమిక్ లాహరి మాట్లాడుతూ భాంగోర్‌లో నామినేషన్ ప్రక్రియ ప్రారంభమైన దగ్గర నుంచి టిఎంసి హింసాకాండ ప్రారంభమైందని తెలిపారు. టిఎంసి గూండాల బెదిరింపులతో లెఫ్ట్‌ఫ్రంట్, ఐఎస్ఎఫ్ అభ్యర్థులు తమ నామినేషన్లను కూడా సమర్పించలేకపోయారని చెప్పారు. వామపక్ష అభ్యర్థులకు ఓట్లు వేస్తే తీవ్ర పరిమాణాలు ఉంటాయని ఓటర్లను కూడా హెచ్చరించారని తెలిపారు.

రాయితీ కందిపప్పుకు మంగళం

- **అరకొరగానే రేషన్ పంపిణీ**
- **సర్వర్ సమస్యలతో సతమతం**

ప్రజాశక్తి-కాకినాడ ప్రతినిధి

రేషన్ సరుకుల పంపిణీ అస్తవ్యస్తంగా మారింది. ప్రభుత్వం సరుకుల్లో కోత విధిస్తుండడంతో కేవలం బియ్యం, పంచదార మాత్రమే పంపిణీ చేస్తున్నారు. రాయితీ కందిపప్పు సరఫరా నిలిచిపోవడంతో లబ్ధిదారులు బయట మార్కెట్‌లో అధిక ధరకు కొనుగోలు చేసుకొంటున్నారు. మరోవైపు ఇంటింటికీ అని చెప్పి పంపిణీ ప్రారంభించినా ఎక్కడో వీధి చివరన మాత్రమే ఉంచి సరుకులను అందిస్తున్నారు. కాకినాడ జిల్లాలో 6,45,811 బియ్యం కార్డులుండగా 1,060 రేషన్ షాపుల పరిధిలో 420 ఎండియు వాహనాల ద్వారా నెలనెలా బియ్యం, కందిపప్పు, పంచదార పంపిణీ జరుగుతోంది.

కందిపప్పు లేదా ఏ..

జిల్లాలో ఉన్న లబ్ధిదారుల సంఖ్యకు అనుగుణంగా ఒక్కొక్కరికీ కిలో కందిపప్పు ఇస్తుండగా ఈ లెక్కన సుమారు 600 మెట్రిక్ టన్నులు అవసరం ఉంది. ఈ నెలలో ఒక్క కేజీ కందిపప్పు కూడా ఇవ్వలేదు. గత నెలలో సగం మందికి కూడా ఇవ్వలేకపోయారు. బయట మార్కెట్లో కందిపప్పు ధర కిలో రూ.150 పలుకుతోంది. రేషన్ షాపుల ద్వారా ఇచ్చే కందిపప్పు సరఫరా నిలిచిపోవడంతో పేద, మధ్యతరగతి వర్గాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికే నిత్యవసరాలు సరుకుల ధరలు విపరీతంగా పెరగడంతో ఆర్థిక కష్టాలు రెట్టింపు అయ్యాయని గగ్గోలు పెడుతున్నారు. బయట మార్కెట్లో సరుకులను కొనలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సర్వర్ సమస్యలతో సతమతం

ప్రతి నెలా ఒకటవ తేదీ నుంచి 17వ తేదీ లోపు ఇంటింటికీ రేషన్ పంపిణీని పూర్తి చేయాల్సి ఉంది. కానీ ఇప్పటి వరకు 40 శాతం కూడా పంపిణీ పూర్తి చేయలేదు. సాంకేతిక సమస్యలు, సర్వర్ స్లోగా ఉండడంతో ఎండియూ వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సరుకులు తీసుకునేందుకు లబ్ధిదారులు ఇప్పటివరకు ఒకసారి వేలిముద్ర వేస్తే సరిపోయేది. ఈ నెలలో రెండుసార్లు వేయాల్సి వస్తోంది. దీంతో సర్వర్ ఇబ్బందులు తప్పడం లేదు. కేంద్ర ప్రభుత్వం జాతీయ ఆహార భద్రత చట్టం క్రింద ఎస్‌సి, ఎస్‌టిలతో అంత్యోదయ కార్డుల లబ్ధిదారులకు ఉచిత బియ్యం అందజేస్తుంది. వీరంతా బియ్యానికి ఒకసారి పంచదారకు మరోసారి వేలిముద్రలు వేయాల్సి వస్తోంది. ఎండియు వాహనాల ద్వారా సరుకులు పంపిణీ జరుగుతుండగా ఇళ్ల వద్దకే సరుకులు అందజేయాల్సి ఉంది. అయితే వీధి చివరన ఆగిపోతుండడంతో లబ్ధిదారులు పరుగులు పెట్టాల్సి వస్తుంది. గతంలో సరుకులను ఆయా దుకాణాలకు వెళ్లి తెచ్చుకునే వారు. సమయం కుదిరిన ప్పుడల్లా వెళ్లి తీసుకునే అవకాశం ఉండేది.

తిరుపతిలో వరల్డ్‌క్లాస్ బస్టాండు నిర్మాణం

- **రూ.2,900 కోట్లతో జాతీయ రహదారులకు శంకుస్థాపన**
- **శ్రీవారిని దర్శించుకున్న కేంద్రమంతి గడ్కరీ**



జాతీయ రహదారుల నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న కేంద్ర మంత్రి గడ్కరీ

ప్రజాశక్తి-తిరుపతి సిటీ/ మదనపల్లె అర్బన్ (అన్నమయ్య జిల్లా)

తిరుపతిలో వరల్డ్‌క్లాస్ బస్‌స్టేషన్‌ను నిర్మించనున్నట్లు కేంద్ర రహదారుల శాఖ మంత్రి నితిన్‌గడ్కరీ అన్నారు. తిరుపతి సెంట్రల్ బస్టాండుకు రాబోవు రోజుల్లో రోజుకు నాలుగు వేల బస్సులు, రెండు లక్షల మంది యాత్రికులు రాకపోకలు సాగిస్తారని, దీన్ని దృష్టిలో ఉంచుకుని 30 ఎకరాల స్థలంలో రూ.500 కోట్లతో ఇంటర్‌నేషనల్ బస్‌స్టేషన్ నిర్మాణానికి చర్యలు చేపట్టామని తెలిపారు. తిరుపతి జిల్లాలో రూ.2,900 కోట్లతో నిర్మించనున్న జాతీయ రహదారులకు గురువారం గడ్కరీ శంకుస్థాపన చేశారు. అనంతరం తిరుపతి తారకరామ స్టేడియం (ఎస్‌వియు మైదానం)లో జరిగిన సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం మూడు మేజర్ పోర్టులను అభివృద్ధి చేస్తోందని తెలిపారు. దేశంలోనే విశాఖపట్టణం పోర్టు మేజర్ పోర్టని, దాని అభివృద్ధి జరుగుతోందన్నారు. వీటి అనుసంధానికి రూ.50 వేల కోట్లతో 191 ప్రాజెక్టుల ద్వారా 3244 కిలోమీటర్ల పొడవున రోడ్లు నిర్మిస్తున్నామని తెలిపారు. అంతకు ముందు కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ సతీసమేతంగా తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. అనంతరం తిరుపతిలోని శ్రీ పద్మావతి చిన్నపిల్లల హదయాలయ ఆస్పత్రిని సందర్శించారు. టిటిడి ఆధ్వర్యంలోని శ్రీ పద్మావతి చిన్నపిల్లల హదయాలయ ఆస్పత్రిలో అంతర్జాతీయస్థాయి ప్రమాణాలు ఉన్నాయని, ఇక్కడ నిరుపేద చిన్నారులకు ఉచితంగా గుండె మార్పిడి శస్త్రచికిత్సలు చేయడం అభినందనీయమని తెలిపారు.

ముంతాజ్ అలి సేవలు ఆదర్శనీయం : నితిన్ గడ్కరీ

నిరుపేద కుటుంబాలకు విద్య, వైద్యం అందించడంలో పద్మభూషణ్, సత్సంగ్ ఫౌండర్ శ్రీఎం (ముంతాజ్ అలి) ఆదర్శనీయమని నితిన్ గడ్కరీ అన్నారు. అన్నమయ్య జిల్లా మదనపల్లెలోని నక్కలదిన్నెలో సంస్థ ఆధ్వర్యంలో నిర్మించిన 50 పడకల మల్టీ స్పెషాలిటీ స్వస్థ్య ఆస్పత్రిని ఆయన గురువారం ప్రారంభించారు. ఆస్పత్రిలోని విభాగాలను సందర్శించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సత్సంగ్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు ముంతాజ్ అలి ఆధ్యాత్మికవేత్త మాత్రమే కాకుండా సంఘసంస్కర్త అని పేర్కొన్నారు. ముంతాజ్ అలి మాట్లాడుతూ మదనపల్లె పట్టణానికి తలమానికంగా, పేదలకు అందుబాటులో సత్సంగ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్వస్థ్య మల్టీ స్పెషాలిటీ ఆస్పటల్‌ను ప్రారంభించినట్లు తెలిపారు.

బిజెపి రాష్ట్ర అధ్యక్షులుగా బాధ్యతలు చేపట్టిన పురందేశ్వరి

ప్రజాశక్తి-విజయవాడ

బిజెపి రాష్ట్ర అధ్యక్షులుగా దగ్గుబాటి పురందేశ్వరి విజయవాడలోని పార్టీ కార్యాలయంలో గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడిన పురందేశ్వరి.. వైసిపి సర్కారు తీరును ఎండగట్టారు. "రాష్ట్రంలో పార్టీ బలోపేతానికి కషి చేస్తా. ఓట్లతో నిమిత్తం లేకుండా రాష్ట్రానికి బిజెపి సహకరిస్తోంది. కిసాన్ సమ్మాన్ నిధి కింద రైతులకు రూ.6 వేలు ఇస్తున్నాం. రైతు భరోసా కింద ఇచ్చే డిబిటిల్లో కేంద్ర నిధులే ఉన్నాయి. రైతులకు రూ.12,500 ఇస్తామన్న జగన్ హామీ ఏమైంది? పదో తరగతి బాలుడిపై పెట్రోల్ పోసి చంపేశారు. అధికార పార్టీ ఎంపి ఇంట్లో కిడ్నాపర్లు రెండు రోజులున్నారు. ఇళ్ల నిర్మాణానికి తొమ్మిదేళ్లలో రాష్ట్రానికి కేంద్రం రూ.20 వేల కోట్లు ఇచ్చింది. రాష్ట్రంలో ఇప్పటికే 65 శాతం ఇళ్ల నిర్మాణాలు పూర్తవ్వాలి. 35 శాతం కూడా పూర్తి కాలేదనేది వాస్తవం. ఈ విషయంలో పేదలకు వైసిపి ప్రభుత్వం ఏం సమాధానం చెబుతుంది? రాష్ట్రంలో రహదారుల దుస్థితేంటో ప్రజలను అడిగితే తెలుస్తుంది. రాష్ట్రంలో పెట్టుబడులకు ఎవరూ ముందుకు రాని పరిస్థితి ఏర్పడింది. ఉన్న పరిశ్రమలూ తరలిపోతున్నాయి" అని పురందేశ్వరి అన్నారు.



అదానీపై సా...గుతున్న సెబీ విచారణ

- గడువు పొడిగించినా వెలుగు చూడని వాస్తవాలు
- ప్రభుత్వ పెద్దల ప్రమేయముందన్న అనుమానాలు



న్యూఢిల్లీ : అదానీ గ్రూపు కంపెనీలలో అక్రమాలు, అవకతవకలు జరిగాయంటూ వచ్చిన ఆరోపణలపై సెబీ జరుపుతున్న విచారణ డెయిలీ సీరియల్ తరహాలో సా...గుతూనే ఉంది. సెబీ అభ్యర్థన మేరకు సుప్రీంకోర్టు విచారణ గడువును పెంచినప్పటికీ ఇప్పటికీ అతీగతీ లేదు. సెబీ తన విచారణను త్వరగా ముగించి, వాస్తవాలను బహిర్గతం చేయడం కేంద్రంలో అధికారంలో ఉన్న నరేంద్ర మోడీ ప్రభుత్వానికి సుతరామూ ఇష్టం లేదు. సెబీ విచారణలో వాస్తవాలు బయటపడితే మోడీ సర్కారు అప్రదిష్టపాలవుతుందని, రాబోయే లోక్‌సభ ఎన్నికలలో దాని ప్రభావం కచ్చితంగా ఉంటుందని ఆ పార్టీ నేతలు భయపడుతున్నారు. అందుకే ఢిల్లీ పెద్దల ఆదేశానుసారం విచారణను ఏదో ఒక సాకుతో సాగదీస్తున్నారు. సుప్రీంకోర్టు నియమించిన నిపుణుల కమిటీ సెబీ వైఖరిని తప్పుపట్టగా, ఆ సంస్థ మాత్రం తన వాదనను గుడ్డిగా సమర్థించుకుంటోంది.

2016 నుండి అదానీ గ్రూపుపై వచ్చిన పలు ఆరోపణల్లో నిజాలను నిగ్గు తేల్చేందుకు సెబీ విచారణ జరుపుతోంది. హిండెన్‌బర్గ్ ప్రస్తావించిన అవకతవకలను కూడా సెబీ విచారిస్తోంది. అయితే ఈ విచారణలో ఏం తేల్చారో ఇప్పటి వరకూ బహిర్గతం చేయలేదు. సెబీ ఇటీవల కోరలు తీసిన పాము చందంగా తయారైందని 'ది మార్నింగ్ కంటెస్ట్' అనే సంస్థ చేసిన వ్యాఖ్య ఈ సందర్భంగా గమనార్హం. మధ్యంతర ఆదేశాలు ఇవ్వడం, విచారణలను అసంపూర్తిగా ముగించడం వంటి పనులకే సెబీ పరిమితమవుతోందని ఆ సంస్థ తెలిపింది. అదానీ గ్రూపు కంపెనీలోకి పెట్టుబడులు ఎలా వచ్చాయన్న దానిపై జరిపిన విచారణలో సెబీ కొంత పురోగతి సాధించిందని నిపుణుల కమిటీ అభిప్రాయపడింది. అయితే పెట్టుబడులు పెట్టిన విదేశీ కంపెనీలకు చట్టాలలోని నిబంధనలు అండగా నిలుస్తున్నాయి. దీంతో వాస్తవాలు వెలుగు చూడడం లేదు. ముఖ్యంగా విదేశీ పెట్టుబడిదారులు (ఎఫ్‌పీఐలు) అదానీ గ్రూపులో మదుపు చేసిన పెట్టుబడులపై విచారణలో సెబీ ముందడుగు వేయలేకపోయిందని, దాని చేతులు కట్టేశారని నిపుణులు తేల్చేశారు. అయితే వారు వ్యక్తం చేసిన అభిప్రాయాలపై సెబీ తన స్పందనను తెలియజేస్తూ తనను తాను గట్టిగా సమర్థించుకుంది. కమిటీ అభిప్రాయాలతో విభేదించింది. ఎఫ్‌పీఐల యాజమాన్యపు హక్కులపై విచారణ జరపడంలో తన సామర్ధ్యాన్ని శంకించాల్సిన అవసరం లేదని సర్టిఫికెట్ ఇచ్చుకుంది.

సుప్రీంకోర్టుకు నిపుణుల కమిటీ 170 పేజీల నివేదికను అందించగా, సెబీ 40 పేజీల స్పందనను తెలియజేసింది. ఇక్కడ ఓ విషయాన్ని మరచిపోకూడదు. అదానీ-హిండెన్‌బర్గ్ కుంభకోణం దేశంలో రాజకీయ ప్రకంపనలు సృష్టించింది. లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో నరేంద్ర మోడీ ప్రభుత్వాన్ని అప్రదిష్టపాలు చేసింది. సెబీ తన విచారణను వేగవంతంగా పూర్తి చేసి, ప్రజలకు బహిర్గతం చేసి ఉంటే అది బీజేపీ రాజకీయ ప్రత్యర్థులకు ఆయుధమై ఉండేది. ఒకవేళ విచారణ మరింత ఎక్కువ కాలం జరిగితే సెబీ పనితీరు పైన, దాని వ్యవహారాలలో ప్రభుత్వ జోక్యం పైన ప్రశ్నలు ఎదురవుతాయి.

తెర వెనుక సూత్రధారులు ఎవరు?

నిపుణుల కమిటీ నివేదికపై సెబీ స్పందనలోని కొన్ని కీలక అంశాలను పరిశీలిస్తే... అదానీ గ్రూపులో 13 ఎఫ్‌పీఐలు (12 ఎఫ్‌పీఐలు మారిషస్‌లోనూ, ఒకటి సైప్రస్‌లోనూ రిజిస్టర్ అయ్యాయి) భారీగా పెట్టుబడులు పెట్టాయి. వాస్తవానికి ఈ ఎఫ్‌పీఐలకు అదానీ గ్రూపు యాజమాన్యంతో సంబంధాలు ఉన్నాయని, అవి ఆ గ్రూపుకు ప్రాక్సీలుగా వ్యవహరించాయని హిండెన్‌బర్గ్ ఆరోపించింది. ఒకవేళ ఎఫ్‌పీఐలు నిజంగానే ప్రాక్సీలుగా వ్యవహరిస్తే వారికి ఆ గ్రూపు కంపెనీలలో 75%కి పైగా వాటాలు ఉంటాయి. ఇది సెక్యూరిటీల చట్టాన్ని ఉల్లంఘించడమే అవుతుంది. గ్రూపులోని కంపెనీలకు, ఎఫ్‌పీఐలకు మధ్య జరిగిన లావాదేవీలను అదానీ గ్రూపు బహిర్గతం చేయలేదు. ఇది కూడా చట్ట ఉల్లంఘనే. ఎఫ్‌పీఐలు ప్రాక్సీలు అయితే వారు అదానీ గ్రూపు వాటాలలో పెట్టుబడులు పెట్టడం షేర్ మార్కెట్‌ను మోసగించడమే అవుతుంది. పైన తెలిపిన సందర్భాలలో చట్ట ఉల్లంఘన జరిగిందా లేదా అనేది తేల్చాల్సిన బాధ్యత సెబీదే. ఎఫ్‌పీఐ పెట్టుబడులలో అసలైన లబ్దిదారులు, తెర వెనుక సూత్రధారులు ఎవరో అది తెలుసుకోవాలి. అయితే ఆ విషయాన్ని సెబీ నిగ్గు తేల్చలేకపోయిందని నిపుణుల కమిటీ తేల్చింది.

కమిటీతో విభేదించిన సెబీ

తన విచారణలో పురోగతిని నిపుణుల కమిటీ సరిగా అర్థం చేసుకోలేదని సెబీ అంటోంది. కమిటీ చెబుతున్నట్లు తాను విచారణ ప్రక్రియను నీరుకార్చలేదని, వాస్తవానికి మరింత బలం చేకూర్చానని చెప్పుకుంది. ఎఫ్‌పీఐ పెట్టుబడులలో అసలైన యజమానులు ఎవరో వెల్లడించాల్సిన అవసరం లేదంటూ సెబీ నిబంధనావళిలో చేసిన సవరణ కారణంగానే ఈ ప్రక్రియ మొత్తం నీరుకారిందని నిపుణుల కమిటీ తెలిపింది. అయితే దీనితో సెబీ ఏకీభవించడం లేదు. సెబీ నిబంధనల్లో చేస్తున్న మార్పులు విచారణకు ప్రతిబంధకంగా మారాయని, వాటివల్ల వాస్తవాలు రాబట్టడం కష్టమవుతోందని కమిటీ తన నివేదికలో తెలిపింది. అయితే నిపుణుల కమిటీ వ్యక్తం చేసిన అభిప్రాయాలతో సెబీ ఏ దశలోనూ ఏకీభవించలేదు. అయితే సెబీ విశ్వసనీయతపై అనేక అనుమానాలు తలెత్తుతున్నాయి.

వాటాదారుల అనుమానాలు

హిండెన్‌బర్గ్ నివేదిక ఆరోపించిన విధంగా అదానీ గ్రూపు ఉల్లంఘనలకు, అవకతవకలకు పాల్పడినట్లు నేరం మోపవచ్చా లేదా అనేది తేల్చాలని సుప్రీంకోర్టు సెబీని ఆదేశించింది. ఇందుకు రెండు నెలల గడువు విధించింది. ఈ గడువు మేతో ముగిసింది. అయితే గడువును మరో ఆరు నెలలు పొడిగించాలని సెబీ కోరింది. కోర్టు మాత్రం మూడు నెలలు అంటే ఆగస్ట్ 14వ తేదీ వరకూ గడువు ఇచ్చింది. విచారణకు తీసుకుంటున్న సమయాన్ని కూడా నిపుణుల కమిటీ ప్రశ్నించింది. అయితే విచారణ సరిగా జరగాలంటే సమయం పడుతుందని సెబీ వాదించింది. సెబీ అభిప్రాయంపై వాటాదారులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. విచారణకు కాలపరిమితి విధించకూడదని సెబీ భావిస్తున్నట్లుగా ఉన్నదని వారు అంటున్నారు. భారతీయ సెక్యూరిటీల మార్కెట్ ప్రయోజనాలను, పెట్టుబడిదారుల ప్రయోజనాలను కాపాడాల్సిన బాధ్యతను సెబీ విస్మరిస్తోందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సెబీ ఇప్పటికే రెండు సార్లు గడువు పొడిగింపును కోరిందని గుర్తు చేస్తున్నారు. ఇందులో ఏదో మతలబు ఉందన్న అనుమానాలు కూడా వ్యక్తమవుతున్నాయి. సెబీ తన విచారణను ముగించి, ఆ నివేదికను బహిర్గతం చేస్తే అది లోక్‌సభ ఎన్నికలపై తప్పనిసరిగా ప్రభావం చూపుతుందనడంలో సందేహం లేదు.

విచారణలో భాగస్వాములు కావాల్సిందిగా సెబీ చేసిన అభ్యర్థనను ఈడీ, ప్రత్యక్ష పన్నుల కేంద్ర బోర్డు తోసిపుచ్చాయని తెలుస్తోంది. అంతర్జాతీయంగా సమాచారాన్ని సేకరించేందుకు అది చేస్తున్న ప్రయత్నాలు కూడా విఫలమయ్యాయి. ఒకవేళ ఎఫ్‌పీఐలకు సంబంధించి సెబీ వద్ద తగినంత సమాచారం ఉంటే అది ఎలా స్పందిస్తుందన్నది కూడా ప్రశ్నార్థకంగా ఉంది. అదానీ గ్రూపుపై వచ్చిన ఆరోపణలను విచారించేందుకు సంయుక్త పార్లమెంటరీ కమిటీని ఏర్పాటు చేయాలంటూ ప్రతిపక్షాలు చేసిన డిమాండ్‌ను మోడీ ప్రభుత్వం తోసిపుచ్చిన తర్వాత అనేక అనుమానాలు కలుగుతున్నాయి. హిండెన్‌బర్గ్ నివేదికపై సుప్రీంకోర్టులో జరుగుతున్న విచారణ చివరికి అదానీ గ్రూపుకు క్లీన్‌చిట్ ఇస్తుందా? ఏమో వేచి చూడాల్సిందే.

అటవీ చట్ట సవరణలో లోపాలు

- ఆమోదించొద్దని ఎంపీలకు మాజీ అధికారుల వినతి

న్యూఢిల్లీ : 1980వ సంవత్సరపు అటవీ చట్టంలో చేసిన సవరణలు తప్పుదోవ పట్టించేవిగా, లోపభూయిష్టంగా ఉన్నాయనీ, వాటిని ఆమోదించొద్దని వంద మందికి పైగా మాజీ సీనియర్ అధికారులు పార్లమెంట్ సభ్యులను కోరారు. అటవీ (సంరక్షణ) సవరణ బిల్లును మార్చిలో లోక్‌సభలో ప్రవేశపెట్టారు. ఆ తర్వాత దానిని పార్లమెంట్ సంయుక్త కమిటీకి నివేదించారు. గతవారం దానిని కమిటీ ఆమోదించింది. అయితే కమిటీలోని 31 మంది సభ్యుల్లో 18 మంది అధికార బీజేపీకి చెందిన వారే. దీంతో మందబలంతో అధికార పార్టీ దానికి ఆమోదముద్ర వేయించుకుంది. రాబోయే పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో ఈ బిల్లును ప్రవేశపెట్టే అవకాశం ఉంది. ఈ బిల్లు వ్యూహాత్మక, భద్రతా సంబంధమైన ప్రాజెక్టుల అమలును వేగవంతం చేస్తుందని, వాతావరణ లక్ష్యాలను సాధించడంలో దోహదపడుతుందని ప్రభుత్వం చెబుతున్నది. అయితే అటవీ భూములను వాణిజ్య అవసరాల కోసం ఉపయోగించుకోవడానికి ఈ బిల్లు ఉపకరిస్తుందని ప్రతిపక్షాలు, పర్యావరణ వేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

అంతర్జాతీయ సరిహద్దుల వెంబడి 100 కిలోమీటర్ల పరిధిలో ఉన్న అటవీ భూమిలో భద్రతా సంబంధమైన మౌలిక సదుపాయాలను కల్పించేందుకు ముందస్తు అనుమతులు తీసుకోవాల్సిన అవసరం లేదని ఈ సవరణ బిల్లు చెబుతున్నది. అయితే ఈశాన్య ప్రాంతం, హిమాలయ ప్రాంతంలోని అధిక భాగం పర్యావరణ పరంగా సున్నితమైనదని, ఆ ప్రాంతాలు పలు వన్యప్రాణులకు ఆవాసాలుగా ఉన్నాయని, ఈ సవరణ బిల్లు కారణంగా వాటి జీవనానికి భంగం కలుగుతుందని పర్యావరణవేత్తలు అభిప్రాయపడుతున్నారు. ఈ నేపథ్యంలో సవరణ బిల్లుపై ఆందోళన వ్యక్తంచేస్తూ 105 మంది మాజీ అధికారులు ఎంపీలకు లేఖలు రాశారు. అటవీ భూమిని ఇతర ప్రయోజనాల కోసం వినియోగించుకునే అవకాశాన్ని ఈ బిల్లు కల్పిస్తోందని వారు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం నిర్దేశించిన షరతులకు లోబడే అటవీ భూముల సర్వే జరుగుతుందని వారు గుర్తుచేశారు. ఫలితాన్ని ముందే నిర్ణయించుకొని చేసే సర్వేల వలన ప్రయోజనం ఏముంటుందని ప్రశ్నించారు. ఒకవేళ అడవిలో ఏవైనా ఖనిజాలు ఉన్నాయని తేలితే అక్కడ మైనింగ్‌కు అనుమతిస్తారా అని కూడా ప్రశ్నించారు. బిల్లును ప్రస్తుత రూపంలో ఆమోదించవద్దని వారు పార్లమెంట్ సభ్యులను కోరారు.

కేరళ ప్రభుత్వం మరో ఘనత

- పట్టణ ఉద్యోగ పథకంలో 41 లక్షల పనిదినాలు



తిరువనంతపురం : కేరళలోని వామపక్ష ప్రభుత్వం 2010లో చేపట్టిన అయ్యంకళి పట్టణ ఉపాధి హామీ పథకం (ఎయుఇజిఎస్) దిక్సూచిగా నిలిచింది. ఏడాదికి కనీసం వంద రోజుల పని కల్పించే ఉద్దేశంతో ప్రారంభించిన ఈ పథకంలో 2.79 లక్షల మంది లబ్దిదారులుగా నమోదయ్యారు. ఈ పథకం కింద 2022-23లో రూ.113.93 కోట్లు ఖర్చు చేసి 41.11 లక్షల పనిదినాలు కల్పించారు. పథకాన్ని ప్రారంభించిన తర్వాత ఇంత పెద్ద సంఖ్యలో పనిదినాలను కల్పించడం ఇదే మొదటిసారి. మొత్తం ప్రాజెక్టు వ్యయాన్ని రాష్ట్ర ప్రభుత్వమే భరిస్తోంది. ఈ ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికంలో పట్టణ స్థానిక సంస్థలకు ప్రభుత్వం రూ.24.4 కోట్లు మంజూరు చేసింది. ఈ పథకానికి బడ్జెట్‌లో రూ.150 కోట్లు కేటాయించారు. 11వ ప్రణాళికా కాలంలో (2007-11) కేరళ ప్రభుత్వం పట్టణ ఉపాధి హామీ పథకాన్ని చేపట్టింది. పట్టణ జనాభాకు ఉపాధి అవకాశాలు కల్పించే ఉద్దేశంతో ఈ పథకాన్ని ప్రారంభించారు. వారికి బలమైన, హక్కుతో కూడిన సామాజిక భద్రతను కల్పించడమే దీని ఉద్దేశం. పథకంలో ఏయే పనులు చేపట్టాలో స్థానిక సంస్థల వార్డు సభల్లో నిర్ణయిస్తారు. ఈ పథకంలో 'లైఫ్' మిషన్ కింద గృహ నిర్మాణాన్ని కూడా ప్రభుత్వం ఇటీవలే చేపట్టింది. దేశంలో ఇలాంటి కార్యక్రమాన్ని నిర్వహించడం ఇదే మొదటిసారి అని కేరళ మంత్రి ఎంబి రాజేష్ చెప్పారు. ఈ పథకం కింద దినసరి వేతనాన్ని కూడా పెంచుతున్నారు.

షోపియాన్‌లో తీవ్రవాద దాడి

- ముగ్గురు స్థానికేతరులకు గాయాలు

శ్రీనగర్ : 'అంతా బాగుంది' అంటూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం జమ్ముకాశ్మీర్ విషయంలో చేస్తున్న ప్రచారం ఒట్టి బూటకమని తేలిపోతోంది. తరచూ ఏదో రూపంలో అందాల కాశ్మీరం నెత్తురోడుతూనేవుంది. దక్షిణ కాశ్మీర్‌లోని షోపియాన్‌లో గురువారం సాయంత్రం తీవ్రవాదులు వలస కార్మికులపై దాడికి పాల్పడ్డారు. గగ్రాన్ ప్రాంతంలో పనిచేస్తున్న దినసరి కార్మికులను లక్ష్యంగా చేసుకొని ఇద్దరు సాయుధులు జరిపిన ఈ కాల్పుల్లో ముగ్గురు స్థానికేతర వలస కార్మికులు తీవ్రంగా గాయపడ్డారు. కాల్పులు జరిపిన సమయంలో ఆ ప్రాంతమంతా చీకటిగా ఉండటంతో దుండగులు అక్కడి నుంచి పరారయ్యైనట్లు సంబంధిత అధికారులు తెలిపారు. గాయపడినవారిని శ్రీనగర్‌లోని శ్రీమహారాజా హరిసింగ్ ఆసుపత్రికి తరలించారు. క్షతగాత్రులను అన్వాల్ ఠాకూర్, హీరేలాల్, పింటూ గా గుర్తించారు. పరారైన సాయుధులను పట్టుకునేందుకు గగ్రాన్ ప్రాంతంలో విస్తృతంగా తనిఖీలు చేపట్టినట్లు అధికారులు తెలిపారు.

మోడీ ప్రజా వ్యతిరేక విధానాలపై కార్మిక, కర్షక ఐక్య పోరాటం

- ఉద్యమ కార్యాచరణ కోసం ఆగస్టు 24న సంయుక్త సదస్సు
- కార్మిక సంఘాలు, ఎస్‌కెఎం ఉమ్మడి వేదిక నిర్ణయం

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నేతృత్వంలోని బిజెపి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఉమ్మడి పోరాటాలకు కేంద్ర కార్మిక సంఘాలు, సంయుక్త కిసాన్ మోర్చా ఉమ్మడి వేదిక సిద్ధమైంది. ఆగస్టు 24న న్యూఢిల్లీలో సంయుక్త సదస్సు నిర్వహించనున్నట్లు తెలిపింది. ఈ మేరకు కేంద్ర కార్మిక సంఘాల నేతలు, సంయుక్త కిసాన్ మోర్చా నేతలు సమావేశమై చర్చించారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఉమ్మడిగా పోరాడాలని ఈ సమావేశంలో నేతలు పునరుద్ఘాటించారు. కార్మిక, కర్షక సంఘాల వేదికలు చేపట్టే ఆందోళనలకు, పిలుపులకు పరస్పరం మద్దతు, సంఘీభావం తెలియజేసుకోవాలని, ఉమ్మడి కార్యాచరణతో మోడీ సర్కార్‌పై పోరు సాగించాలని సమావేశంలో నిర్ణయించారు.



ఇందులో భాగంగా ఆగస్టు 24న జరిగే ఉమ్మడి సదస్సులో భవిష్యత్తు ఉద్యమ కార్యాచరణను ప్రకటించాలని తీర్మానించారు. ఈ సమావేశంలో సిఐటియు ప్రధాన కార్యదర్శి తపన్ సేన్, ఎఐటియుసి ప్రధాన కార్యదర్శి అమర్జిత్ కౌర్, ఎఐకెఎస్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అశోక్ దావలే, విజూ కృష్ణన్, ఉపాధ్యక్షులు హన్నన్ మొల్లా, కార్మిక సంఘం నేత హర్భజన్ సింగ్, రైతు నేత సత్యవాన్ తదితరులు పాల్గొన్నారు.

బియ్యం, గోధుముల ధర తగ్గించిన ఎఫ్‌సిఐ

న్యూఢిల్లీ : బహిరంగ మార్కెట్ విక్రయ పథకం (ఇంటి అవసరాల కోసం) విక్రయించే బియ్యం, గోధుముల ధరలను భారత ఆహార సంస్థ (ఎఫ్‌సిఐ) స్వల్పంగా తగ్గించింది. ఈ పథకం కింద సరఫరా చేసే బియ్యం ధర ప్రస్తుతం కిలో రూ.34 ఉండగా దానిని రూ.31కి, గోధుముల ధర కిలో రూ.22.50 ఉండగా దానిని రూ.21.50కు తగ్గించినట్లు ఎఫ్‌సిఐ డిప్యూటీ జనరల్ మేనేజర్ మంజీవ్ కుమార్ గోయల్ గురువారం తెలిపారు. ఇంటి అవసరాల కోసం వినియోగదారులకు అమ్మకాలు సాగిస్తూ ఎఫ్‌సిఐ వద్ద రిజిష్టర్ చేసుకున్న బల్క్ వ్యాపారులకు మాత్రమే ఈ పథకం వర్తిస్తుంది.

కేరళలో కుల వివక్షను ప్రదర్శించిన మసీదు

- ఐఎంఎస్‌డి ఖండన
- ఇస్లాంలో కుల వివక్షకు చోటు లేదని స్పష్టీకరణ

న్యూఢిల్లీ : ఇస్లాం మతంలో కులానికి, కుల ప్రాతిపదిక వివక్షకు చోటు వుండరాదని ఇండియన్ ముస్లిమ్స్ ఫర్ సెక్యులర్ డెమోక్రసీ (ఐఎంఎస్‌డి) స్పష్టం చేసింది. కేరళలోని కొట్టాయం జిల్లాలో చంగనస్సేరిలోని చారిత్రక పుతూరప్పళి మసీదు కమిటీ నిర్ణయాన్ని, చర్యను తీవ్రంగా ఖండించింది. సర్వసభ్య సమావేశానికి దళిత ముస్లిం హాజరు కారాదంటూ మసీదు కమిటీ నిషేధించింది. ఆ వ్యక్తి పూర్వీకులు ఇటువంటి సమావేశాలు, సభల నుండి సాంప్రదాయంగా మినహాయించారని ఆ కమిటీ పేర్కొంది. అయితే మసీదు కమిటీ నిర్ణయంపై ఐఎంఎస్‌డి తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేసింది. దళిత్ పసమండా కలెక్టివ్ జస్టిస్ ప్రాజెక్ట్ (డిపిసిజెపి) కూడా ఈ చర్యను ఖండించింది. దళిత ముస్లింలకు సంఘీభావాన్ని ప్రదర్శించింది. కేరళ ప్రభుత్వం, పోలీసులు తక్షణమే ఇందుకు బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసింది. ప్రభుత్వం తగురీతిలో స్పందించని పక్షంలో న్యాయం కోరుతూ తాము ఉద్యమిస్తామని తెలిపింది. ఐఎంఎస్‌డి కూడా శాంతియుత నిరసనలకు మద్దతిచ్చింది. ముస్లింల్లో అణచివేతకు గురయ్యే ఒసాన్ కమ్యూనిటీకి చెందిన ముస్లిం యువకుడి పట్ల మసీదు పాలక మండలి వివక్ష ప్రదర్శించింది. మహల్ కమిటీ జనరల్ మీటింగ్స్‌లో భవిష్యత్తులో పాల్గొనరాదంటూ జులై 3న అనీష్ సాలి (34)కి మసీదు కమిటీ నోటీసు జారీ చేసింది. ఇటువంటి సమావేశాలకు ఆయన పూర్వీకులను కూడా రాకుండా నిషేధించిన చట్టాలను ఉదహరించింది. పుతూరప్పళి ముస్లిం జమాత్ కార్యదర్శి ఎం.హెచ్‌ఎం.హనీఫా సంతకంతో ఈ నోటీసు వెలువడింది.

మరోసారి ఇటువంటి సంఘటన పునరావృతం కారాదంటూ అనీష్‌కు సూచించారు. కేరళలో ముస్లింల్లో క్షౌరవృత్తిదారులను, సున్తీ చేసేవారిని ఒసాన్ ముస్లింలుగా పిలుస్తారు. జుట్టు కత్తిరించడమనేది చాలా నీచమైన పనిగా అది చేసే వారిని తక్కువ స్థాయిలోని వారిగా కొందరు పెత్తందార్లు భావిస్తారు. ఒసాన్ ముస్లింలు నిజానికి ఇస్లామ్‌ను స్వీకరించడానికి ముందు హిందువుల్లో అట్టడుగున ఉండే దళితులు. హిందూమతంలో వివక్షను సహించలేక వీరంతా క్రమంగా ఇస్లాం వైపు వెళ్లారు.

ఉత్తరాది వరదలను జాతీయ విపత్తుగా ప్రకటించాలి

- ఎఐకెఎస్ డిమాండ్



న్యూఢిల్లీ : ప్రస్తుతం ఉత్తరాదిని ముంచెత్తుతున్న భారీ వర్షాలను, వరదల్నీ జాతీయ విపత్తుగా ప్రకటించాలని ఆల్ ఇండియా కిసాన్ సభ (ఎఐకెఎస్) డిమాండ్ చేసింది. బాధిత ప్రజలకు ఉపశమనం కలిగించడానికి అత్యంవసర చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు ఎఐకెఎస్ అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు అశోక్ దావలే, విజూ కృష్ణన్ ఒక ప్రకటన విడుదల చేశారు. భారీ వర్షాలు, వరదలతో కష్టాలు పడుతున్న ప్రజల పట్ల తీవ్రమైన ఆందోళన, సానుభూతిని ఎఐకెఎస్ వ్యక్తం చేసింది. ఉత్తరభారతంలోని హిమాచల్ ప్రదేశ్, జమ్ముకాశ్మీర్, ఉత్తరాఖండ్, పంజాబ్, హర్యానా, ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్‌తో పాటు ఈశాన్యంలోని అస్సాం, దక్షిణాన కేరళ వంటి రాష్ట్రాలు భారీ వర్షాలు, వరదలతో ప్రభావితమయ్యాయని తెలిపింది. చాలా రాష్ట్రాల్లో పంటలు పూర్తిగా నాశనమయ్యాయని, రాష్ట్రాల్లో జరిగిన విధ్వంసం జాతీయ విపత్తు కంటే తక్కువ కాదని పేర్కొంది. నివేదికల ప్రకారం 100 మందికి పైగా మరణించారని, పశువులు, ఆస్థులు, వాహనాలు నీటిలో కొట్టుకుని పోయాయని, లక్షల ఎకరాల్లో పంటలు మునిగిపోయాయని తెలిపింది. ఎడతెరిపి లేని, కుండపోత వర్షాలు ఆకస్మిక వరదలు, కొండచరియలు విరగపడ్డం వంటి వాటికి కారణమయ్యాయని, రోడ్లు, వంతెలను ధ్వంసమయ్యాయని చెప్పింది. అనేక గ్రామాలు నీట మునగడంతో సాధారణ జీవితం స్తంభించిందని తెలిపింది. ఆప్తులను కోల్పోయిన వారి దు:ఖాన్ని పంచుకోవడంతో పాటు, పంటలు, ఆస్తులు కోల్పోయి నిరాశ్రయులైన వారందరికీ సంఘీభావాన్ని ఎఐకెఎస్ తెలియజేస్తుంది. వారికి పరిశుభ్రమైన తాగునీరు, ఆహారం, ప్రాధాన్యత ప్రాతిపదికన వైద్య సహాయం వంటి ఉపశమన చర్యలు అవసరమని తెలిపింది. యుద్ధ ప్రాతిపదికన తక్షణ సహాయక చర్యలు, బాధితులకు తగిన నష్ట పరిహారాన్ని ఎఐకెఎస్ డిమాండ్ చేసింది. అలాగే సహాయ చర్యల్లో పాలుపంచుకోవాలని తన విభాగాలు, కార్యకర్తలకు ఎఐకెఎస్ పిలుపునిచ్చింది.

గుజరాత్‌లో ఇద్దరు దళిత సోదరుల హత్య

గాంధీనగర్ : గుజరాత్‌లో పెత్తందారులు రెచ్చిపోయారు. భూ ఆక్రమణలను అడ్డుకున్న దళితులపై మూకదాడులకు పాల్పడ్డారు. ఈ దాడిలో ఇద్దరు దళిత సోదరులు హత్యకు గురయ్యారు. మరో 15 మంది గాయపడ్డారు. ఈ దారుణం సురేంద్రనగర్ జిల్లా చుడా తాలుకాలోని సమధియాలా గ్రామంలో బుధవారం సాయంత్రం జరిగింది. మృతుల్ని అజి పర్మార్ (60), మనోజ్ పర్మార్ (54)గా గుర్తించారు. ఈ ఘటనపై 21 మందిపై గురువారం ఉదయం పోలీసులు కేసు నమోదు చేశారు. వీరిలో ఆరుగురిని గుర్తించారు. మరో 15 మందిని గుర్తుతెలియని వ్యక్తులుగా పేర్కొన్నారు.

గ్వాంటనామో వద్ద అమెరికా అణుజలాంతర్గామి

- తీవ్రంగా ఖండించిన క్యూబా



పనామా : గ్వాంటనామో నౌకా స్థావరం వద్ద కొన్ని రోజుల పాటు అమెరికాకు చెందిన అణు జలాంతర్గామి తిష్టవేయడాన్ని క్యూబా ప్రభుత్వం తీవ్రంగా ఖండించింది. రెచ్చగొట్టేందుకే అమెరికా ఇలాంటి దుందుడుకు చర్యలకు పాల్పడుతోందని విమర్శించింది. ఈ నెల 5 నుంచి 8వ తేదీ వరకూ అమెరికా జలాంతర్గామని నౌకా స్థావరంలో ఉందని క్యూబా విదేశాంగ మంత్రిత్వ శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. నౌకాస్థావరంలోకి జలాంతర్గామి ప్రవేశాన్ని క్యూబా ప్రభుత్వం తిరస్కరిస్తుందని, ఇది అమెరికా రెచ్చగొట్టే చర్య అని, దీనివెనుకున్న రాజకీయ, వ్యూహాత్మక దురుద్దేశ్యాలు పూర్తిస్థాయిలో వెల్లడికావాల్సివుందని తెలిపింది.

క్యూబా ప్రజల అభీష్టానికి వ్యతిరేకంగా 121 ఏళ్లుగా గ్వాంటనామో బేలో అమెరికా దురాక్రమణ కొనసాగుతోందని తెలిపింది. ప్రస్తుత సమయంలో శాంతియుత ప్రాంతంలో నౌకా స్థావరం వద్ద అణు జలాంతర్గామి తిష్టవేసివుంచడానికి సైనిక కారణమేమిటని, ఏ కుతంతంత్రంలో అక్కడ అణ్వాయుధ జలాంతర్గామిని ఉంచాల్సివచ్చిందో అమెరికా చెప్పాలని క్యూబా నిలదీసింది. అమెరికా సైనిక జోక్యాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపింది. గ్వాంటనామోలో చట్ట విరుద్ధంగా ఆక్రమించిన భూభాగాన్ని తిరిగి ఇవ్వాలనే డిమాండ్‌ను పునరుద్ఘాటిస్తున్నట్లు క్యూబా స్పష్టం చేసింది.

ఫ్రాన్స్‌లో మోడీ

(మొదటి పేజీ తరువాయి)

హాజరుకానున్న సంగతి తెలిసిందే. శుక్రవారం జరిగే ఈ వేడుకల్లో ఫ్రాన్స్ అధ్యక్షులు ఎమ్మాన్యుల్ మాక్రాన్‌తో కలిసి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొంటారు. ఈ సందర్భంగా ఇరువురు నేతలూ ద్వైపాక్షిక చర్చలు జరపనున్నారు. ఫ్రాన్స్ నుంచి 26 రాఫెల్ జెట్‌లు, 3 స్కార్పియన్ జలాంతర్గాముల కొనుగోలు చేయాలని భారత్ ఇదివరకే నిర్ణయించింది. ఇందుకు సంబంధించిన ఒప్పందంపై సంతకాలు అనంతరం..మాక్రాన్, మోడీ సంయుక్త ప్రకటన చేసే వీలుంది.

రాఫెల్ జెట్లు, స్కార్పియన్ల కొనుగోలుకు డిఎసి ఆమోదం

మోడీ ఫ్రాన్స్ పర్యటన నేపథ్యంలో రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ నేతృత్వంలో సమావేశమైన డిఫెన్స్ అక్విజిషన్ కౌన్సిల్ (డిఎసి) 26 రాఫెల్ జెట్‌లు, మూడు స్కార్పియన్ జలాంతర్గాములు కొనుగోలు ప్రతిపాదనలను ఆమోదించిందని మంత్రిత్వ శాఖ వర్గాలు తెలిపాయి. 26 జెట్‌ల్లో నాలుగు శిక్షణా విమానాలుగా వుంటాయని ఆ వర్గాలు చెప్పాయి. కాంట్రాక్టుపై సంతకం చేసిన మూడేళ్ళ వ్యవధిలో విమానాలను అందచేయం ఆరంభమవుతుంది. అయితే వీటి ధరపై ఇంకా చర్చలు జరగాల్సి వున్నందున తుది ఒప్పందం కుదరడానికి దాదాపు ఒక సంవత్సరం పడుతుంది. భారత నావికాదళానికి అవసరమైన 26 రాఫెల్ జెట్‌లతో పాటూ వాటితో ముడిపడిన ఇతర అనుబంధ పరికరాలు, ఆయుధాలు, సిమ్యులేటర్, ఫ్రెంచి ప్రభుత్వం నుండి అందాల్సిన లాజిస్టిక్ సపోర్టు, సిబ్బంది శిక్షణ, విడిభాగాలు, అన్నింటినీ ఫ్రెంచి ప్రభుత్వం నుండి పొందడానికి డిఎసి ఆమోదం తెలిపిందని రక్షణ శాఖ వర్గాలు తెలిపాయి. ఇతర దేశాలు ఇటువంటి విమానాలను ఏ ధరకు అందిస్తున్నాయో వాటితో సరిపోల్చుకుని, సంబంధిత అంశాలన్నింటినీ పరిగణనలోకి తీసుకుని ఫ్రెంచి ప్రభుత్వంతో ధర, ఇతర అంశాలు చర్చిస్తారని ఆ వర్గాలు తెలిపాయి. చర్చల తర్వాత వీటి నిర్వహణ, మరమ్మత్తులకు సంబంధించిన కేంద్రాన్ని ఏర్పాటు చేయడం కూడా కాంట్రాక్ట్ ఒప్పందాల్లో చేరుస్తారని చెప్పాయి. దేశీయంగా రూపొందించిన విమాన వాహక నౌక ఐఎన్ఎస్ విక్రాంత్ కోసం ఈ రాఫెల్ జెట్‌లను భారత నావికాదళం సమకూర్చుకుంటోందని అధికారులు తెలిపారు. భారత వైమానిక దళానికి ఇప్పటికే 36 రాఫెల్ జెట్‌లను సమకూర్చారు.

ఢిల్లీ విలవిల

(మొదటి పేజీ తరువాయి)

ఆటంకాలు ఏర్పడ్డాయి. ఇప్పటికే కాశ్మీరీ గేట్, ఐటిఒ, మజ్ను కటిలా, లోహపూల్, మయూర్ విహార్, సరితా విహార్, సివిల్ లైన్స్ తోపాటుగా సిఎం అరవింద్ కేజ్రీవాల్ ఇల్లు కూడా వరద ప్రభావానికి గురైంది. ఎర్రకోట వెనుక ప్రాంతం వరదలకు గురైంది. ఇదే ప్రాంతలోనే ఉన్నటువంటి నిగంబోధ్ స్మశాన వాటికలో నీరు చేరడంతో దహన సంస్కారాలను నిలిపివేశారు. సమాయక బలగాలు యమునా నది ఘాట్ వద్ద ఇసుక బస్తాలను అడ్డుగా వేసి నగరంలోకి వరద నీరు ఉధృతంగా రాకుండా నియంత్రించే ప్రయత్నం చేస్తున్నారు. కాగా నార్త్ ఢిల్లీలోని మెట్కాఫ్ రోడ్ లోని సుశ్రుత ట్రామా సెంటర్ లోకి వరద నీరు వచ్చి చేరింది. అయితే ఆస్పత్రిలో 40 మంది రోగులు చికిత్స పొందుతున్నారు. వీరిలో ముగ్గురు వెంటిలేటర్ పై చికిత్స పొందుతున్నారు. వీరందరినీ మరో ఆసుపత్రికి తరలించారు.

ఎగువ నుంచి వస్తున్న వరద నీరే ముంచేస్తోంది..

ఎగువ నుంచి వరద నీటి వల్లే యమున ఉధృతంగా ప్రవహిస్తోంది. 45 ఏళ్ళ క్రితం 207.49 మీటర్ల నీటి మట్టం నమోదైంది. గురువారం ఈ రికార్డును అధికమించి నీటి మట్టం 208.82 మీటర్లకు చేరింది. యమునా నదిపై రెండు ప్రధాన బ్యారేజీలు ఉన్నాయి.. ఒకటి డెహ్రాడూన్లోని దప్పత్తర్లో, మరొకటి హిమాచల్ లో హత్నికుండ్ బ్యారేజి. యమునా నదిపై ఎలాంటి భారీ ప్రాజెక్టులు లేకపోవడంతో వరద నీటిని కిందకి విడిచిపెట్టడం వల్ల ఢిల్లీకి వరద పోటెత్తుతుంది. హత్నికుండ్ బ్యారేజీ నుంచి నీటిని నెమ్మదిగా విడుదల చేయాలని కోరుతూ ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రివాల్ కేంద్ర హెూం మంత్రి అమిత్ షాకు లేఖ రాసినప్పటికీ, ఎగువన భారీ వర్షాలు నమోదు కావడంతో కిందకు నీటిని వదులుతున్నారు. ఈ నేపథ్యంలో ఢిల్లీ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ అథారిటీ అత్యవసర సమావేశం నిర్వహించింది. విద్యా సంస్థలు, కార్యాలయాలకు సెలవులు ప్రకటించడంతో పాటు ప్రజలకు పలు సూచనలు చేసింది. మరోవైపు వరద కారణంగా వజీరాబాద్, చంద్రావాల్, ఓఖ్లా వాటర్ ట్రీట్ మెంట్ ప్లాంట్లను మూసివేశారు. దీంతో ఒకటి రెండు రోజుల పాటు ప్రజలకు నీటి కష్టాలు తప్పవు. వజీరాబాద్ వాటర్ ట్రీటిమెంట్ ప్లాంట్‌ను ఢిల్లీ సిఎం అరవింద్ కేజీవాల్ గురువారం సందర్శించారు. ఢిల్లీ వాసులకు 25 శాతం తాగునీటి సరఫరా తగ్గిందని, ఒకటి రెండు రోజులు నీటి కొరత ఉంటుందని, శుక్రవారం సాయంత్రం వరకు తాగు నీటి సరఫరా అందించేలా చర్యలు తీసుకుంటున్నామని ముఖ్యమంత్రి కేజ్రీవాల్ చెప్పారు. ఇంకా ఢిల్లీకి ప్రమాదం పొంచే ఉందన్నారు. యమునా నది తీర ప్రాంత ప్రజలు తక్షణమే ఇళ్లను ఖాళీ చేసి సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లాలని ఆయన విజ్ఞప్తి చేశారు.



బ్రిటన్‌లో సమ్మెల హోరు

- డాక్టర్ల అయిదు రోజుల సమ్మె ప్రారంభం
- సమ్మెకు సిద్ధమవుతున్న టీచర్లు
- అదే బాటలో సెక్యూరిటీ గార్డ్లు

లండన్: నయా ఉదారవాద విధానాల యుగంలో బ్రిటన్ సమ్మెలతో అట్టుడుకుతోంది. పెరుగుతున్న ధరలకనుగుణంగా 35 శాతం మేర వేతన పెంచాలని డిమాండ్ చేస్తూ డాక్టర్లు, టీచర్లు, ఎన్‌హెచ్‌ఎస్ వర్కర్లు, సెక్యూరిటీ గార్డులు ఇలా సమస్త రంగాలకు చెందిన కార్మికులు సమ్మెలు, ఆందోళనలకు దిగుతున్నారు. ఈ క్రమంలోనే జూనియర్ డాక్టర్లు అయిదు రోజుల సమ్మెకు గురువారం ఉపక్రమించారు. వేతన పెంపుదలపై వివాదం తలెత్తినప్పటి నుంచి జూనియర్ డాక్టర్లు చేస్తున్న సమ్మెల్లో ఇది నాల్గవది. టీచర్స్ ఈ వర్షాకాల సీజన్‌లోనే సమ్మెకు వెళ్లాలని తీర్మానించుకున్నారు. సెక్యూరిటీ గార్డులు ఇప్పటికే సమ్మెలో ఉన్నారు. డాక్టర్లు, టీచర్లు 35 శాతం వేతన పెంపుదలను కోరుతుంటే, ప్రభుత్వం 6 శాతం పెంచుతామని ఆరోగ్యశాఖ మంత్రి స్టీవ్ బర్క్లే ప్రతిపాదించారు. దీనిని వారు నిర్ద్వంద్వంగా తిరస్కరించారు. పెరిగిన ద్రవ్యోల్బణంతో నిజవేతనాలు పడిపోయాయి. 2008 నాటి స్థాయికి ప్రస్తుత వేతనాలు చేరాయని, ఈ లోటును భర్తీ చేయాలంటే 35 శాతం పెంపుదల తప్పనిసరి అని వైద్యులు, టీచర్లు, ఇతర ప్రభుత్వ రంగ సంస్థల ఉద్యోగులు తేల్చి చెప్పారు. ప్రధాని సునాక్ బ్రిటిష్ మెడికల్ అసోసియేషన్ సమావేశంలో మాట్లాడుతూ, డాక్టర్లు సమ్మె విరమించుకుంటే మంచిదని అన్నారు. బ్రిటన్ ప్రభుత్వ ఆసుపత్రుల్లో పనిచేస్తున్న వైద్యుల్లో సగం మంది దాకా జూనియర్ డాక్టర్లు ఉన్నారు.సర్జరీ విభాగంలో నాలుగో వంతు వీరే. మరో వైపు టీచర్ల సమ్మెకు ఓటింగ్ నిర్వహించగా అత్యధిక శాతం మంది దీనికి అనుకూలంగా ఓటు వేయడంతో త్వరలోనే వారు కూడా మరోసారి సమ్మెకు సిద్ధమవుతున్నారు.



మీకోసం

అల్లం, వెల్లుల్లి ముద్ద చేసేటప్పుడు కొద్దిగా నూనె వేస్తే పేస్టు మెత్తగా వస్తుంది. ఎక్కువ రోజులు నిల్వ ఉంటుంది.

జీవన సౌరభం

ఏమీ లేనప్పుడు ఓపిక, అన్నీ ఉన్నప్పుడు ప్రవర్తన.. మనిషి వ్యక్తిత్వాన్ని పెంచుతాయి.

టక్కరి నక్క



నక్క నిదురపోతున్నది
నిదురలోన కల కన్నది
చుట్టుపక్క జంతువుల
ఈసడింపు కలను వింది!.

టక్కరి నక్క అంది కుందేలొకటి
వంచించే నక్క అని నెమలి అన్నది
దొంగబుద్ధి కలది అని కాకి అన్నది
ఆ మాటలు విన్న నక్క మేలుకున్నది!

జంతువులన్నీ నన్ను
చులకననగా చూస్తున్నవి
పక్షులు కూడా నన్ను
గేలి చేయుచున్నవి

ఇకపై నే మారాలని
నిర్ణయము తీసుకుని
కొలనులోన స్నానమాడి
ముఖాన విభూది పెట్టి.

మెడను మాల ధరించింది
మంత్రమేమో జపించింది
మౌనముగా దీక్ష బూని
ఒక్కచోట కూర్చున్నది

నక్క దీక్ష కాంచినవి
మరో నటన అనుకున్నవి
జంతువులన్నీ చేరి
దొంగ దీక్ష చాలన్నవి !

నేనోమో మారానంటే
చూడరు మీరెవ్వరు
మంచితనం గుర్తించరు
మాటేమో నమ్మరు !

నను నమ్మని మీ కోసం
నేనెందుకు మారాలని
దగ్గరకొచ్చిన గువ్వను
చప్పున నోటను బట్టెను

చూశారా, నక్క మార్పు
ఒక్క రోజు ఆగలేదు
ఎవరో అంటే మాత్రం
దొంగ బుద్ధి దాగలేదు.

నక్క ఎప్పుడూ నక్కె
టక్కరిలో మార్పు రాదు
నటనలోన నేర్పరి
నమ్మేమా, పని సరి !


- కూచిమంచి నాగేంద్ర,
91821 27880.

నేను గీసిన బొమ్మ






పి. చంటి,
ఎంపిపిఎస్ చిల్లకల్లు,
జగ్గయ్యపేట,
ఎన్‌టిఆర్ జిల్లా.



సరిచేసి రాయండి

పిల్లలూ ఇక్కడ కొన్ని బొమ్మలు.. వాటికి ఎదురుగా కొన్ని అక్షరాలు ఇచ్చాం. వాటిని సరైన క్రమంలో రాస్తే ఆ బొమ్మలను ఏమని పిలుస్తామో వస్తుంది. ట్రై చేయండి మరి..



పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

పట్టణీకరణ నేపథ్యంలో మిద్దెతోటల పెంపకం ఒక మంచి వ్యాపకంగా మారుతోంది. తమ ఇళ్లపైనే రసాయనాలు లేని కూరగాయలు, ఆకుకూరలు, పండ్లు పండించుకోవటం ఇప్పుడు చాలా చోట్ల కనిపిస్తోంది. పెంపకందారులకు ఇది చక్కని వ్యాయామం, మంచి అభిరుచి అవుతుంది. నేడు చాలా పట్టణాలు, నగరాల్లో మిద్దెలపై సాగు బహు బాగుగా సాగుతోంది. విజయవాడలో మిద్దె సాగు ప్రోత్సాహానికి 'ఒన్ ఎర్త్.. ఒన్ లైఫ్' టెర్రాస్ గార్డెన్ గ్రూపుకృషి చేస్తోంది.

'ఇంటి'పంటతో ఆరోగ్యం



ఇంట్లో కిచెన్‌లో కూరగాయల వచ్చే వేస్ట్, ఎండిన ఆకులు, పశువుల ఎరువులను కంపోస్ట్‌గా వినియోగించటం ద్వారా మిద్దె సాగు నేడు ట్రెండింగ్‌గా మారింది. పట్టణీకరణ పచ్చని ప్రకృతిని మింగేస్తున్న క్రమంలో మళ్లీ ప్రకృతితో మమేకం కావడానికి మిద్దె తోటలు ఒక ప్రేరణగా నిలిచాయి. రాష్ట్రంలోని విజయవాడ, విశాఖపట్టణం, రాజమహేంద్రవరం, నెల్లూరు, ఒంగోలు, కాకినాడ, తిరుపతి వంటి పట్టణాల్లో కొందరు పర్యావరణ శ్రేయోభిలాషులు ఇలాంటి మిద్దెతోటలు (ఇంటి పంటలు) పండిస్తూ తమ కుటుంబ ఆరోగ్య పరిరక్షణకు పాటుపడుతున్నారు.

'ఒన్ ఎర్త్.. ఒన్ లైఫ్'తో ప్రేరణ

విజయవాడకు చెందిన ఏలూరి లీలాకుమారి, పెనుమత్స శ్యామ్‌ప్రసాద్, అరకపూడి సురేష్‌కుమార్, వెలగా విజయ్, పరుచూరి రవి ప్రకాష్ 'ఒన్ ఎర్త్..ఒన్ లైఫ్' పేరుతో టెర్రాస్ గార్డెన్ సంస్థను ఏర్పాటు చేశారు. వీరే అడ్మిన్లుగా ఉండి ఒక వాట్సాఫ్ గ్రూపు నిర్వహిస్తున్నారు. రెండు నెలల క్రితం ఐదుగురితో ప్రారంభమైన ఈ గ్రూపు ఇప్పుడు 500 మంది సభ్యులకు చేరుకుంది. సేంద్రియ ఎరువులను వినియోగించటం ద్వారా అతి తక్కువ ఖర్చుతో తమ మిద్దెలపై సాగు చేసిన విషయాలు, ఫొటోలు, వీడియోలను గ్రూపులో షేర్ చేస్తున్నారు. తద్వారా ప్రేరణ పొందిన మరికొందరు మిద్దె సాగును ఆచరిస్తూ తమ మిత్రులు, కుటుంబ సభ్యులు, శ్రేయోభిలాషులకు తెలియజేస్తున్నారు. తమ ఇంటి మిద్దెపై వంగ, బెండ, బీర, సొర, దోస, మిర్చి, పసుపు, పొట్లకాయలు, ఆకుకూరలు, పండ్లు సైతం పెంచేస్తున్నారు. వారానికి కనీసం నాలుగు రోజులైనా ఇంటి పంటతో కూరలు వండుకోవొచ్చని ఒన్ ఎర్త్.. ఒన్ లైఫ్ ప్రతినిధులు చెబుతున్నారు.



ప్రజారోగ్య పరిరక్షణకు అడుగులు

సొంత లాభం కొంతమానుకు... పొరుగు వారికి తోడు పడవోయ్ అన్న గురజాడ మాటలను ఆదర్శంగా తీసుకున్నారు 'ఒన్ ఎర్త్... ఒన్ లైఫ్' ప్రతినిధులు. పర్యావరణ పరిరక్షణ, ఇంధన సంరక్షణ, కాలుష్య నియంత్రణ లక్ష్యాలుగా ముందుకు సాగుతున్నారు. తమ ఇంటి అవసరాలకు సరిపడే ఆకుకూరలను, కూరగాయలను తమ మేడ మీదనే పండిస్తున్నారు. మొక్కలకు కావాల్సిన పోషకాలన్నింటినీ ప్రకతి ఎరువుల ద్వారానే అందిస్తున్నారు. అందరికీ ఆరోగ్యం అది ఇంటి నుండే సాధ్యం అని నిరూపిస్తున్నారు.


కాలుష్య రహిత సమాజానికి దోహదం



పర్యావరణ పరిరక్షణలో మిద్దె సాగుతో కూడా ఎంతో మేలు జరుగుతుంది. మిద్దె తోటలతో చెట్లు అంతరించిపోకుండా చూడొచ్చు. పక్షిజాతులను కాపాడొచ్చు. వాతావరణం పచ్చదనంతో ఆహ్లాదకరంగా, పక్షుల కిలకిలారావాలతో ఉల్లాసంగా వుంటుంది. కాలుష్యానికి దూరంగా, స్వచ్ఛమైన గాలికి దగ్గరగా జీవించొచ్చు.

- వెలగా విజయ్

జీవవైవిధ్యానికి దోహదం



మిద్దెతోటలు మళ్లీ మట్టితో అనుబంధాన్ని పెంచుతున్నాయి. పక్షులు, తేనెటీగలు, ఇతర పరాగ సంపర్కాలకు ఆవాసాలుగా మారడంతో పాటు జీవవైవిధ్యాన్ని ప్రోత్సహిస్తున్నాయి. ఈ పద్ధతిలో ఆకుకూరలు, కాయగూరలు, పూలు, పండ్లు సైతం పండించొచ్చు.

- అరకపూడి సురేష్‌కుమార్

ఆరోగ్యానికి పూదోట



కూరగాయలను మనమే సేంద్రియ పద్ధతిలో పండించుకుని తినడంలో ఎంతో సంతృప్తి ఉంది. రసాయనిక ఎరువుల వల్ల ఎదురయ్యే సమస్యల నుంచి కుటుంబ ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చు. వివిధ ప్రకృతి వైపరీత్యాలు, కృత్రిమ మార్కెట్ కొరత, విపపరీతమైన డిమాండ్ వంటి సందర్భాల్లో కూరగాయల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. ఇంట్లో సాగు చేయడం వల్ల ఆ భారం మనపై పడదు. మిద్దె తోటల వల్ల భవనాల పైకప్పు జీవిత కాలం కూడా పెరుగుతుంది. మిద్దెతోటల పెంపకంతో శరీరానికి మంచి వ్యాయామం కూడా దక్కుతుంది. ఆరోగ్యకరమైన ఈ వ్యాపకం వల్ల మనసు ప్రశాంతంగా ఉంటుంది.

- ఏలూరి లీలాకుమారి

కాలుష్యం నుంచి రక్షణ



మిద్దెతోటల సాగు ద్వారా వారంలో కనీసం నాలుగు రోజులైనా ఇంటి కూరలతో వంట చేసుకుని తినొచ్చు. తద్వారా మార్కెట్లోకి కల్తీ, అనారోగ్య పరిస్థితుల నుంచి కాపాడుకోవచ్చు. పూర్వకాలంలో మాదిరిగా కూరగాయలను ఇచ్చి పుచ్చుకుంటే ఇంటి కూరకూరలకు కొదవ ఉండదు. ఇంట్లో కూరగాయలు, ఇతర వేస్టు మెటీరియల్‌ను కంపోస్ట్ ఎరువుగా వినియోగిస్తే మొక్కలు ఏపుగా పెరిగి, మంచి దిగుబడిని ఇస్తాయి.

- పెనుమత్స శ్యామ్‌ప్రసాద్

ఇంటి పంటను నిల్వచేసుకోవచ్చు



మిద్దెతోటల సాగు ద్వారా వచ్చే ఆకుకూరలు, కూరగాయలు చాలారోజులు నిల్వవుంటాయి. అదే రసాయనాలు పిచికారీ చేసినవి అయితే, త్వరగా పాడైపోతాయి. వేస్ట్ మెటీరియల్‌ను కంపోస్ట్‌గా మార్చి ఎరువుగా వినియోగించటం ద్వారా చెత్త సమస్యలకు పరిష్కారం లభిస్తుంది. కార్పొరేషన్‌కు చెత్త సమస్యలు తగ్గుతాయి. గ్లోబల్ వార్మింగ్ సమస్యల నుంచి బయట పడటానికి ఇంటిపంట దోహదం చేస్తుంది..

- పరుచూరి రవిప్రకాష్

ఖర్చుతక్కువ... ఆరోగ్యం ఎక్కువ


బియ్యం బ్యాగులు, వాడేసిన పెయింట్ డబ్బాలు, వాటర్ బాటిళ్లు, పాడైన బకెట్లు, ప్లాస్టిక్ సంచులు, గ్రోబ్యాగులలో మొక్కలు సాగుచేస్తున్నారు. విత్తనాలకు తప్ప మరే దానికి పెద్దగా ఖర్చు పెట్టడంలేదంటున్నారు ఏలూరి లీలాకుమారి. మిద్దె తోటను సాగు చేయాలనుకునే వారు తొందరపడి అధికంగా ఖర్చు పెట్టి ఒకేసారి మొక్కలన్నింటిని పెంచడం కంటే మొదట తక్కువ ఖర్చుతో ఆకుకూరలతో సాగు ప్రారంభించి ఆ తరువాత మొక్కలపై అవగాహన పెంచుకుని నెమ్మదిగా సాగు విస్తీర్ణాన్ని పెంచాలని సూచిస్తున్నారు. మేడ మీద ఉన్న అతి తక్కువ స్థలాన్ని సద్వినియోగ పరుచుకుంటున్నారు ఆమె. తీగజాతి కూరగాయల సాగు కోసం పందిర్లను కూడా నిర్మించారు. కుండీల్లో స్థలం వథా కాకుండా అంతర పంటలను సైతం సాగు చేస్తున్నారు.

- యడవల్లి శ్రీనివాసరావు



నవ్వులు పూయించడం ఖాయం

చిరంజీవి హీరోగా మెహర్ రమేశ్ దర్శకత్వంలో రూపొందుతున్న 'భోళా శంకర్' చిత్రం షూటింగ్ పూర్తయి పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు జరుపుకుంటోంది. ఇప్పటికే చిరంజీవి, కీర్తి సురేశ్ డబ్బింగ్ పూర్తి చేశారు. తాజాగా బ్రహ్మానందం డబ్బింగ్ పూర్తి చేసినట్లు తెలుస్తోంది. ఈ విషయాన్ని దర్శకుడు మెహర్ రమేశ్ ట్విట్టర్ వేదికగా ఫొటోలు షేర్ చేసి చెప్పారు. 'హాస్య బ్రహ్మ డబ్బింగ్ పనులు పూర్తి చేశారు. ఇందులో ఆయన అతిథిగా కీలక పాత్ర పోషించారు. థియేటర్‌లో ఆయన నవ్వులు పూయించడం ఖాయం' అని మెహర్ పేర్కొన్నారు. ఎ.కె.ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై రాంబ్రహ్మం సుంకర నిర్మించిన ఈ చిత్రం ఆగస్టు 11న ప్రేక్షకుల ముందుకు రానుంది. తమన్నా కథానాయికగా నటించిన ఈ చిత్రంలో కీర్తి సురేశ్ చిరంజీవి చెల్లెలిగా కనిపించనున్నారు.



పతాక సన్నివేశాల్లో 'జవాన్'

బాలీవుడ్ స్టార్ షారుఖ్ ఖాన్ తాజాగా నటిస్తున్న చిత్రం 'జవాన్'. ఈ సినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. షారుక్ ఖాన్ ఫైటింగ్ సన్నివేశాలు చిత్రీకరణలో ఉన్నాయి. యాక్షన్ థ్రిల్లర్ జోనర్‌లో వస్తున్న ఈ చిత్రంలో షారుఖ్ ఖాన్ తండ్రీ కొడుకుగా డ్యూయల్ రోల్‌లో కనిపించనున్నారు. నయనతార ఇన్వెస్టిగేటివ్ ఆఫీసర్‌గా నటించనున్నట్టు సమాచారం. ఈ చిత్రంలో కోలీవుడ్ స్టార్ హీరో విజయ్ సేతుపతి, ప్రియమణి, సన్యా మల్హోత్రా, సునీల్ గ్రోవర్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. దీపికా పదుకొనే అతిథి పాత్రలో కన్పించనున్నారు. ఈ సినిమా సెప్టెంబర్ 7న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది.

సమంత 'సిటాడెల్' ముగించేశారు



సమంతా, వరుణ్ ధావన్ జంటగా నటిస్తున్న 'సిటాడెల్' వెబ్ సిరీస్ షూటింగ్ పూర్తయినట్లు తెలుస్తోంది. ఈ విషయాన్ని తాజాగా సోషల్ మీడియా ఖాతా ద్వారా సమంత తెలియజేశారు. జులై 13న తన జీవితంలో అత్యంత స్పెషల్ అని.. ఈ రోజున 'సిటాడెల్' వెబ్ సిరీస్ పూర్తయ్యిందంటూ తన ఇన్‌స్టా స్టోరీలో రాసుకొచ్చారు. ప్రియాంక చోప్రా, రిచర్డ్ మ్యాడెన్ జంటగా నటించిన హాలీవుడ్ వెబ్ సిరీస్ సిటాడెల్‌కు ఇండియన్ వెర్షన్ ఇది. దీనిని రాజ్ అండ్ డీకే దర్శకత్వం వహిస్తున్నారు.



పాన్ ఇండియా మూవీలో రోషన్

సీనియర్ నటుడు శ్రీకాంత్ కుమారుడు రోషన్ మేక చాలా పెద్ద ఛాన్స్ కొట్టేశాడని టాలీవుడ్‌లో టాక్. పాన్ ఇండియా మూవీలో ఛాన్స్ దక్కినట్లుగా తెలిసింది. ఇటీవల ఏక్తా కపూర్, మోహన్ లాల్ కలిసి ఒక పాన్ ఇండియా మూవీని ప్రకటించిన సంగతి తెలిసిందే. దీనికి నంద కిషోర్ దర్శకుడు. రోషన్ ఈ సినిమాలో మోహన్ లాల్ కొడుకుగా నటిస్తున్నాడు. ఇంతకు ముందు రాఘవేంద్రరావు పర్యవేక్షణలో వచ్చిన 'పెళ్లిసందడి సినిమాతో రోషన్ కథానాయకుడిగా ఆరంగేట్రం చేసిన విషయం తెలిసిందే. తాజా సినిమా తెలుగు, మలయాళంలో షఉటింగ్ జరుగుతోంది. విడుదల హిందీ, తమిళం, కన్నడ, మలయాళం, తెలుగు భాషల్లో ఉంటుందనేది పరిశ్రమల వర్గాల సమాచారం. యాక్షన్ చిత్రంగా ఉంటుందనీ, గ్రాఫిక్స్‌కి చాలా ప్రాముఖ్యం వుంది అని కూడా అంటున్నారు.



'హాయ్ నాన్న'

నూతన దర్శకుడు శౌర్యవ్ దర్శకత్వంలో నాని-30 భారీ బడ్జెట్‌తో తెరకెక్కుతోన్న విషయం తెలిసిందే. ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా రూపొందుతున్న ఈ సినిమాకు సంబంధించిన టైటిల్, గ్లింప్స్‌ని తాజాగా మేకర్స్ విడుదల చేశారు. ఈ సినిమాకు 'హాయ్ నాన్న' అనే టైటిల్‌ను ఖరారు చేశారు. వైర ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై మోహన్ చెరుకూరి (సివిఎం), డాక్టర్ విజయేందర్ రెడ్డి తీగల ఈ చిత్రాన్ని నిర్మిస్తుండగా, కోటి పరుచూరి సిఒఒగా వ్యవహరిస్తున్నారు. హృదయం ఫేమ్ కంపోజర్ హేషమ్ అబ్దుల్ వహాబ్ సంగీతం అందిస్తున్నారు. ఈ చిత్రాన్ని డిసెంబర్ 21న విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

నార్నే నితిన్ హీరోగా ...



'గీత గోవిందం' లాంటి హిట్‌ను అందించిన నిర్మాణ సంస్థ జీఏ2 పిక్చర్స్‌పై ఎన్టీఆర్ బావమరిది నార్నే నితిన్ హీరోగా సినిమా రానుంది. బన్నీ వాస్, విద్యా కొప్పినీడి ఈ సినిమాకు నిర్మాతలుగా వ్యవహరించనున్నారు. గురువారం నాడు ప్రారంభ కార్యక్రమం హైదరాబాద్‌లో జరిగింది. ముహూర్తపు సన్నివేశాలను ప్రొడ్యూసర్ అల్లు అరవింద్ క్లాప్ కొట్టి ప్రారంభించారు. దిల్‌రాజు కెమెరా స్విచ్ ఆన్ చేశారు. ఈ కార్యక్రమంలో దర్శకులు చందు మొండేటి, మారుతితో పాటు పలువురు సినీ ప్రముఖులు పాల్గొన్నారు. ఈ సినిమాతో అంజిబాబు కంచిపల్లి దర్శకుడిగా పరిచయం కానున్నారు. నార్నే నాని హీరోగా నటిస్తోన్న రెండో సినిమా ఇది. ఇందులో అతడి సరసన నయన్ సారిక హీరోయిన్‌గా నటిస్తోంది.

రోహిత్, జైస్వాల్ సెంచరీలు

భారత్ 245/2



డొమినిక: వెస్టిండీస్‌తో జరుగుతున్న తొలిటెస్ట్‌లో టెస్టు అరంగేట్రం ఓపెనర్ యశస్వి జైస్వాల్‌తోపాటు కెప్టెన్ రోహిత్ శర్మ సెంచరీలతో కదం తొక్కారు. భారతజట్టు రెండోరోజు టీ విరామ సమయానికి 81ఓవర్లలో రెండు వికెట్ల నష్టానికి 245 పరుగులు చేసింది. ఆ సమయానికి క్రీజ్‌లో జైస్వాల్(116నాటౌట్), కోహ్లి(4నాటౌట్) ఉన్నారు. గురువారం తొలి ఇన్నింగ్స్ ప్రారంభించిన టీమిండియాకు ఓపెనర్లు 229 పరుగుల భారీ భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. రోహిత్ శర్మ(103) అథనంజె బౌలింగ్‌లో డీ-శిల్వకు క్యాచ్ ఇచ్చి ఔటయ్యాడు. ఈ క్రమంలో రోహిత్ శర్మ, యశస్వి జైస్వాల్ అరుదైన ఘనతను సొంతం చేసుకున్నారు. టెస్ట్ క్రికెట్‌లో 17 ఏళ్ల తర్వాత వెస్టిండీస్ గడ్డపై 100 పరుగుల నమోదు చేశారు. శుభ్‌మన్(6) నిరాశపరిచాడు. తొలి ఇన్నింగ్స్‌లో వెస్టిండీస్ జట్టు 150పరుగులకే ఆలౌటైంది.

అరంగేట్రం టెస్ట్‌లోనే యశస్వి..

అరంగేట్రంలోనే సెంచరీ సాధించిన 17వ భారత బ్యాటర్‌గా యశస్వి జైస్వాల్ రికార్డు సృష్టించాడు. పదేళ్ల తర్వాత తన తొలి మ్యాచ్‌లోనే సెంచరీ చేసిన రెండో ఎడమచేతివాటం బ్యాటర్‌గా, ఓపెనర్‌గా తొలి టెస్టులోనే సెంచరీ చేసిన మూడో భారత ఆటగాడిగా జైస్వాల్ నిలిచాడు. టీమిండియా తరపున సుదీర్ఘ ఫార్మాట్‌లో అతి తక్కువ వయసులో (21 ఏళ్ల 196 రోజులు) సెంచరీ బాదిన నాలుగో ఆటగాడిగా జైస్వాల్ రికార్డు సృష్టించాడు. ఈ జాబితాలో పృథ్వీ షా (18 ఏళ్ల 329 రోజులు), అబ్బాస్ అలీ (20 ఏళ్ల 126 రోజులు), గుండప్ప విశ్వనాథ్ (20 ఏళ్ల 276 రోజులు) యశస్వి కంటే ముందున్నారు.

పురుషులతో సమానంగా మహిళా క్రికెటర్లకూ ప్రైజ్ మనీ

బిసిసిఐ సూచనలకు స్పందించిన ఐసిసి

లండన్: క్రికెట్‌లో లింగ సమానత్వం కోసం అంతర్జాతీయ క్రికెట్ మండలి(ఐసిసి) కీలక నిర్ణయం తీసుకుంది. ఇక ఐసిసి నిర్వహించే టోర్నీల్లో పురుష, మహిళా క్రికెటర్ల ఒకే రకమైన ప్రైజ్‌మనీని అందివ్వనున్నట్లు ప్రకటించింది. భారత క్రికెట్ నియంత్రణ మండలి(బిసిసిఐ) చేసిన ప్రతిపాదనకు ఐసిసి ఆమోదం తెలుపుతూ గురువారం నిర్ణయం తెలిపింది. భారత క్రికెట్‌లో సమాన వేతనాలు అందిస్తున్న బిసిసిఐ.. ఐసిసి నిర్వహించే టోర్నీల ప్రైజ్‌మనీలోనూ వ్యత్యాసం లేకుండా చూడాలని ఐసిసిని కోరింది. ఐసిసి బోర్డులోని ఇతర సభ్యులు కూడా ఈ ప్రతిపాదనకు అంగీకరించడంతో ఐసిసి మెగా టోర్నీల ప్రైజ్‌మనీ విషయంలో వ్యత్యాసం లేకుండా నిర్ణయం తీసుకుంది. ఈ విషయాన్ని బిసిసిఐ సెక్రటరీ జై షా సోషల్ మీడియా వేదికగా వెల్లడించాడు.

టి20 సిరీస్ కైవసం

- చివరి మ్యాచ్‌లో బంగ్లాదేశ్ మహిళల చేతిలో ఓటమి



మిర్పూర్: బంగ్లాదేశ్ పర్యటనలో ఉన్న భారత మహిళల జట్టు మూడో టి20లో పరాజయాన్ని చవిచూసింది. మూడు టి20ల సిరీస్‌లో భాగంగా గురువారం జరిగిన చివరి టి20లో బంగ్లాదేశ్ నాలుగు వికెట్ల తేడాతో టీమిండియాపై గెలుపొందింది. తొలిగా బ్యాటింగ్‌కు దిగిన భారత మహిళల జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్లకు 102 పరుగులు చేసింది. కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్(40), జెమీమా రోడ్రిగ్స్(28) మాత్రమే బ్యాటింగ్‌లో రాణించారు. స్మృతి మంధాన(1), షెఫాలీ వర్మ(11)తో పాటు యస్టికా భాటియా(12), అమన్‌జోత్ కౌర్(2), పూజా వస్త్రాకర్(2), దీప్తి శర్మ(4), మిన్ను మణి(1) నిరాశపరిచారు. బంగ్లాదేశ్ బౌలర్లో రబెయ ఖాన్(3/16), సుల్తాన ఖాతున్(2/17), నహిదా అక్తర్, ఫహిమా ఖాతున్, షోర్నా అక్తర్ తలో వికెట్ తీసారు. ఆ లక్ష్యాన్ని బంగ్లాదేశ్ 18.2 ఓవర్లలో 6వికెట్లు కోల్పోయి ఛేదించింది. షమీమా సుల్తానా(42), నహిదా అక్తర్(10నాటౌట్) బ్యాటింగ్‌లో రాణించారు. భారత బౌలర్లలో మిన్ను మణి, దేవికా వైద్య రెండేసి వికెట్లు తీయగా.. జెమీమా రోడ్రిగ్స్ ఓ వికెట్ పడగొట్టాడు. తొలి రెండు టి20ల్లో గెలిచిన హర్మన్‌ప్రీత్ సేన సిరీస్‌ను 2-1తో సిరీస్‌ను గెలుచుకుంది. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ షమీమా సుల్తానాకు ప్లేయర్ ఆఫ్ ది సిరీస్ హర్మన్‌ప్రీత్ కౌర్‌కు లభించాయి.

పట్టు బిగిస్తోన్న సౌత్‌జోన్

వెస్ట్‌జోన్ 129/7
దులీప్ ట్రోఫీ ఫైనల్



బెంగళూరు: దులీప్ ట్రోఫీ ఫైనల్లో సౌత్‌జోన్ జట్టు పట్టు బిగిస్తోంది. తొలి ఇన్నింగ్స్‌లో 213పరుగులకే పరిమితమైన సౌత్‌జోన్ జట్టు.. రెండోరోజు వెస్ట్‌జోన్‌ను 129పరుగులకే 7వికెట్లు కూల్చి పట్టు బిగించింది. సౌత్‌జోన్ ఓవర్‌నైట్ బ్యాటర్స్ వాషింగ్టన్ సుందర్(22), వైశక్(13) బ్యాటింగ్‌లో రాణించగా.. విద్వత్(8), కౌశిక్(0) నిరాశపరిచారు. దీంతో సౌత్ జోన్ జట్టు 78.4ఓవర్లలో 213పరుగులకు ఆలౌటైంది. ములానీకి మూడు, నగ్వాస్వల్లా, చింతన్ గాజా, ధర్మేంద్రసింగ్ జడేజాకు రెండేసి వికెట్లు దక్కాయి. అనంతరం వెస్ట్‌జోన్ ఓపెనర్ పృథ్వీ షా(65) అర్ధసెంచరీతో రాణించినా.. మిగతా బ్యాటర్ల నుంచి పృథ్వీ షాకు సహకారం లభించలేదు. మరో ఓపెనర్, కెప్టెన్ ప్రియాంక్ పాంచల్ 11 పరుగులకే పెవిలియన్ చేరగా.. నాలుగో స్థానంలో దిగిన ఛతేశ్వర్ పుజారా(9), ఐదో స్థానంలో వచ్చిన సూర్యకుమార్ యాదవ్(8) పూర్తిగా నిరాశపరిచారు.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68